UNIVERSAL LIBRARY
OU_204583
UNIVERSAL LIBRARY

OUP—552—7-7-66—10,000

**OSMANIA UNIVERSITY LIBRARY**

Call No. T83/M96M Accession No. T3648

Author శ్రీ మునిమాణిక్యం నరసింహారావు

Title రెండో కహాని

This book should be returned on or before the date
last marked below

సరస్వతీ గ్రంథమండలి

# మేరీ కహానీ

శ్రీ మునిమాణిక్యం నరసింహారావు

బి. ఏ, యల్. టి.

1946

రు 1/-

పబ్లిషర్సు : అద్దేపల్లి అండ్ కో

సరస్వతీ పవర్ ప్రెస్

రాజమహేంద్రవరము

అసలు కాపీరైటు హక్కులు గ్రంథకర్తవి
1948 సం. ఆఖరువరకు సరస్వతీ పవర్ ప్రెస్ వారివి

# ప్రకాశకుల కృతజ్ఞత

విఖ్యాతకథానకారచయితలు శ్రీ మునిమాణిక్యం నరసింహారావుగారు, తాము రచించియున్న 1. నేనూ మా కాంతం, 2. కాంతం కైఫీయతు, 3. మునిమాణిక్యం కథలు, 4 మునిమాణిక్యం నాటికలు, 5. కాంతం కాపరం, 6. ఉపాధ్యాయుడు, 7. మేరీ కహానీ, 8. తిరుమాళిగ అనే గ్రంథము లెనిమిదిన్నీ, మా ప్రకటనశాఖ యెడల తమకు గల ఆదరాభిమానములతో, అయిదు సంవత్సరములవరకును మేము మాత్రమే ప్రకటించుకొనే హక్కు మాకు దయచేసియున్నారు. ఇందుకు, వారికి మేమెంతయు కృతజ్ఞులము. అవన్నియు వెన్వెంటనే మేము ప్రకటింపబూనుకొన్నాము.

దొరబాబు అనే పుస్తకములో ఉన్న మూడుకథలు యీపై 1, 5 పుస్తకాలలో చేరిపోయినవి.

మరిన్నీ, ఇదివరకే వారు సర్వాధికారములతోడను మాకు దయచేసియుండిన "కాంతం కథలు" అనే గ్రంథమును, ఇప్పుడిప్పుడే మేము రెండవకూర్పు ప్రకటించి ఆంధ్రమహాజనులకు నివాళించుకొనియున్నాము.

రాజమండ్రి
1 జనవరి 1944

ప్రొప్రయిటరు
సరస్వతీ పవర్ ప్రెస్

Saraswathi Power Press, Rajahmundry
Printed and Published by
A. Lakshmanaswamy Naidu
For Addepally & Co., Educational Publishers
1st Edition 1946 No. 4167/1946

# పీఠిక

"మేరీ కహానీ" అని హిందీభాషలో ఈపుస్తకానికి పేరు పెట్టడములో గ్రంథకర్తకు హిందీమాధుర్యము తెలిసి ఉండవలె, హిందీ యావద్భారత దేశభాష అనే ఆదరమైనా ఉండవలె. "నాకథ" అనడముకంటె "మేరీ కహానీ" అనడములో వైచిత్ర్యము లేకపోలేదు.

ఈపుస్తకములో ఉన్నఘట్టాలు కేవలము ఈకథకుని చర్యలు అనుకోనక్కరలేదు. ఈయన జన్మించినది మొదలు నేటివరకు జరిగిన ప్రధానాంశాలని భావింపగూడదు. లోకయాత్రలో మిత్రులతో గాని ఇతరులతో గాని తనకు సమకూడిన కొన్నికొన్ని సన్నివేశాలను రచయిత రమణీయముగా వర్ణించాడు. అవి అన్నీ సముచితము లని కాని సార్థకము లని కాని సమాలోచన చెయ్యవలసినపని లేదు. "నాకథ" అని గ్రంథనామ ముంచి ఈయన తనచరిత్ర సమగ్రముగా లిఖించలేదే అని వైముఖ్యము చెందగూడదు. స్వీయచరిత్రలు వ్రాసి ప్రకటించేవారు సంపూర్ణసత్యాన్ని ప్రదర్శించలేరు. 'రూసో' మొదలయిన పాశ్చాత్యులు బట్టబయలుగా తమ సంగతులు ప్రపంచానికి ప్రకటించారని ప్రసిద్ధి. సూక్ష్మముగా చూస్తే ఆ రచనలలో కొన్ని యథార్థాలు అంతర్గానమయినట్లు అవగత మవుతుంది. కొన్ని కొన్ని సన్నివేశాలలో ఆత్మనింద అగుపడినా కడకు గ్రంథకర్తకే ఏదో విధముగా ఇంతో అంతో ఉత్కర్షహేతువు అవుతూ ఉంటుంది. ఆరోగ్యము కలిగిన విచక్షణుడు తనకు ఉత్కర్షసంపాదకాలు కాకపోయినా కొన్ని చిత్రచర్యలు చిత్రిస్తాడు. ఈగ్రంథకర్తకూడా అలా చెయ్యగలిగినాడు. ముఖ్యముగా మునిమాణిక్యము హాస్యప్రియుడు, ఆరోగ్యవంతుడు. అందుచేతనే తాను చిత్తు అయిపోయిన ఘట్టాలను కూడా గట్టిగా వర్ణిస్తాడు.

పురాణాలు తాత్పర్యార్థప్రతిపాదకాలు. ఆయాకథలలో, సన్నివేశాలు, సంఘటనలు, సత్యముగా జరిగినవని విశ్వసించనక్కరలేదు. ఒక్కొక్క కథగాని ఉపాఖ్యానము గాని, చదివినా, విన్నా, చివరకు తేలేఫలితమే ప్రధానము, "మేరీకహానీ"లో ఘట్టాలుకూడా తాత్పర్యార్థప్రతిపాదకాలు అంటే ప్రత్యవాయము లేదు. అలా అన్నప్పుడు అందులో విషయాలు అసలు జరగలేదని, కేవలకల్పితా లనీ భావించకూడదు. ఒక్కొక్క సన్నివేశము యథాతథముగా జరిగి ఉండవచ్చును. ఇంకొకఘట్టము కేవలము ఊహాజనితమ

కావచ్చును. మరొకస్థలములో కల్పనా, ఘటనా తిలతండులవత్ మిశ్రీకృతము కావచ్చు. సత్యాగ్రహమన్న సంభావనా విరహము లేకుండా సారస్యము జాలువారితే, రసికులు రమ్యమే అంటే చాలదూ ?

ఇందులో సందర్భాలు ఈ ప్రకారముగా నడవలే దని యథార్థవాదులు అన్నా నష్టము లేదు. వర్ణితవిషయాలూ, వాక్కులూ ఆయావ్యక్తుల స్వభావాలకు సంకేతముగా ఉంటేసరిపోతుంది. GOETHE మహాకవి స్వీయ చరిత్రకు POETRY AND TRUTH అని పేరు పెట్టినాడు. ఆయన యథార్థవాది, కాబట్టి చిరకాలముకిందటి ఘటనలు స్మరణకు తెచ్చుకొని వ్రాసినప్పుడు ఎంతసత్యము ఎంత రంజనము సమ్మిశ్రితాలయినవో నిర్ణయించుకోలేక గ్రంథానికి ఆనామము ఉంచినాడు.

మునిమాణిక్యం రచనలు ముద్దుముద్దుగా ఉంటవి. అత్యంత గంభీరవిషయములో నయినా హాసరేఖ మోసు లెత్తుతూ ఉంటుంది. చింతాక్రాంతస్థితిలో కూడా చిరునవ్వు చెలరేగుతూ ఉంటుంది. "నవ్వు నాలు గందాల చెరుపు" అనే లోకోక్తిని ఈయన ఉల్టా పల్టీ కొట్టించాడు.

నిత్యకృత్యాలను నిపుణముగా నిరూపించి, సామాన్యసంసారాలలో ఉండే స్వారస్యాలను కొల్లబెట్టిన సిదహస్తుడు శ్రీ మునిమాణిక్యం. ఈయన లేఖిని వివిధగతులలో వెళుతూ ఉంటుంది. సామాన్యవిషయము చెప్పినా, నడుమ నడుమ నవ్విస్తూ ఉన్నా, జీవితములో గభీరసత్యాలను కాంతాసమ్మితముగా కొంతవరకు ఈకథకుడు విధిస్తాడు. ఈయనరచనలలో జుగుప్సాకరాలు, అశ్లీలాలు, అమంగళకరాలు, ఆర్యేతరాలు లేవు.

ఇతి శివమ్ !

సాహితీ సమితి
జూన్ ౧౫, ౧౯౪౩

తల్లావజ్ఝల శివ శంకర శాస్త్రి.

---

"మేరీ కహానీ" అంటే నాకథ. నాకథరచించేవారు ఎవ్వ[illegible] దొరకక నాసంగతులు, నేనే వ్రాసుకొంటున్నాను. నాజీవితం[illegible] కొన్ని సంఘటనలు ఇవి.

—మునిమాణిక్యం నరసింహారావు.

# మేరీ కహానీ

## 1

ఒకసారు నేను రైల్లో ప్రయాణం చేస్తున్నాను. ఆ పెట్టెలో ఉన్నవాళ్లా నేనూ, నంగోక ఆయన; కాకపోతే ఆ మూల ఒక ముసలమ్మ కూర్చొని కునికిపాట్లు పడుతూంది. కాసేపు నేను నా మనసు ఉక్కులా చూశాను. ఈ పెట్టెలో ఇమైమం: కూర్చొ త్ర అనే ప్రేటక నాలుగుసార్లు చదివాను. ఇన్నడప్పు అప్పారాలు తెలుసు అప్పుడాల్లాగే ఉన్నాయని మళ్ళీ అనుకొన్నాను. రైలు ఎక్కినప్పుడల్లా ఇల్లా అనుకొంటూనే ఉంటాను. పైనాకిందా చూశాను. కిటికీలోనుంచి బైటికి తొంగిచూసి చెట్లు పరుగెత్తటం గమనించాను. ఎంతసేపని ఇల్లా కాలం గడపగలను? చివరకు నా పక్కన కూర్చున్న ఆయన వంక చూశాను

ఆయనా నావంక చూచి, "ఏ ప్రారంభి మీది?" అని అడిగాను. నేను చెప్పాను. ఆయనది ఏవూరైంది నాకు చెప్పాడు. అంతటితో సంభాషణ అయిపోయింది. దాని తరువాత ఏం చేయాల్సింది తోచలేదు.

ఆయనేదో పుస్తకం చూస్తున్నాడు. "ఏమిటండీ ఆ పుస్తకం?" అన్నాను నేను. "ఇది ఆడవాళ్ళ పుస్తకం అండి; ఇందులో పొడుపుకథ లున్నాయండి" అన్నా

డాయన. అక్కడనుంచి కాసేపు పొడుపు కథలమీద ప్రసంగించాను.

"పొడుపుకథలు విజ్ఞాన పేటికలు. తెలుగుతనం ఉంది వాట్లో. తెలుగు నుడికారం తెలుసుకోవాలంటే పొడుపు కథలు చూడాలె. పొద్దు పోవటానికి వాటి ప్రయోజనం చెప్ప నక్కరనే లేదు. మనస్సుకు ఉత్తేజం కలుగచేసి, ఆనందాన్ని ఇస్తయి" అని చెప్పాను. ఆయనా నాతో ఏకీభవించాడు.

అయితే మనం ఇద్దరం పొడుపుకథలు వేసుకొందామా అన్నాడాయన. ఎట్లా కాలం గడుస్తుందా అని చూస్తూన్న నేను వెంటనే సరే అన్నాను.

అయితే ఒకటి అన్నాడాయన—"చూడండి కథలు వేసుకొనేప్పుడు పందెంకూడా పెట్టుకొంటే ఇంకా తమాషాగా ఉంటుంది. పట్టుదల వస్తుంది. అది ఉంటేనే ఏ ఆటలోనైనా ఆనందం— ఏమంటారు!" అన్నాడు—

నిజమే ఆమాట— అందుకని "సరే పందెం పెట్టుకొందాం— రూపాయి రూపాయి పందెం" అన్నాను నేను. "సరే దానికేం కానీండి, మీరు చదువుకొన్నవారు. చప్పున గ్రహించి చెప్పగలరు. నేను చదువుకోలేదు. కాబట్టి పందెంలో మీరు చెప్పింది నేను ఇవ్వలేను" అన్నాడాయన.

"నేను కథ విప్పలేకపోతే రూపాయి ఇస్తాను— మీరే

వేస్తారు చెప్పండి" అన్నాను. నేను అర్థమూపాయి ఇస్తా నన్నా డాయన. బాగానే ఉంది. నేను బియ్యే వ్యాసులయి లోకానుభవం కలవాడిని. ఆయన పామరుడు. అదీకాక ఆపొడుపు కథల విషయమై నేను ప్రత్యేకం కృషిచేశాను. నాకు ఎన్నోకథలు నోటికివచ్చు. వాటి విడక, నిర్మాణం అంతా నాకు తెలుసు. ఈ పొడుపుకథల్లో ఎంత విలువైన విజ్ఞానం మూసుకుని ఉందో చూపిస్తూ ఒక వ్యాసం ఇంగ్లీషులో వ్రాసి ప్రచురిస్తే ఇతర దేశాల్లో కొంతమంది కూడా, దాన్ని మెచ్చుకొన్నట్లు నాకు ఉత్తరాలొచ్చినై. అందుకని నేను సరేనని పందానికి ఒప్పుకొన్నాను.

"ముందు నేను పొడుస్తాను. మీరు విప్పండి" అన్నా డాయన. "ఎవరు ముందు వేస్తే ఏముందీ! మీరే ముందు వేయండి పోనీ" అన్నాను నేను. ఆయన తల పైకెత్తి ఆలోచించసాగేడు. ఒక్క నిమిషం నేను ఆయన ముఖంవంకే తదేకదీక్షగా చూస్తూ కూర్చున్నాను. ఆయన ముఖం చిట్లించాడు. ఈయనకు ఏమీ రావు కాబోలు అనుకొని నేను నవ్వుకొన్నాను. ఆయన తన రెండు కళ్ళనూ రెండు వేళ్ళతో నొక్కుకొని, దీర్ఘనిశ్వాసంచేసి ముక్కును ఆ వేళ్ళ తోనే లాగి నొసలు ఒత్తుకొని నానా అవస్థ పడి చివరకు తెప్పరిల్లి, "ఊఁ చూడండి మనిషీకాదు గుర్రం కాదు"...... అని ఆగాడు. నేను "ఇంకెందుకూ, నాకు తెలిసిపోయింది. గ్రీకు పురాణకథలలో సెంటారులు అనేవాళ్ళను వర్ణించారు.

వారు అధోభాగంలో అశ్వరూపం ఊర్ధ్వభాగంలో మానవ రూపం" అని పకపకా నవ్వాను. ఆయన ముఖం చిట్లించుకొని "అది కాదండీ నేను చెప్పేది మీరు సాంతం వినకుండా చెప్పేస్తే ఎట్లా?"- అన్నాడు. "చిత్తం చెప్పండి. కొసటూ చెప్పండి" అని అంటూ ఆయనకు మరింత దగ్గరగా జరిగి కూర్చుని, ఇందాకటికంటే ఎక్కువ శ్రద్ధగా వినటానికి తయారైనాను.

"మనిషీ కాదు, గుర్రమూ కాదు— ఒక్కటే కన్ను— మూడే కాళ్లు" ఏమిటో చెప్పండి అన్నాడు—

గ్రీకు కథల్లో ఒక కన్ను ఉన్నది సైక్లోప్సనే— కాని వాడికి రెండుకాళ్ళు— మూడుకాళ్లున్న జంతువుగాని, మనిషిగాని ఎక్కడా ఉన్నట్లులేదు. కల్పితమైనా అల్లాంటి కల్పిత మృగాన్ని ఏ కథలోనైనా వర్ణించారా అని చూస్తే నా ఊహకు ఏమీ తోచలేదు. అదే నేను మొదటిసారి కథ విప్పలేక ఓడిపోవటం! నాకు పొడుపు కథల్లో ఇంతపాండిత్యమూ ఉండి చివరకు ఓడిపోవాల్సి వచ్చిందే అని విచారం వేసింది. "పర్సుతీసి రూపాయీ బల్లమీదపెట్టి— "నేను చెప్పలేను. ఓడిపోయినాను. రూపాయి తీసుకోండి" అన్నాను.

ఆయన రూపాయి తీసికొని ఒకసారి మోగించు చూచి మెదలకుండా జేబులో వేసుకొన్నాడు— "అదేమిటండోయ్! మీరు కథ విప్పాలె. నేను చెప్పలేక పోయినపుడు"

అన్నాను.

ఆయన పర్సు తీసి ఒక అర్థరూపాయి బిళ్ళ నా ముందు పెడుతూ, "నాకునుటుకు తెలిసేస్త్రింపే చెప్పటానికి!— చెప్పలేను. నేనూ ఓడిపోయినాను. అర్థరూపాయి తీసుకోండి" అంటూ ఆయన సంచి చేతికి తగిలించుకొని గొడుగు చంకలో పెట్టుకొని వెళ్ళిపోయినాడు.

## 2

నాటకంలో వేషం వేద్దామని నాకు ఎన్నాళ్ళనుంచో స్తుందా— స్కూలుమాస్టర్, యాక్టింగు లాంటిదేనని నా ఉద్దేశం— ఇద్దరికీకూడా వేషం వేసుకోవలసిన అవసరం ఉంది. చిరిగిపోయిన పాత కోటూ, మాసిన తలగుడ్డతో మాస్టరు తయారవుతాడు— విగ్గు వేసుకొని చమ్కీకోటు తగిలించుకొని ఆయన తయారవుతాడు. ఇద్దరికీకూడా ఒక సమాజంముందు తను నిర్వహించవలసిన బాధ్యత ఉంది. క్లాసులో కుర్రవాళ్ళని మాట్లాడకుండా వినేటట్టు చేయటం మాస్టరుయొక్క నేర్పరితనంమీద ఆధారపడి ఉంటుంది. అందుకని మంచి మాస్టరు అయినవాడు మంచి యాక్టరు అవుతాడని నాకు గట్టినమ్మకం.

కాని ప్రపంచం ఈవిషయమై గుర్తించినట్టు కనపడ్డంలేదు. మాస్టరు ఎంత విద్వాంసుడైనా ప్రపంచం వాడిని ఓ తెలివి తక్కువ దద్దమ్మక్రింద చూస్తుంది. సమాజం యాక్టరును

కళోపాసకుడని మెచ్చుకొని గౌరవిస్తుంది. మంచి యోగ్యుడైన వాడిని ఏనుగపై ఎక్కించి ఊరేగిస్తారు. ఆయనపై పద్యాలు చదివి, పుష్పాలు వర్షిస్తారు. మాస్టరుకు అల్లాంటి గౌరవం జరగటం నేనెరగను. వాణ్ని దేనిపైన ఎక్కించరు. ఎక్కించటం అంటూ వస్తే ఆయన పేరు, అంటే అసలు పేరుగాదు. ముద్దుపేరు, గోడలపైకిమాత్రం ఎక్కిస్తారు. పంచరత్నాలు కట్టి అచ్చువేయరుగాని, ఆయన కీర్తింతా రెండుపాదాలుగల ద్విపదలాంటి పద్యాలలో ఇమిడ్చి బోర్డు మీద, అక్కడా వ్రాస్తుంటారు. అంతే ఇల్లాగ మేస్టరుకు కేవలం అన్యాయం జరగటం చూస్తూకూడా మనం ఏమీ చేయకుండా ఊరుకొంటున్నాము.

ఇంతకూ నేను ఒకనాటకంలో వేషం వెయ్యాలని సరదా పడ్డానని చెప్పాను. మనస్సులో ఈ కోరిక పెట్టుకొని ఎన్నాళ్ళో బాధపడ్డాను. వేద్దామూ వద్దా అనీ. తీరా వేస్తే, కుఱ్ఱవాళ్లు అల్లరి చేస్తారేమోనని, భయం. నేను ఏ వేషం వేస్తానో ఆవేషం పేరు నాకు తగిలించి నన్ను ఆ పేరుతో పిలుస్తారు. ఇది నా భయం. చివ్వరకు నాకు ఓ సంగతితోచింది. ఓ పేరు తగిలిస్తారూ? అంతేగా! ఇదివరకు మనకు పేరులేకపోతేగద భయం. పోనీరెండు పేర్లు అవుతై. దేవుని దయవల్ల నేనందులో కీర్తి సంపాదించి అనేక వేషాలు వేయటం సాగించినతరువాత ఎన్ని పేర్లని తగిలిస్తారూ? పోనీమరచిపోకుండా అన్నిపేర్లు తగిలిస్తారే అను కొందాం. అట్లా అయి

నా మరేం దిగులుపడాలిసిన పనిలేదు. భగవంతుడంతటి వాడికి ఉన్నాయి సహస్ర నామాలు. ఈ మానవుడికి నాలుగు పేర్లుంటే ఏమిటా అనుకొని, ఎట్లాగయినాసరే ఏదో నాటకంలో ఓ చిన్న వేషం అయినా వేదామని నిశ్చయించుకున్నాను.

మావూళ్ళో రెండు మూడు నాటకం కంపెనీలుఉన్నాయి. వాళ్ళను అడిగాను నాకేదైనా ఒకచిన్నవేషం ఇయ్యమని. వాళ్ళందరూ మహాకొమ్ములు తిరిగిన నటకులు అయినట్లూ, నేనెందుకూ పనికిరాని వాణ్ణి అయినట్లూ వాళ్ళు మాట్లాడటంచూస్తే నాకు అరికాలిమంట నెత్తికెక్కింది. కాని ఏంలాభం! వాళ్ళను కాస్తమంచి చేసుకోక తప్పిందికాదు. ఏదైనా ఒక చిన్న వేషం ఇయ్యమని ప్రాధేయపడ్డాను. అందులో ఒక కంపెనీయజమానికి నాయందు దయకలిగింది. నన్నొకచిన్న ఆడవేషం వేయమన్నాడు. రాణిగారి ముందు ఏవో రెండుముక్కలు అనాలె అంతే.

అందుకు నేనేమీ విచారపడలేదు. సరేనని సంతోషంగా ఆ పాత్రఅయినా నిర్వహించటానికి ఒప్పుకొన్నాను. అసలు నాటకంలో అల్లాంటి పాత్రఏమిలేదు. నాకోసమని సందర్భానుకూలంగా, ఔచిత్యానికి భంగంలేకుండా ఉండే పద్ధతిలో ఆ చిన్న కారక్టరున్నూ నా సలహామీదే వాళ్ళు ఏర్పాటుచేశారు. నేనూ సంతోషించాను.

చిన్న పాత్రఅయినా దాన్ని గొప్పగా నిర్వహిద్దామని నిశ్చయంచేసుకొన్నాను. ఇప్పుడు కొమ్ములు తిరిగిన నటకు

లమని చెప్పకునేవాళ్ళు ఒకప్పుడు మొదట్లో ఈమోస్తరే ప్రారంభించిఉంటారు. అందాకాఎందుకు చిత్తూరునాగయ్యమొదట కల్లుపాట పాడాడు. దానితరువాత ఇప్పుడు "తార"—కాదు "గ్రహం"—అయి కూర్చున్నాడు. కాబట్టి ఈ చిన్న విషయంలో కూడా నా తెలివి తేటలు చూద్దామని సర్దుకుంటు కొన్నాను.

నటకుల బాధ్యతలను గురించి నేను అనేక వ్యాసాలు వ్రాశాను. రాజరాజ నరేంద్రుడు ఏకాలపువాడో ఆకాలంలో రాజులు వేసుకొనే దుస్తులు ఎలాంటివో మొదలగు విషయములు నటకుడు శ్రమపడి తెలుసుకొని, ఆదుస్తులు అన్నీ తానే స్వయముగా కుట్టించుకొని అప్పుడు రాజరాజు వేషంవెయ్యాలి. మంగలి, పొదిలేకుండా క్షవరం చేయటానికి రాడు. వడ్రంగి, చిత్రిగుల్ల లేకుండా రాడు. అల్లాగే తాను వేసే వేషానికి ఉచితమైన దుస్తులులేకుండా నటుడు రాకూడదని గట్టిగా వాదించాను. ఇప్పుడుతీరా నేను వేషం వేయువలసినప్పుడు అనంతా మరచిపోయి మామూలు వేషధారణచేస్తే నలుగురూ నవ్విపోతారు.

నేను వేసే వేషం చిత్రాంగి దగ్గరఉండే ఒక చెలికత్తె వేషం, రాజరాజ నరేంద్రుడు పదకొండో శతాబ్దివాడు. కాబట్టి ఆ శతాబ్దిలో పురుషులూ, స్త్రీలు వేసు[illegible] విషయం తెలుసుకొన్నాను. రాణి వాసంలో, [illegible] [illegible] [illegible] మెల్లాగ ఉండేవారో వారిదుస్తులు [illegible] విషయాలన్నీ పరిశోధన చేసి వాళ్ళకు చెప్పాను. [illegible]

చూపించి, దుస్తులు ఇల్లాగ ఉండాలని కూడా చెప్పాను. వాళ్లు తెల్లపోయి విన్నారు.

నన్ను గురించికాస్త మెప్పుదల గానే మాట్లాడారు. మీరు కూడా ఇల్లాంటిదుస్తులు కట్టించండి. అని నేనంటే, వాళ్ళు నవ్వి ఊరుకొన్నారు. వాళ్ళుతమ భార్యలను గుర్తించరు నేను వాళ్ళలాగా ఎల్లాప్రవర్తించేది? అందుకని అప్పటి కాలపు రాణివాసపుస్త్రీలు ధరించేలాంటి చీర, రవిక, ఆభరణాలూ అన్నీ సంపాదించుకొన్నాను. దీనికకొంత ధనం కూడా వ్యయమైంది. వేషం వెయ్యాలిసిన రోజు కోసం నిరీక్షిస్తూ కూర్చున్నాను.

సరిగ్గా ఆ రోజున నేను పట్టి ఆమర్దా ఇంతా అంతా కాదు. వేషధారులంతా సరిగ్గా ఆసమయానికి మొదటినుంచో వచ్చి ఆదరా బాదరా ఇంతరంగు పూసుకొని తయారౌతారు కళ యందు ఆసక్తి ఉండి, తన బాధ్యతను గుర్తెరిగిన మనిషిచేసేపని అదికానే కాదు. నేను ఆదర్శప్రాయంగా ప్రవర్తించాలని అనుకొని, నేనుతయారుజేసుకొన్న దుస్తులను ఆభరణాలను ఒక పెట్టెలో పట్టించుకొని సాయంత్రం ఆరుగంటలకే హాలుదగ్గరకి వెళ్ళాను. అప్పటికి రావలసిన వాళ్ళు ఎవరూరాలేదు. సడీ చప్పుడూలేదు. దీపంకూడా లేకపోవటం మూలాన ఒక గంటసేపు ఊరికేనే విచారుచేస్తూ కాలం గడిపాను. దీపం రావటంతోనే నేను రంగు వేసుకోటం ప్రారంభించాను. [illegible] కాస్త రంగు పులుముకొన్నతరువాత జ్ఞాపకంవచ్చింది [illegible] వేయాలిసింది ఆడవేషం, మీసం గడ్డం తీసే యాలని. నేను

కొన్న ఆకాస్తరంగా కడిగేసు కొని మంగలికోసం మళ్లీ కూర్చున్నాను. టైము అయిపోతున్నదే అని నాకు ఏమిటో ఆదుర్దా. నాటకంలో సగానికిపైగా గడిచిన తరువాత నేను స్టేజీమీదికి వెళ్ళాలె. తొందర ఏమీలేదు. అయినా ఏందుకో లేనిపోని హడావుడి పడ్డాను.

ఎనిమిదిన్నర కు కామాలు మంగలివచ్చి కత్తి నూరాడు. నీకేమీ తొందరలేదయ్యా అని చెబుతున్నా వినక అందరి కంటే నేనే ముందుగా క్షవరం అయినాను. ఆతరువాత నేను స్వంతానికి తెచ్చుకొన్న అద్దం ముందు యథావిధిగా రంగు పూసుకొన్నాను. చీరగట్టుకొని రెవిక తొడుక్కొని ఆభరణా లన్నీ పెట్టుకొని ఠీకుగా తయారైనాను. చిత్రాంగి చెలికత్తె బాగుందే! అని అన్నారు అంతా. రాణివాసంలో ఉండే వాళ్లు నిజంగా చాలా అందమైనవాళ్లు ఉంటారనీ, రాణికంటే కూడా వాళ్లే ఆకర్షనీయంగా ఉండే వారని చరిత్రలో ప్రమాణం ఉంటనీ, కావలిస్తే చూపగలనూ ఆనటా అనీ వాళ్ళు అట్టే మాట్లాడకుండా చేయగలిగాను.

చదువుకొన్న వాళ్ళు వేషం వేస్తే వాళ్లకు ఉండే గౌరవం వేరు. ఇతరులు సామాన్యులు వేస్తే వార్ల కుండే గౌరవం వేరు. నా వేషాన్ని జూచి అంతా ఆశ్చర్యపోయినారు. అజంతా చిత్రాలలోచూచే ఆభరణాలు అవీ చూచి, వేషధారణలో ఉన్న అందంచూచీ, అంతాకూడా, చూశారో! పంతులు గారు ఎంత స్టడీ చేశారో, ఆహార్యం విషయమై, అని మెచ్చు

కొని బుజం మీాద తట్టారు. నిజానికి ఆవిషయంలో నేనుచేసిన స్టడీ వాళ్లెవ్వరూ చెయ్యలేదు కాని. ఆసమాజికులు ఎవ్వరూ ఈవిషయాల్ని మనస్ఫూర్తిగా గ్రహించలేరు. ఏవో ఇచ్చకపు మాటలు అన్నా నన్ను నిజంగా మెచ్చుకొన్నట్టూ తోచలేదు.

ఇక వాళ్ళవేషాలు జూస్తే మన నాటకకళ ఇంత అధ్వానంగా ఉందేమా అని విచారం కలగకమానదు. చిత్రాంగి నల్లని సిల్కు రెవిక తొడిగి, బనారసుచీర కట్టింది. వంకరపాపిడితీసి జుట్టుముడిలో అర్ధచంద్రాకారంగా పూలు పెట్టుకుంది. పైగా చేతికి రిస్టువాచీ ఒకటి ! ఆకాలం నాటికి రిస్టువాచీలు ఎక్కడి వయ్యా అని నేను అడిగితే వాళ్ళునవ్వటమేకాని సరియైన సమాధానం చెప్పలేదు. చివరకు నేనొకటి అనుకున్నాను. వాళ్ళు ఎల్లాగుంటేనేమి నేమటుకు ఆదర్శప్రాయంగా ఉండాలని.

గ్రీనురూములోకి వచ్చిన ప్రతివ్యక్తి నన్ను ఎగాదిగాచూచి ఆశ్చర్యపోసాగినారు. నాటకం ప్రారంభించారు. నేను స్టేజిపైకి వెళ్ళి నాకళా వైదుష్యాన్ని చూపవలసినసీను ఎప్పుడోవస్తుంది. నేను నాపోర్షన్ మరోసారి చదువుకొన్నాను. ఉన్నవి నాలుగు ముక్కలే నాయి !! ఇక చదవటం అనవసరం అనిపించింది. కాని ఏమిచేయటానికి తోచిందికాదు. అమితంగా ఉక్కపోస్తుంటే విసురుకుంటూ కూర్చున్నాను. విసుక్కొత్తింది ఎంత సెపటికీ నేను వెళ్లాలిసిన సీనురాదు. నేను మాటిమాటికి స్టేజిలోకి తొంగిచూచి, మళ్లీ వచ్చి కుర్చీలో కూర్చుని విసురుకోటంచూస్తే చూసే వాళ్ళకే జాలివేసింది.

ఆ సమాజికులలో ఒకాయన విద్యార్థి. నా అవస్థజూచి ఆ కుర్రాడు మరీజాలిపడి నాదగ్గరకొచ్చి "మాస్టారూ ఇంకా రెండు గంటలకుగాని మీకో పలరాము. మీరెందుకు ఇల్లాగ అవస్థపడతారు. పడక కుర్చీ తెప్పించి వేస్తాను. నడుంవాల్చి, హాయిగా పడుకోండి. నిద్రలేకపోతే మీకు జబ్బు చేస్తుంది కూడాను" అంటూ జవాన్ను పిలిచి మంచి పడకకుర్చీ ఒకటి తెప్పించి వేయించాడు.

ఆకుర్రాడు అక్కడవాళ్ల పెత్తనంచేస్తూ, కావలసినప్పుడు ప్రాంప్టుచేస్తూ హడావడి చేస్తున్నాడు. అతని మాట అంతా వినటం, విధేయతకనపర్చటం చూస్తే, అతనికి ఆకంపెనీతో ఏదో గట్టి సంబంధమే ఉందని తోచింది. సరేనని నేనూ కుర్చీలో జేర్లబడ్డాను. అతన్ని దగ్గరకుపిలిచి, "చూడూ! ఏమోయ్! నాకు కాస్త కునుకుపడితే పట్టుచ్చు. ఆ సమయానికి నన్ను లేపుతావుగదూ?" అన్నాను. ఆయన నాలిక కొరుక్కొని "అదేమిటండి మాస్టారూ! అల్లా అంటారు? యెవరికోసం లేపుతామండి!! మీకోసమా?" అన్నాడు. నేను వట్టి తెలివితక్కువగా మాట్లాడానని తోచింది. ఎందుకంటే నేను లేకపోతే వాళ్ళ నాటకం యెల్లాజరుగుతుంది, పిచ్చిప్రశ్న కాకపోతేనాది! నా తెలివితక్కువకు నేనే నవ్వుకొని కన్నుమూశాను.

"నా వేషంజూసి జనం ముగ్ధులైపోతారు. నేనవలసినవి నాలుగుముక్కలే అయినా ఆ అభేద్ధతిజనాన్ని తప్పకుండా ఆకర్షిస్తుంది భగవంతుడిదయ ఎల్లాగుందో! నేను ముందుముందు పెద్ద

పెద్ద వేషాలు వేసి నైపుణ్యం చూపించి స్థానాన్ని వాళ్ళని తలదన్ని పోతే పోనేవచ్చు. అటువంటి కీర్తివస్తే ఈఉద్యోగానికి రాజీ నామాఇస్తాను. నెలకు రెండు మూడువందలు సంపాదిస్తాను'' అని నాలోనేను ఊహించుకొన్నాను. ఊహమీద ఊహరావటంలో నేను ఉన్న ఉద్యోగం వదులుకోటంమంచిదికాదనీ, ఈవృత్తిలో ఉంటూనే శని ఆదివారాల్లో మాత్రమే నాటకాలు ఆడటానికి ఒప్పుకోటం మంచిదనీ నిశ్చయించుకొన్నాను— నేనుఅనాల్సి వనాలుగు ముక్కలకూ అనుగుణ్యమైన అభినయంకూడా ఇల్లా ఉండాలని అనుకొన్నాను.

నాలుగుముక్కలకు అభినయంకూడా ఏమిఉంటుంది అని అనుకోవద్దు, రలేను. ఏచిన్నమాటైనా అభినయించవచ్చును. 'రాముడు రావణుని చంపెను' అన్నమాటను విచారంగానూ అనవచ్చు' వీరరసం ఒప్పిస్తూ, సంతోషంగానూ అనవచ్చు— అనేవాడి తెలివితేటలతో ఉంటుంది. అని అనుకొంటూ ఉండంగా నే కొద్దిగా కునుకు పట్టింది. అయిదు నిమిషాలు గడవకముందే మొదుకో ఉలిక్కిపడి లేచాను. లేచి మళ్ళీవెళ్ళాను, నాటకం ఏస్థితి లో ఉందో చూడటానికి. ఇంకామొదట్లోనే ఉంది.

ఇంతలోకే ఆకుర్రాడు మళ్ళీవచ్చి, 'మాస్టారూ! పాపం నిద్ర లేక నీరసించి పోతున్నారు. ఇల్లాగమీరు నిద్రలేకుండా ఉంటి రాఅంటే, ఆనెక్కుమీరుమీపాత్రను నిర్వహించటంలో జంకిపో తారు. తూలిపోతారుకూడాను. హాయిగా పడుకోండి విశ్రాంతి తీసుకోండి. నేనెందుకు చెపుతున్నానో వినండి. మీదగ్గరనుంచి

ఆడియన్సు ఎక్కువగా ఎక్స్పెక్టు చేస్తారు. ఆసమయానికి నిద్రముఖంతో గనక మీరు కనపడితిరా, వాళ్లెంతో నిరుత్సాహపడిపోతారు. అదీనాగోల'— అని యెంకో ఇద్దైనాడు—సరేనని నేను మళ్ళీ కుర్చీలో పడుంవాల్చి యేదో తియ్యని ఆలోచనల్లో పడ్డాను. మెలకువగా ఉందామని అనుకొంటూనే నిద్రపోయినాను.

మధ్యమధ్య ఉలిక్కిపడిలేచి, నాకెదురుగాకన పడ్డవాణ్ణి యేమయ్యా! నేనురావాలా? అనిఅడిగేవాడ్ని. పడుకోండి మాస్టారూ ఇప్పుడేమీతొందరలేదూ అని అంటూ ఉండేవాడు. అందరు నాకు తెలిసినవాళ్లు. అందరికి నేనంటే గౌరవమూను. అందుకని ఎవ్వరిని అడిగినా ఆయన విషయంగా, తొందరలేదండీ పరాస్టారూ, సమయంవచ్చినప్పుడు వాళ్లే వెతుక్కుంటూవచ్చి మిమ్ముల్ని తీసుకెడతారు. ఎందుకు నిద్ర చెరుపుకుంటారు అని చెప్పేవాడు. అదే మొదటిసారి స్టేజీ ఎక్కటం కాబట్టి చిన్నపిల్లవాడిలాగ ఆదుర్దా పడుతున్నాను, తెలివితక్కువ, అని మళ్ళీ నన్ను నేనే చీవాట్లువేసుకొని, ఈసారి హాయిగా ఒక్కనిద్ర తీద్దామని నిశ్చయించుకొన్నాను. ఈనిశ్చయంతో మనశ్శాంతి కుదిరి చక్కని నిద్ర పట్టింది.

ఎంతసేపు నిద్రపోయినానో నాకైతే తెలియదుకాని నేను మళ్ళీ, నిద్రలేచేసరికి ఏదోచాలాసేపు అయినట్లూ, నాటకం దాదాపుఅయిపోతున్నట్లూ,లీలగాతోచింది.ఒక గెంతుగెంతా నుస్టేజివైపుకు-నాటకం ఏస్థితిలోఉందోచూద్దామని. రాజరాజూ

చిత్రాంగీ ఉన్నారు చిత్రాంగి నేరము బైటపడింది. ఆమె కలవరింతవల్ల, రాజుకొడుకును అన్యాయంగా చంపుకొన్నానే అని విచారంతోను, చిత్రాంగి ఇంత ద్రోహం చేసిందే అన్నకోపంతోనూ, క్రుంగి, కుమిలిపోతున్నాడు. ఇంకా పది నిమిషాలులో నాటకం అయిపోయే స్థితిలో ఉంది.

మొదట నేచూసింది నేను నమ్మలేకపోయినాను. దానితరువాత, జరిగిన మోసం స్పష్టంగా తెలిసింది. ఏముందీ, నేను వెళ్లి చెప్పవలసినసీను దాటిపోయింది. నాతో పనిలేకుండానే వాళ్ళు పని జరుపుకొన్నారు. నన్ను వదలేశారు. నన్ను మోసపుచ్చారు. నాచేత ఇంత వేషమూ వేయించి, చివరకు నన్ను ఫూల్‌ను చేశారు.

ఈ సంగతి నా ఊహకు తట్టేసరికి నాలో రక్తం అంతా కరుడుగట్టి పోయింది. నిశ్చేష్టుడనై పోయినాను. ఒక్క నిమిషం నోట మాటరాలేదు. శూన్యదృక్కులతో మోడునై నిలబడిపోయినాను.

రెండునిమిషాలు గడచిన తరువాత నానిరుత్సాహం నిస్పృహ, ఏదో మార్పుకులోనై కోపంగా మారినయి. వళ్లు మండిపోయింది. ఆపాదమస్తకం కంపించింది. కోపాగ్ని నన్ను దహించివేసింది—ఆకోపం మళ్లీ ద్రవించి దుఃఖంగా మారింది. చివరకు ఎల్లాగో తెప్పిరిల్లి నాకు ఎదురుగా నుంచున్న పెద్ద మనిషిని ఉద్దేశించి ఏమయ్యా! నన్ను ఒక్కరూ లేపారుకారూ? అని అడిగాను. ఆపెద్దమనిషి నవ్వి ఊరుకొన్నాడు. ఆయన

నవ్వటం నాకు మరీ అవమానం అనిపించింది. నన్ను పడుకొని నిద్రపొమ్మని ప్రోత్సహించిన కుర్రవాడు ఎక్కడా కనిపించలేదు ఏంజెయ్యను ?

అంతసరదా పడి ఆరుగంటలకే వేసుకొన్న వేషం ఏం చెయ్యాలె? ఎంతకష్టపడి స్టడీచేశాను ! ఈ వేషాన్ని !! మీసం కూడా గొరిగించుకొని ఆడవేషం వేశాను ! ఎంత మోసం జరిగిందీ ! అని నేను గోలపెట్టినా ఎవ్వరు జాలిపడలేదు......
...సరిగదా, పైగా నవ్వటం సాగించారు.

ఆ క్షణంలో ఒక చిక్కని విషయం తట్టింది నాకు. ఇక ఆలోచించలేదు ఒకరికి చెప్పలేదు. ఒకరిసాహాయం పుచ్చుకోలేదు చటుక్కున స్టేజిమీదకి వెళ్లి నిలబడి, నేను అనవలసిన నాలుగు ముక్కలూ అనేశాను. ఈమాటలు విని రాజు నిర్ఘాంతపోయి నాడు. చిత్రాంగి తెల్లపోయిమాటింగ. ప్రేక్షకులు అంతా సందర్భమూ, ఔచిత్యమూ, లేని ఈ మాటలు విని ఒక్క నిమిషం వెర్రిచూపులుచూచి పకాపకా నవ్వారు.

రాజరాజు ఈఅసందర్భ ప్రలాపన కమ్మ్రియటానికి నన్నొక పిచ్చివాడిక్రింద లెక్కగట్టి సేవకుడ్ని పిలిచి "సేవకా ఈమె ఎవరు ? ఇక్కడికి ఏలవచ్చెను ?—పంపివేయుము" అన్నాడు. ఉన్నవాళ్ళంతా మళ్లా నవ్వారు.

నాకు వళ్లు మండిపోయింది.— "నేనెవర్తో [illegible] కనపడటం లేదూ కళ్ళు మీదికొచ్చినయ్యా ? నేను నరసయ్యను. బుద్ధితక్కువై ఏదో సరదా పడ్డాను వేషం వేయటానికి. '[illegible]

నన్ను ఘోాన వుచ్చితే ఊరుకొంటా ననుకొన్నావా పిచ్చిపుల్లా యలాగ!—నా పార్టు నేను యాక్టు చేశాను. నాసరదా నేను తీర్చుకొని వెడుతున్నాను. ఇక నీవు నాటకం కానియ్యి. నేవెడుతున్నాను. అని బయటికివచ్చాను. ఆడియన్సులోనుంచి గొల్లున గోల బయలుదేరింది. నన్ను పడుకొని నిద్ర పొమ్మని సలహా చెప్పిన ఆ కుర్రాడు నాకెక్కడా కనపించనేలేదు ఆతరువాత. అమర్నాడు నన్ను చూచిన ప్రతి స్నేహితుడూ, పరిచయుడూకూడా గబుక్కున వచ్చి చెయ్యిపట్టుకొని గట్టిగా, ఊపి బ్యూటిఫుల్—చాలా బాగుందోయ్—చాలా బాగుంది!! అని అనటం కృతజ్ఞత కనపర్చటం జూస్తే నాకు ఎంతో తృప్తీ, ఆనందమూ కలిగినాయి.

## 3

మా బావమరది ఒక డాక్టరు. ఆసుపత్రినీళ్ళతో తృప్తి పడనివాళ్ళకు అందికలో వృందాలని జనరల్ ఆసుపత్రికి దగ్గరలోనే డిస్పెన్సరీ పెట్టాడు ఎల్. యం. పి. ప్యాసు అయిన తరువాత. రోగి అయినవాడు ఒక్కడూ వాడిదగ్గరకు వచ్చేవాడుకాడు. కొత్తలో కుర్చీలో కూర్చుని గోళ్ళు కత్తిరించుకుంటూ ఉండేవాడు. సెలవుదినము అయితే నేనూ వాడితోపాటు కూర్చుని యేవో కబుర్లు చెబుతూ ఉండేవాడిని.

ఒకటి రెండు కేసులు జాగ్రత్తగా నడిపానా ఇక అటుపైన బాధ ఉండదు బావా! భవిష్యత్ ప్రారంభం మీదే ఆధార

ఖడీ ఉంటుంది. అని వాడు ఎన్నోసార్లు అంటూ ఉండేవాడు. వాడికి మంచిపేరు రావాలనీ, వాడి హస్తవాసి మంచిదని అందరూ అనుకోవాలనీ, నాకూ తీవ్రమైన కోరిక ఉండేది.

ఇద్దరం వీధివంక చూస్తూ కూర్చునేవాళ్ళం. ఎవరైనా కాస్త బలహీనుడు నడవలేక నడవలేక నడుస్తున్నట్లు కన పడేనా, 'అడుగో వస్తున్నాడురా ఎవరో వేషంటు' అనేవాణ్ణి నేను! వాడు ప్రతిసారీ తప్పు తీసేవాడు. ఆ వస్తూన్న మనిషి, మావంక చూస్తూనే, డిస్పెన్సరీని దాటిపోయేవాడు. నేను నవ్వేవాణ్ని. మావాడు ముఖం ముడుచుకొనేవాడు. ఇదీ వరుస.

పదిరోజులైన తరువాత, కడుపునొప్పికని, కాలు నొప్పికని ఎవరైనా ఒకరిద్దరు రాసాగారు. వాళ్ళు మందుమాటుకు పుచ్చుకొనేవారేకాని, డాక్టరు చేతిలో ఏమీ పెట్టేవారు కారు. ఇదీ ఒకందుకు మంచిదే అని మావాడు సంతోషించేవాడు. ఎల్లాగో ఓలాగు పదిమంది నోట్లో పడటమే చాలునని వాడి ఉద్దేశం.

ఒక రోజున నేను ఉండగానే, ఒక ఆసామి వచ్చాడు. తనకు ముక్కుమీద కురుపొకటి లేచింది మందు కావాలి అంటూ. పెద్దకురుపే అది. దమ్మిడీ వెడల్పున ఉంది. దాన్ని చూచి మా వాడు "ఇదివరకు ఎక్కడన్నా వైద్యం చేయించావా ?" అని అడిగాడు. ఇంతవరకు కూరగాయ వైద్యాలతోనే సరిపోయింది. ఏమీ గుణం కనపడలేదు.

ఇక లాభంలేదు. కాస్త గట్టి వైద్యం చేయిద్దామని ఇవ్వాళే పేటకొచ్చి, పేరుగల డాక్టరుగదా అని ముందు ఆసుపత్రి డాక్టరు దగ్గరకు వెళ్లానండి అన్నాడు. ఆయన మందు వేయలేదా అని అడిగాడు మావాడు. "మందు వేసిందాకా నేనుండలేను. అసలు ఆయన పద్ధతి నాకు నచ్చక, డబ్బు పారేసి ప్రైవేటు డాక్టరుచేత వైద్యం చేయించుకుందామని వచ్చేశాను" అన్నాడు ఈమాట విని మేమిద్దరంకూడా ఆశ్చర్యపోయినాము. పద్ధతి నచ్చకపోవటానికి ఈ యన కేమి తెలుసును అని అనుకొన్నాం.

చివరకు నేనే అడిగాను. పద్ధతి నచ్చకపోవటం ఏమిటన్నావ్, ఎందుకు నచ్చలేదూ? ఏం జరిగింది చెప్పూ అని. ఆయన చెప్పాడు. ఆయన పొడుగాటి తోలుగొట్టం ఒకటి బయటకు తీసి గుండెమీద పెట్టాడండి, అని ఆ ఆసామి పకపకా నవ్వాడు.

"అందులో తప్పేముంది! నిన్ను పరీక్ష చేశాడు." అన్నాడు మావాడు. నాకు ముక్కుమీద కురుపు వేస్తే, గుండె పరీక్ష చేయటం ఏమిటండీ!! అసలు ఆయన తెలివి తక్కువ తనాన్ని గురించి తనకు కలిగిన అసహ్యాన్నిఅంతా కళ్ళగుండా వెళ్ళగక్కాడు. మేము యిద్దరం నవ్వుకొన్నాము. మావాడుపదో చెప్పబోతున్నాడు.

"అల్లాగే చేయాలె. గుండెబలహీనంగా లేక పోతే నీకు ఆపరేషన్ చెయ్యాలని అనుకొనివుంటాడు. అని బహుశః వాడు

అనిపించేవాడు.

నేను వాడ్ని మాట్లాడనియ్యక ఇల్లా అన్నాను. 'నిజం. నీవు అన్న మాట నిజం. ముక్కుమీదకురుపు వేస్తే గుండె పరీక్ష చేయటం ఏమిటి? శుద్ధ తెలివితక్కువ గాకపోతే. జబ్బు ఎక్కడుందో అక్కడ పరీక్షచేయాలెగాని!!'

ఈమాటలు విన్నమీదట ఆయనకు ముఖంచేటంతో అయింది. వెంటనే మావాడు సైకస్కోపు తీసుకొని ఆయన ముక్కుమీద పెట్టి చూశాడు. ఆయన సంతోషించి మందు రాయించుకొని డబ్బుకూడా ఇచ్చిపోయినాడు. ఎవరికి చెప్పాలిసిన మాటలు వాళ్లకు చెపటం నాకు తెలుసునని మావాడు అనుకొని సంతోషించి ఉంటాడు.

ఆరోజునుంచి మావాడికి కాస్త ప్రాక్టీసురాసాగింది. ఒక ఆదివారంనాడు నేను వెళ్లిడిస్పెన్సరీలో కూర్చున్నాను. ఎవరో ఆడవాళ్లు వస్తేమావాడు వాళ్ళనులోపలికి తీసి కెళ్ళి వాళ్ళకు కళ్లల్లో మందు వేస్తున్నాడు. నేను ఆఫీసు రూములోకూర్చుని పేపరు చదువుకొంటున్నాను. ఇంతలోనే ఒక లావాటి ఆయన లోపలికి మెల్లగా వచ్చి, దిక్కులుచూచి, నాపక్కను నుంచొని "డాక్టరుగారు లేరండీ?" అని అడిగాడు. ఉన్నారు; లోపల ఎవరితోనో మాట్లాడుతున్నారు అన్నాను. ఆయన ఇంకా అల్లాగే బెదరుచూపుల్తో చూస్తూనిలబడి ఉండటం గమనించి కూర్చోండి వస్తారు అన్నాను.

ఆయన సందేహిస్తూనే కూర్చుని, నావంక తేరిపారజూచి

మీరు ఇక్కడ మందు పుచ్చుకొంటున్నారా? అని అడిగాడు. "ఈ డాక్టరు నాకు బావమరది; ఊరికే నే ఇక్కడ కూర్చున్నాను" అని చెప్పటం నాకు ఇష్టం లేకపోయింది. అందుకని నేనూ ఒక వేషంటుంచే అని ఆయనకు అర్థమయ్యేలాగున ప్రవర్తించాను. నేను మా వాడిదగ్గర మందు పుచ్చుకొంటూఉన్నమాటా నిజమే. వాడు డాక్టరు పరీక్ష ఇచ్చి వచ్చినతరువాత నాకు గుండెబలహీనత, పైత్యం, అజీర్ణం, మరిఇలాంటి జబ్బులు ఒక అరడజనుకుపైగా ఉన్నట్లు శోధించిన రోజూ అక్కడ ఏదో మందు పుచ్చుకోకుండా ఉన్నదీ లేదు. ఆయన పేరూ అవీ తెలుసుకొన్నాను. అసలు నాఉద్దేశం వచ్చిననాటికల్లా మావాడ్ని గురించి నాలుగు మంచి మాటలుచెప్పి వాడికి ప్రాక్టీసు కాన్వాస్ చేయాలని.

ఇక నేను కాన్వాసింగు ఎల్లా మొదలు పెడదామాఅని అనుకొంటూవుండగానే ఆయనే అన్నాడు. 'బాబూ ఈడాక్టరుగారిని గురించి మీకుబాగా తెలుసునన్నమాటేగా' అని.

'బాగా తెలుసు వైద్యంలో పెద్దపరీక్షలుప్యాసయి ఆసుపత్రిలో కొంతకాలం పనిచేసి బాగాఅనుభవంసంపాదించాడు నెమ్మదైనవాడు. అసలుముఖ్యమైన సంగతేమిటంటే ఈయన హస్తవాసి మంచిది.' అని చెప్పవలసినమాటలు నాలుగూ చెప్పాను.

నా మాటలు ఆయన శ్రద్ధగా విని "అయితే ఒక్కసంగతి. ఈయన కొత్తగావచ్చాడు గదండీ మన..............అని ఏదో చెప్పటానికి సందేహిస్తున్నవాడిలాగ ఊరుకొన్నాడు

ఆయన సందేహం ఏమిటో నేను అర్థంచేసుకొని "కొత్తగావస్తే మటుకు ఏమండి, కొత్తవాళ్ళే శ్రద్ధగా పనిచేస్తారు" అన్నా నేను.

ఈ మాటలవల్ల ఆయన కాస్త తృప్తిపడ్డాడు. నావంక సాదరంగా చూస్తూ "నాకూ.....మాశాగూ...ఈ మెడపైన కణుతు ఒకటివుంది. ఓ మాస్తరు పెద్ద దేసుమండి!! దీన్ని కోయించుకోవాలెనని ఉంది. ఈయనగారు ఆపరేషన్ చేయగలరాఅండి" అని అడిగాడు.

కణుతు చాలా పెద్దది. మనిషి చూస్తే కాస్త ఉన్నవాడులాగ కనబడుతున్నాడు. మంచి కేసు. నా తెలివి తేటలు ఉపయోగించి, ఈ కేసు మావాడికి పట్టియిద్దామని నిశ్చయించుకొని ఇల్లా అన్నాను. ఈ డాక్టరుగారికి కణుతులు కోయటంలో చాలా నేర్పు ఉంది. ఎంత పెద్ద కణతు అయినా అట్లా చేత్తో తీసేసినట్లు ఆపరేషన్ చేయగలరు.

ఆయన నామాట అంతా కాకపోయినా కొంతవరకయినా నమ్మినట్లు కనబడ్డాడు. ఒకనిమిషం ఏదో ఆలోచించి, చివరకు ఆయన "అయితే గట్టివాడేనన్నమాట" అన్నాడు, ఏదో ఘరర్యాన్నంగా తనలో తాను అనుకొంటూన్నట్టు. ఆయన గొంతులో కొంతవిశ్వాసమూ, కొంత అవిశ్వాసమూ కూడా ఛాయామాత్రంగా ఉన్నట్లుతోచింది.

మా వాడివిషయమై ఆయనకు ఘట్టి అభిప్రాయం కలగాలనీ, సందేహంకానీ, అనుమానంగానీ ఆయన మనస్సులో ఉండరాదనీ నిశ్చయించుకొని నేనుఇల్లాగ అన్నాను. గట్టివాడని మెల్ల

గారంటారేమండీ ! చాలామంచివాడు. కణుతులు కోయటం విషయంలో ఈడాక్టరుది పెట్టిందిపేరు.

ఇంత చెప్పినాఆయనకు పూర్తిగా నమ్మకం కలగలో ఏమో మరీ, చెప్పినదంతా విని, "అయితే చూడండీ, ఇదివరలో ఎవరికైన ఇల్లాంటి ఆపరేషనులు చేశారా ఈ డాక్టరుగారూ ? నాకు తెలియక అడుగుతున్నాను. క్షమించండి ఇల్లాగ అడుగుతున్నందుకు" అన్నాడు.

మావాడు అప్పటికి ఇల్లాంటి ఆపరేషన్లు చేసినట్లు నాకు తెలియదు. చేసి ఉండడు. నేను అల్లాగ చెపితే ఆయన వెళ్ళిపోతాడని అనుకొన్న చెయ్యాకేమండి ! నాకు తెలిసినంతవరకు ఇద్దరికి చేశాడు—— అన్నాను తెలిసినట్లు.

ఆయన ఆశ్చర్యపడి "ఆఁ ఎవరికండీ" అన్నాడు. ఈప్రశ్న వస్తుందని నేను అనుకోలేదు. ఎవరికని చెప్పేది. ఆ [illegible] కణుతులు ఎవరికి ఉన్నాయో, ఎవరు ఆపరేషన్ చేయించుకొన్నారో, నాకు తెలియదు. ఎవరిపేరో ఒకరిపేరు చెపటానికైనా ! ఇంత వరకు తెలిసిన వాడిలాగ చెబుతున్నవాడిని, ఇప్పుడు నీళ్ళు నమిలితే నేను అబద్ధాలు చెబుతున్నానని ఆయన అనుకోవచ్చు. అందుకని, ఏదో ఆలోచన అభినయించి తెలిసిన విషయమే మరిచిపోయినట్లు నటన ప్రారంభించాను.

"కొత్తపేటండీ ఆయనదీ ! వారం రోజుల క్రింద ఆపరేషన్ అయిందీ ! " అన్నాను. నిజంగా ఆపేటలో ఉన్న పెద్దమనిషి ఎవరో మావాడిదగ్గర ఆపరేషన్ చేయించుకొన్నట్లు ఈయనకు

నమ్మకం కలుగజేస్తున్నాకదా అనే సంతోషంతో.

మాదీ కొత్తపేటేనండీ అన్నాడు ఆయన. గుండె గుభేలు మన్నది. ముందు ఆ రూనది ఏ పేట అయింది తెలుసుకొని, ఆపేటకు దూరంగా ఉన్న ఇంకో పేట పేరు చెపితే బాగుండేది. మా పేటలో ఎవరూ! ఇల్లాంటి ఆపరేషన్ చేయించుకోలేదే అంటే నేను తెల్ల ముఖం వేసుకొని వచ్చేసి. అదృష్టవశాత్తు ఆయన అల్లాగ అనలేదు. అంతకపోంగా పైగా ఆశ్చర్యంగా చూస్తూ, రోడ్డుకు కుడిపక్కన సందులో మొదటి ఇంట్లో ఆతను నేనా అన్నాడు

నాకు చాలా ఆశ్చర్యం వేసింది. నేను ఏదో నోటికొచ్చి నట్టు అంటే అది సరిగ్గా అతికిపోవటం చూస్తే! కొత్తపేటలో ఎవరో ఒకాయన ఇల్లాంటి ఆపరేషన్ చేయించుకొన్నాడన్న విషయం. ఆ ఆపరేషన్ చేసింది ఎవరైందీకూడా ఈ ఆసామికి తెలియదన్న విషయంకూడా స్పష్టంగా నేఉంది. తెలిస్తే ఇల్లాగ అడిగేవాడు కాదు. ఇక అల్లాంటప్పుడు ఆ ఆపరేషన్ చేసింది మా వాడే అంటే వచ్చిన నష్టమేముంది లాభమే కాని !! అని నాలో నేను తర్కించుకొన్నాను.

ఈయన పనిగట్టుకుని ఆయనదగ్గరకు వెళ్ళి మీ కణుతు ఆపరేషన్ చేసింది ఫలాన కొత్త డాక్టరుగారేనా అని సాధారణంగా కనుక్కోడు. ఒకవేళ కనుక్కొన్నా మళ్ళీ నన్ను వచ్చి అడగడు అని కూడా అనుకొన్నాను.

అసలు అందాకా ఎందుకొస్తుంది. నేను మా వాడికి శక్తి

సామర్థ్యాలనుగురించి ఆయన కేమీ అనుమానం లేకుండా చేస్తినా అప్పుడే ఆపరేషన్ చేయించుకుంటాడు కదా! వెంటనే చేయ టానికి మా వాడికి తీరిక లేకున్నదనా? ఆయన జూస్తే భాగ్య వంతుడుగా ఉన్నాడు. కాస్త లాభించే విషయంలాగా ఉంది. అని ఇన్ని విషయాలు ఒక్క నిమిషంలో ఆలోచించు కొన్నాను.

ఇంతలో ఆయన మళ్లీ అడిగాడు. ఏమండీ, కొత్తపేటలో, రోడ్డుప్రక్క సందులో మొకటి ఇంట్లో ఆయనేనా ఈడాక్టరు గారిదగ్గర ఆపరేషన్ చేయించుకుంది? అని. నేను తలఊపి, అవునండీ, మొదటిఇల్లో, రెండోదో అయిఉంటుంది, అన్నాను.

ఆమాటలు విని ఆసాహుకారు మళ్ళీ ఏదో అనుమానిస్తూ "ఆయన ఎవరండీ? ఆయనమీకు తెలుసా?" అని అడిగాడు. కణతలు పట్టుకొని ఒక్కక్షణం ఆలోచిస్తున్న వాడిలాగ నటిస్తూ "తెలియకేమండీ! ఇక్కడే చూశాను. పల్లగా లావుగా ఉంటాడండీ" అన్నాను నేను, నిజంగా ఆయన్ని చూసిఉన్నట్లే! నేనిచ్చిన వర్ణన సరిగ్గా సరిపోలేదని ఆయన ముఖంచూచి గ్రహించి మళ్ళీ ఇల్లాగ అన్నాను. "నలుపూ" అంటే కారునలుపు కాదులెండి అదే చామనచాయగా ఉంటాడు. కాస్త లావేలెండి మరీ లావు కాదు.

సంతోషించాడు ఆయన. అల్లాగని ముఖమే చెప్పింది. ఆయన తనకు పూర్తిగా సంశయనివృత్తి అయినట్లు చూస్తూ "అయితే ఆయన పేరు ఏమన్నారూ?" అన్నాడు—

ఏదో ఆతురతతో.

నేను ఏమీ అనలేదే!! పేరా? పేరు నోట్లో ఆడు తున్నదండీ... వెధవది జ్ఞాపకశక్తి తగ్గిపోయిందండీ! సలభై దాటింతరువాత. అని నేను పేరు చెప్పలేకపోవటానికి ఒక కారణం కల్పించి ఇంకా ఆలోచిస్తూన్నట్లే కూర్చున్నాను. నా అవస్థజూచి పాపం ఆయనే అన్నాడు. "నారం రోజుల క్రింద ఆయింట్లో సుబ్బారాయుడుగారికే కదండీ కణుతు ఆపరేషన్ అయిందీ! అని. "ఎగ్జాట్లీ—అది! ఆయనే!!" అన్నాను నేను అప్పటికి సరిగ్గాజ్ఞాపకం వచ్చినట్లు. నేను ఆడుతున్న నాటకానికి నాకే నవ్వు వచ్చింది. అయినా ఆ తరువాత ఏ సందేహాలు పెట్టుకోలేదు. ఆయన అనుమానా లన్నీ ఝంఝూమారుతాహతికి చెల్లాచెదరైన మేఘాలలాగ విచ్ఛిన్నమైనట్లు ఆ దరహాసరేఖలో విదితమైంది.

"సరే తెలిసింది లెండి" అని అంటూ చటుక్కున గొడుగు తీసుకొని ఆయన చరచరా నడిచిపోసాగాడు. డాక్టరుగారు వస్తున్నారు ఉండండీ! అని నేను కేకేశాను. వస్తాలెండి చెప్పారుగా! అంటూ వెనక్కు తిరిగి చూడ కుండా వెళ్ళిపోయినాడు.

౨

ఇట్లా ఆయన గడప దాటటంతోనే మావాడు లోపలి నుంచి వచ్చి "ఎవరు బాబు వచ్చారూ!" అన్నాడు.

ఎవరో పేషంటు వచ్చాడన్న ఉత్సాహంతో. మా వాడికి ఒక మంచి కేసు సంపాదించిపెట్టానన్న సంతోషం నాలో సుళ్ళు తిరుగుతున్నది. అందుకని నవ్వుతూ ఆదరణతో అన్నాను. ఎవరో, భాగ్యవంతుడే, షాహుకారులాగా ఉన్నాడు, అని.

ఈ వూళ్ళో బట్ట వర్తకులంతా భాగ్యవంతులు. వారిలో ఒక్కరికి మనయందు నమ్మకం కుదిరితే చాలు. ఆ ఒక్కరి ద్వారా పది కేసులు వస్తాయి. ఇంతకూ ఆయన ఏడీ? ఎందుకొచ్చాడో? అన్నాడు మావాడు, ఆతురతతో. "ఇప్పుడే వెళ్ళాడు మళ్ళీ వస్తానని చెప్పి. ఆయన మెడమీద కణుతు ఒకటి ఉంది. దాన్ని కోయించుకొంటాడట" అని చెప్పాను

మావాడు ఆ మాటలు ఆనందంతోనూ ఆశ్చర్యంతోనూ విని "ఓహో! ఆయనా. ఆయన ఈ వూళ్ళోకల్లా భాగ్యవంతుడు చాలా పలుకుబడి కలవాడు. అల్లాంటివాడు మన దగ్గరకు రావటము అదృష్టమే!! వెళ్ళాడేం!!" అన్నాడు. మళ్ళీవస్తాను, అని నేను జవాబు చెప్పాను. "ఏమో" అని మా వాడు ఆయన మళ్ళీ వస్తాడని తనకు గట్టి నమ్మకం లేనట్టుగా సూచించాడు.

మా వాడు పడ్డ భయానికి నేను నవ్వుకొని "ఎందుకు రాడూ?" అన్నాను. ఏమో బావా! ఈ వూళ్ళో డాక్టర్లలో కాంపిటీషన్ ఎక్కువగా ఉంది. ఎవరైనా

చూస్తే మనదాకా రానిస్తారు. అని నొచ్చుకుంటూ, “కాసేపు కూర్చోమని పోయినావా, నేను వచ్చినదాకా” అన్నాడు.

కూర్చోమనడం కేం! కూర్చోమనీ అన్నాను, కూర్చున్నాడు కూడాను!! కూర్చుని నేను చెప్పేదంతా విని మరీ వెళ్ళాడు. అందుకనే ఆయన మళ్లీవస్తాడని నమ్మకంగా చెప్పగలుగుతున్నాను, అన్నాను.

“ఏం చెప్పావు ఏమిటి?” అని మా వాడు ఆదుర్దాగా అడిగాడు. నీ విషయమై మంచిగా చెప్పాను. “ఈ డాక్టరుగారు కొత్తగదా, ఈ కణుపు ఆపరేషన్ చెయ్యగలడా” అని అడిగాను. అద్భుతంగా చేస్తాడు. ఈ విషయమై ఆయన ప్రత్యేకంగా కృషిచేశాడు అని చెప్పాను.

నీవు ఎవరైంది ఆయనకు తెలుసునేమో? బావమరిది గురించి పొగుడుకుంటున్నాడని ఆయన అనుకొన్నాడేమో!! అన్నాడు మా వాడు, నేను చేసినపని అంత మంచిది కాదని అనుకున్నట్టు చూస్తూ.

ఈ మాత్రం తెలియకుండా నేను ప్రవర్తించానని వాడు అభిప్రాయ పడటం వట్టి తెలివితక్కువతనంగా కనపడ్డది నాకు. అయితే వాడికి ఇంకా చిన్నతనం ప్రపంచానుభవంలేదు. అందుకని అల్లాగ భయపడ్డాడని నాకు నేను చెప్పుకొని నవ్వుకొని ఊరుకొన్నాను.

కొంచెంసేపు ఏదో ఆలోచించి చివరకు “అయితే ఆయన

ఏమనిచెప్పి వెళ్ళిపోయినాడు ?" అని అడిగాడు. "చెప్తా అసలు జరిగిన విషయం వినూ! ముందు సంగతి నేనొక వేషంటు ను అనే అభిప్రాయం ఆయనకు కలుగజేశాను, ఆ తరువాత వైద్యంలో నీవు చాలా గట్టివాడవనీ, పట్టింది బంగారం అవుతుందనీ, నీది అమృతహస్తమనీ, ఇల్లాగ ఎన్నో విషయాలు ఆయనకు చెప్పాను".

తన విషయమై ఇల్లాగ మంచి మాటలు చెప్పినందులకు సంతోషించి నన్ను థాంక్స్ చేయాల్సింది పోయి, నేనేదో అప్రియం పలికినట్టుగా వాడు మౌనంగా ఊరుకొన్నాడు, ఊం కొడుతూ.

చివరకు "ఎవరికన్నా ఇల్లాంటి కణుతులు ఆపరేషన్ చేశారా ఈ డాక్టరుగారు? అని నన్ను అడిగాడు ఆయన" అన్నాను ఈ మాట విని మా వాడు ఉలిక్కిపడి ఊం— ఏం జెప్పావు దానికి సమాధానం? అని ప్రశ్నించాడు.

వాడి ఆతుర్దా చూస్తే నాకు జాలివేసింది. అందుకని ఇల్లా అన్నాను. "తెలివితక్కువగా జబాబు చెపుతా ననుకొన్నావా ఏంరా? పిచ్చివాడా!"

"అయితే ఏమన్నావూ?"

"రెండు మూడు ఆపరేషన్లు చేశాడు. నేను కళ్లారా జూశాను. వారం రోజులక్రిందే ఒక ఆపరేషన్ అయింది. పేషంటు ఆపరేషన్ అయిన తరువాత, నిద్ర పోయి లేచినట్టు లేచి ఇక్కడనుంచి దొరలాగ ఇంటికి నడచిపోయినాడు. బండీ

అయినా ఎక్కకుండా!! అని ఇల్లాగ అనేశాను. నీవు ఊరికే భయపడతావు గాని నాకు తెలియదురా ఏమి చెప్పాలిసింది? తాతకు దగ్గులు నేర్పాలా?" అన్నాను. మా వాడు కృతజ్ఞతా సూచకంగా ఒక చిరునవ్వు నవ్వాడు.

3

"ఊఁ దాసతరువాత?" అని అడిగి జరిగిన సంగతి పూసగుచ్చినట్లు చెప్పుమన్నట్లు మావాడు సన్న ప్రోత్సహించాడు. నేను ఇల్లా అన్నాను. 'నా మాటలు విని సంతోషించి; డాక్టరుగారు ఆపరేషన్ చేసింది ఎవరికీ? అని అడిగాడు.' "ఎవరికని చెప్పావు?" అని మా వాడు పకపకా నవ్వాడు.

ఎవరికని చెప్పేది? ఏదో పేరు చెపుదామని అనుకొన్నాను. పేరు జ్ఞాపకం రానట్టు ఒక చిన్న నాటకం ఆడాను. చివరకు ఆయనే అన్నాడు. కొత్తపేటలో ఉన్న సుబ్బారాయుడిగారికేనా అని. "నేను, అవునన్నాను." ఇల్లాగ జరిగిన కథ అంతా మా వాడికి చెప్పి నేను విరగబడి నవ్వాను.

మావాడు నిర్ఘాంతపోయి చూశాడు. నేను ఈ వ్యవహారం అంత తెలివిగా నడిపినందులకు వాడు అల్లాగ ఆశ్చర్యపోతున్నాడని నేను అనుకొన్నాను.

అయితే మావాడు మరుక్షణంలో బిక్కముఖం పెట్టి

"ఎందుకు చెప్పావు బావా అల్లాగా ?" అన్నాడు జాలిగా."

"ఏమిటి ? ఏం ? అల్లా చెప్పితే ?" అని అడిగాను నేను, వాడి పిచ్చిభయాన్ని చూచి నవ్వుతూ.

"ఆ సుబ్బారాయుడికి ఆపరేషన్ చేసింది చౌదరి. నేను కాను. ఎందుకల్లా అబద్ధం చెప్పావూ ?" అన్నాడు ఎదో కొంప మునిగినట్లు భయపడుతూ.

వీడి అమాయికత్వం చూస్తే నాకు విపరీతమైన నవ్వు వచ్చింది. నేను ఆడిన అబద్ధం ఎక్కడ బైటపడుతుందో అనే గదా వాడి భయం. "ఆ-సాహిబుకారు పోయి కనుక్కో వచ్చాడా ? ఎందుకురా నీకు అంత భయం !" అన్నాను.

అని ఇల్లాగ అన్నా మా వాడు సంతోషించినట్లు కనపడక పోవటంవల్ల "ఏమిట్రా అల్లా చూస్తావు దిగాలపడి, ఇప్పు డొచ్చిన పెద్ద నష్టం ఏముందీ ఆ అబద్ధంవల్ల ?" అన్నాను.

"నా బొంద, చౌదరీ ఆపరేషన్ చేసిన మరునాడే ఆ సుబ్బారాయుడు చచ్చాడు. వాడి చావుకు నన్ను బాధ్యుడ్ని చేశావు ఎల్లాగ ఇప్పుడు ?" అని మా వాడు విసుక్కు న్నాడు. నేను తెల్లపోయినాను.

## 4

కవి వేదుల సత్యనారాయణగారితో నాకు పరిచయం సాహితీ సమితి రోజులలో అయింది. తెనాలిలో సాహితీ సమి

తి సభ జరిగినప్పుడు మేము ఇద్దరం మొదటిసారి కలుసుకొన్నట్లు నాకు జ్ఞాపకం.

వేమల నాకంటే ఒకటి రెండు సంవత్సరాలు చిన్న వాడు ఆతని వయస్సు నిర్ధారణ చేయటంలో స్నేహితులు తగాదా పడుతుండేవాళ్లు. అతనికి జాతకంలేదు. పుట్టిన సంవత్సరం వికారో వికృతో జ్ఞాపకంలేదు. ఏసంవత్సరం అయి ఉంటుంది అనే మీమాంస జరిగింది. చివరకు వాళ్లు అతని రూపాన్ని ప్రమాణంగా తీసుకొని వికారి నామసంవత్సరమే పుట్టి ఉంటాడని నిర్ధారణ చేశారు.

సాహితీ సమితి సభ్యులలో మేమిద్దరమే అందగాళ్లమని మిత్రులను అందరూ హేళన చేస్తూ ఉండేవాళ్లు.

తరువాత నేను రాజమండ్రికి ఎల్. టి. చదవటానికి వెళ్లాను. అతనూ ఆవూళ్ళోనే ఉండేవాడు. ఇన్నిసుపేటలో శ్రీపాదవారి వీధిలో ఒక చిన్న గదిలో ఉంతడిబస. హోటలులో భోజనం చేసి కులాసాగా కాలం గడిపేవాడు. అప్పుడు వేమల బ్రహ్మచారి. ఆరూపాన్ని జూచి, ఎవ్వరూ వివాహం చేసుకోలేదు కాబోలునని నేననుకొనేవాడిని, ఒక్కరోజున మాట వరుసగా అన్నాను. "అన్నగారూ! మీరు వివాహం చేసుకోరాదూ?" అని. "నన్నెవరు చేసుకుంటారోయ్! చూస్తూచూస్తూ ఎవ్వతె నన్ను చేసుకోవటానికి ఇష్టపడుతుంది." అన్నాడు శాస్త్రి. "నీవు అనుకున్నంత అందవికారివికావు. నీకళ్ళలో అదొకవిధమైన కళా, ఆకర్షణా ఉన్నాయి." అన్నాను నేను.

"లేద శాస్త్రీ లేదు. ఎంగెల్లాగ అంటావు. ఇంకానీమ్మాట చెప్పు. కొంత కాకపోతే కొంత అయినా సుఖంలో కళాకాంతులున్నాయి. నేను బొత్తిగా అనాకారినోయ్ నరసింహారావ్రా" అన్నాను. "కాదు శాస్త్రీ; నేను ఏమాత్రం ఒప్పుకోను. నీకళ్ళలోఉన్న తేజస్సు చాలు, నీకు కావలసినంత అందాన్ని ఇవ్వటానికి" అని రెట్టించాను నేను.

ఆఖరుంగా పెరిగిపోయింది వాగ్వాదం. విషయం ఏమిటీ ఇంతకూ? నీవు అందమైనవాడివని నేనూ, కాదూ, నీవే అందమైనవాడవని అతనూ, ఇద్దరం రెట్టించుకున్నాము. వాగ్వాదన తీవ్రరూపం దాల్చింది గొంతుకలు పెద్దవైనవి.

నీ ముఖాన స్ఫోటకం మచ్చలున్నా నీకళ్ళే నీముఖానికెంతో అందాన్ని ఇస్తున్నాయని నేనూ, గట్టిగా వాదించాను.

నీవు నల్లగావున్నమాట నిజమే. నీముఖానపొడఉండటం బాగుగాలేదు. కాని నీనవ్వులో సవరాలున్నాయి. మాంచి వయస్సులో ఉన్నావు కాబట్టి నీ శరీరంలో కండబిగువుఉంది. అందుచేత కళకళ లాడుతూ ఉన్నావు. నీముఖం నీఉంగరాల జుట్టు నీకు అద్భుతమైన అందాన్ని ఇస్తుంది అనిశాస్త్రి గట్టిగా వాదించాడు.

శాస్త్రి అల్లాగ మాట్లాడుతూనే వీధి అరుగు పైకివచ్చేశాడు. అతనివెంటనే నేనూవెళ్ళాను. ఆతరువాత వీధి అరుగుపైన సాగింది మా పోట్లాట నాకాచిన్నతనము; అతడా, నాకంటె చిన్నవాడు. తమాషాకే సీరియస్ గా తగూలాడాము.

మా కేకలు విని చుట్టుప్రక్కలవాళ్ళు మాచుట్టూచేరారు. మనుష్యులు చేరినకొద్దీ శాస్త్రికి హుషారు ఎక్కువయింది. నిజంగా వళ్ళు మండిన వాడిలాగ ఎగిరెగిరిపడుతూ, ఏవో అర్థం లేనట్టి, సందర్భశుద్ధి లేనట్టి మాటలు అంటూ సాగించాడు.

“అల్లా అంటే నేను ఊరుకొనేవాడిని కాదు. పదిమందిచే తా నీకు నోట్లోగడ్డిపెట్టిస్తాను. వెధవకూతలు కూయటానికి నోరెట్లా వచ్చిందటా నీకు! చదువుకొన్నందుకు బుద్ధీ, జ్ఞానం, వివేకమూ ఉండాలె” అని తిట్టటం సాగించాడు

నాకు భయం వేసింది. స్వల్పవిషయంలో నవ్వులాటలకు, మొదలుపెట్టినా, నిజమైన పోట్లాటగా తేలే సూచనలు కనిపిస్తున్నాయి. ఇతరులు వింటే ఏమనుకొంటారో అని నాకు బిడియం వేస్తున్నది. కాని మాశాస్త్రి తీవ్రంగా మాటలు రానిస్తూ ఉత్తరీయం ఝూడిస్తూ, రంకెలు వేయడం సాగించాడు.

అక్కడ చేరిన పెద్దమనుష్యులలో ఒకాయన “ఏమిటండీ పోట్లాట?” అని అడిగాడు. ఈమాట ఎవరూ అడగలేదేమా అని అనుకు శాస్త్రి చూస్తున్నాడు ఇంతవరకటినుంచీ. అడగనే అడిగాడు. ఇంకేముంది! అదే కావలిసింది అక్కడనుంచే కథ రక్తికట్టే ఘట్టం వచ్చింది.

అక్కడనుంచి ఎత్తుకున్నాడు శాస్త్రి. ఆ ఖుసతో అంటాడూ, ఏమిటండీ, మనిషి అయిన తరువాత వివేకముండాలె! పాతికేళ్ళు నెత్తిమీదికి వచ్చినయ్యా, బి. ఏ. ప్యాసై యల్. టి. చదువుతున్నాడు పెద్దమనిషి! అనొచ్చినమాటా ఉంటుంది, అన

గాని నాటా ఉంటుంది! నోటికివచ్చినట్లు వాగటమేనా? అని ఊర్ధ్వోణిలో, అసలువిషయమేమిటో రవ్వంత అయినా తెలియనీయకుండా అనేశాడు.

"ఊరుకో యా శాస్త్రీ. యేదో తెలిసో తెలియకో అన్నాను నేనూ" అన్నాను. ఏమిటి ఊరుకోనేది. వళ్ళునుండే మాటలని, పదిమంది పెద్దమనుష్యులూ చీవాట్లు వేస్తారని భయపడి ఇప్పుడు తగ్గితేమట్టుకు నేను ఊరుకొంటానా? ఇవ్వాళ ఇట్లైంది. రేపు ఇంకోటవుతుంది ఏమండీ, నిజము అవును కాదా?" అని ఆప్రక్కనున్న పెద్ద మనిషిని అడిగాడు. ఆయనకు తలా తోకా తెలియలేదు. ఏమిటండీ, అసలు విషయమూ అని అంటూండాతను. "ఏమున్నా కానీండి. పెద్దమనిషి అయినవాడు నిజం చెప్పాలా వద్దా ఒక్కమాట చెప్పండి. సత్యవాక్కులోనే ఉంది అందమంతా. ఏందుకండీ వెధవ అబద్ధాలు ఆడటం? అబద్ధాలంటే చాలా ప్రమాదం సుమండీ! ఒక్కొక్కప్పుడు పీకలు తెగిపోతయి" అని శాస్త్రి ఉపన్యాసం ఇస్తాడే కాని ఒక్క ముక్కయిన అసలు సంగతి బైటకు రానీయడు. ఏమిటండీ అసలు విషయం అని, ఒకరిద్దరు గోల పెడితే, అసలు విషయం ఏముందండీ, వడ్లగింజ లోది బియ్యపుగింజా. అసలు విషయానికి కాదు నేననటం అబద్ధం ఎందుకూ చెప్పటమూ అంటా! అదీ నేననటం, అని పెద్దగా కేకలు వేస్తుంటే శాస్త్రి, ఒక్కరికీ ఈ కొట్లాట ఎందుకో అర్థం కాక నిర్ఘాంతపోయి చూస్తూ నిలబడ్డారు.

ఈ కేకలు విని అప్పటికి చాలామంది గుంపు కూడారు. మనుష్యులు చేరినకొద్దీ మనవాడు మరీ ఉత్సాహంతో, ఊరికే కేకలేస్తూ, ఉత్తరీయం నడుముకు బిగించి, బట్ట పైకి ఎగదీస్తూ, జంజం పైకీ క్రిందికీ లాగుతూ హడావుడి చేయటం సాగించాడు.

ఇంతలోనే ఆ వీధిలో నున్న ముసలమ్మ ఒకావిడ వచ్చింది ఆవిడ పాపం, అరవై ఏండ్ల వృద్ధు. కాని వంగిపోలేదు. కళ్ళూ కాళ్లూ బాగున్నాయి. అప్పుడప్పుడు ఆవిడ, ఆ గదిలోకి తొంగిచూసి నాయనా కులాసాగా ఉన్నావా అని అడగటమూ, పండగదినాలలో వాళ్ళింట్లో చేసికొన్న పిండివంటలు శాస్త్రికి ఇవ్వటమూ అలవాటు. ఆమె ఆ పుద్దాగా గబాగబా వచ్చి "ఏమిటి నాయనా ఏమిటిసంగతి" అని అడిగింది ఆవిడను చూసే సరికి శాస్త్రిముఖం చేటంత అయ్యింది, "చూడండి అమ్మమ్మగారూ! ఈ యనా నేనూ స్నేహంగా ఉన్నాము గదా మరి వెధవ అబద్ధపు కూతలు కూయటం న్యాయమేనా ?" అన్నాడు.

"అబద్ధపుకూతలు ఏమిటి నాయనా," అని నావంక తిరిగి అడిగింది ఆవిడ. నేను ఏదో చెప్ప బోతున్నాను. శాస్త్రి మాటకు అడ్డువచ్చి చెప్పనివ్వక "ఏదన్నా కానీండి. దొంగ కూతలు కూయటం ఎందుకూ అంటా ? ఉన్నది ఉన్నట్లు ముఖాన అనేసెయ్యాలె. ఏమంటారు ?" అన్నాడు.

"అవును నాయనా" అన్నది ముసలమ్మ.

"అవునా మరి. ఒక్కొక్క సందర్భంలో, ఒక్కొక్క తగా

యిదా పెరిగిందా అంటే పీకలు తెగిపోతయ్యి." అన్నాడు శాస్త్రి మళ్ళీ.

నిజం నాయనా నిజం. వెనకవ చెప్పుడుమాటల వల్ల నేఁదూ నాయనా, మా అబ్బాయి కాపరం ఇట్లావచ్చింది అన్నది ఆ ముసలమ్మ.

అవునాఅండి. మరి ఆ పెద్దమనిషి చూడండి నానా మాటలూ అనా డూ - నోటికివచ్చినట్లు వాగేశాడు. మరి మీరైనా బుద్ధిచెప్పండి అమ్మమ్మగారూ అన్నాడు.

ఏమిటి బాబూ నరసింహారావూ, ఏమిటిఅల్లరి ? ఎందుకు వచ్చింది ఇదంతా? అని నన్ను అడిగింది ముసలమ్మగారు. నాకు చాలా సిగ్గువేసింది. నవ్వూ వచ్చింది. అతను ఇదంతా ఫక్తు అల్లరికోసం చేస్తున్నాడని తెలుసు. క్షమించవోయి శాస్త్రీ అన్నాను చివరకు. అతడు మరీఎగిరిపడిఏమిటి క్షమించటం! ఎల్లాగ క్షమించటం ? అని ఉరిమిచూశాడు.

ఏమిటి నాయనా అసలు పోట్లాట ఎందుకొచ్చింది నాయినా అని ముసలమ్మగారు అడిగింది

ఏమైతే ఏమిలెండి. ఇదంతా ఎందుకూ ? ఒక్క సంగతి చెప్పండి, అతనివల్ల తప్పుఉంటే అతనిని చీవాట్లువేయండి. నావల్ల తప్పువుంటే నన్ను చీవాట్లు వేయండి. అని అంటూ నన్నుదగ్గరకు లాక్కునా భుజంమీద చెయ్యివేసి నిలుచున్నాడు.

మేము ఇద్దరం కొత్తగా పెండ్లికాబోయే పెండ్లికూతురూ, పెండ్లికొడుకూ ఉండేపోజులో నుంచున్నాము. ఇల్లాగ నిలుచుని

ఆమెతో అన్నాడూ, చూడండీ, ఒక్కమాట చెప్పండి, ఇదంతా ఎందుకూ? మా ఇద్దరిలో ఎవరు అందమైన వాళ్ళని మీ అభిప్రాయము?

గొల్లున నవ్వారు అక్కడివాళ్ళంతా. శాస్త్రి సీరియస్‌గానే, అతనే అందమైనవాడూ. అయినా? మరి, నేను అతని కంటే, అందమైనవాణ్ణి అంటాను చూశారా మరి. వెధవ అబద్ధం చెప్పకండి అన్నాను.

మళ్ళీ గొల్లుమన్నారు అంతా. నిక్షేపంగా యిద్దరూ అందమైనవాళ్ళే అని కొందరన్నారు. ముసలమ్మగారు నవ్వుతూ -మీకేం నాయనా అందమైనవాళ్ళు కాక; సరేలేవయ్య ఊరుకోండి అన్నది. మేము నిజంగా పోట్లాడుకుంటున్నాము అనుకొని.

అంతా నవ్వుతూ ఉంటే మా శాస్త్రి నను, చెయ్యిపట్టు కొని పోయాడు గదిలోకి. కాసేపు విరగబడి నవ్వుకొన్నాము. తరువాత కొంత సేపటికి ఏమిటి శాస్త్రీ నట్టి ఫూల్‌వు అయిపోయినావూ అన్నాను. "నేనూ నీవూ ఫూల్సు అయి పోవటం కాదు ఇక్కడ తమాషా. ఇరవై మంది వెధవలను, ఫూల్సును చేశాము మనము" అన్నాడు శాస్త్రి గర్వ

౨

ఆ రోజుల్లోనే మరోసారి ఇంకొంత తమాషా జరిగింది. ఒక రోజున నేనూ శాస్త్రీ గోదావరిలో స్నానము చేస్తున్నాము. ఎండలు తీవ్రంగా ఉన్న రోజులు. ఆరోజులలో తెల్లవాళ

ఘూంగున స్నానం చాలా హాయిగా ఉంది కులాసాగా ఒకరిపై నొకరం నీళ్ళను చల్లుకుంటూ ఆ గోదావరిలో చిన్న తరంగా అల్లరిచేస్తున్నాము. మా ప్రక్కన కోనసీమ శ్రోత్రియ బ్రాహ్మణుడు ఒకాయన స్నానం చేస్తున్నాడు. చెవులకు కుండలాలూ చేతికి సింహతలాటాలు ఉన్నాయి. శుద్ధ ఛాందసుడలా కనిపించాడు. ఏదో మంత్రాలు చదువుతుంటూ అఖండ గోదావరీ స్నానం కరిష్యే, అంటూ బుడికిబుడికి మునుగుతున్నాడు. ఆయనను గమనించక, ఏదో మాట్లాడుకొంటూ నీళ్ళు చిందకొడుతూ స్నానం చేస్తున్నాము మేమూ, ఆయనకు సమీపంలోనే. చిందగొట్టిన నీళ్ళు ఆయనకు దగ్గరగా పడ్డాయి. ఆయన చురచురా చూశాడు. శాస్త్రికళ్ళు పూచెడ్డకళ్ళు. బ్రాహ్మణుడు ఏమనుకుంటూ ఉన్నాడో ఇట్టే గ్రహించి, నాకు కన్నుగీటి— "పండిరా, ఇయ్యాల ఎంకడు కూలికెల్లాడంట్రా" అని ఏదో ప్రసంగం ఆరంభించాడు. "అగే సత్యా, నీపెళ్లాం ఉరికలాడిందని కబురెట్టారంట్రా మీఅత్తోరు" అని నేనన్నాను. ఇల్లాగ సంభాషణసాగిస్తూ మధ్యమధ్య బూతుకమాటలు వాడేశాము.

ఆ బ్రాహ్మణుడు మావంక చురచురా చూచి, ఎవర్రా మీరు అన్నాడు. శాస్త్రి మొదలుపెట్టిన నాటకం అంతా ఆమాట ఆయనచేత అనిపిద్దామనే. "బాబూ మేము మాలోళ్ళ కుర్రాళ్లమండీ" అన్నాడుశాస్త్రి. శాస్త్రిమాటలు నమ్మటానికి అంతా అనుకూలమే. నల్లటిరూపు మాది. దీనికితోడు అతని ముఖాన స్ఫోటకం మచ్చలూ నాముఖాన నల్లటిపొడ.

పైపెచ్చు మేకు అరగటంనుంచీ నీళ్ళలో ఉండటం మూలాన ముఖాలు పెకుతైపోయినాయి. దేహాలు కుమిలిపోయిన వంకాయలులాగున్నాయి. ఇంకా దీనికితోడూ, మాజంజాలు బొట్లోనే ఉన్నాయో, అసలు ఆ రోజున వేసేవో చెప్పలేను. యజ్ఞోపవీతం మావిషయంలో వైకల్పికము. ఉండనూ వచ్చు లేకనూ పోవచ్చు. మొత్తంమీద ఆరోజున మా మెడలో ఏ విధమైన నూలుపోగులూ లేవు. ఇంకా సంశావాలె. ఈ హావాలనూ ఈవిగ్రహాలనూ చూస్తూ ఈ తికమాటలు పెట్టూ మనుష్యులను మాలవాళ్ళని నమ్మకపోవటం ఎల్లా సంభవిస్తుంది? అసలు నిజం ఏమిటంటే మనుష్యులను పట్టి అప్పుడే మాలవాళ్ళు అనుకోటానికి తగిన అవకాశంఉంది. మా ఈస్థితిలో చెప్పేదేమిటి? ఆబ్రాహ్మణుడు నన్ను నమ్మి, నిప్పులు తొక్కిన కోతిలాగ ఎందులు త్రొక్కుతూ ఓరీ వెధవాయల్లారా, బ్రాహ్మణులు స్నానంచేసే రేవుకు వచ్చేసేరేరా? పైగా నీళ్ళు చిందగొట్టి మానెత్తిని పోస్తున్నారు మీకేం పోయేకాలం. మాలమాదిగలకు ఎంత పొగరు వచ్చింది? అని ఇల్లాగ ఎత్తుకొని తిట్టేశాడు. మాశాస్త్రి "గాంధిగారు ఏంచెప్పారుండీ, శాస్త్రులయ్యగారూ" అన్నాడు "ఏడ్చావులే గాంధిని—నీవూనూ" అని కసిరికొట్టి మనుష్యుల్ని పొమ్మని ఒక్కతీరాన తిట్టేస్తున్నాడు.

శాస్త్రి మళ్ళీ నీవేం ఏదం చదువుకొన్నావయ్యా అన్నాడు. నీకెందుకోయి వెధవాయ్ నేనేం చదువుకొంటే నీకేం? ఈమాల నీళ్ళు ఎల్లాగ స్నానం చేసేది పొండ్రా— ఇంకోరేవుకూ, అ

ని తన్నుకున్నాడు ఆబ్రాహ్మణుడు. మాశాస్త్రి నవ్వలేదు. నే
నూ నవ్వలేదు. ఆయనచేత తిట్లు తినటం చాలా సరదా అనిపిం
చింది. నేనే చివరకు వెళ్లుదాం రారా సత్యం. ఏంటీ ఈబాపన
గోల అని అన్నాను. ఇక ఆబ్రాహ్మణుడు చిందులుతొక్కు
స్తున్నాడు. నానామాటలు అనేస్తున్నాడు. సూర్యమధ్యశాస్త్రి
ఒక సమిధ వేసేవాడు. ఆతడూ రేగిపోయేవాడు. ఇల్లాగ కాసే
పు ఆడించేసరికి, ఆబ్రాహ్మణుడు, పిల్లైవరో మొండి నెత్తవలను
కొని, చెంబు తీసుకొని తానే ఇంకో రేవుకు వెళ్లిపోవటానికి సిద్ధ
మైనాడు. ఆస్థితిలో మాశాస్త్రి ఆబ్రాహ్మణుణ్ణి పిలిచి ఆయన
తో శిష్టాచార సంపన్నులైన వైదిక కుటుంబాలల్లో మాట్లా
డుకునే భాషలో ఒక్కవాదన ప్రారంభించాడు. ఆఘాందనుడు
ఈమార్పు జూచి నివ్వెరపోయి నిలబడ్డాడు. అక్కడ్నుంచి
శాస్త్రి ఏవో శ్లోకాలు ఎత్తుకొని చదివేశాడు. వేదంలో నుం
చి ఒకపన్నా ఏకరువు పెట్టాడు. సంస్కృతభాషలో ఏమిటో
అనేశాడు. అయితే శాస్త్రి ఏమంటున్నాడో నాకు ఒకముక్క
అయినా తెలియలేదు. ఆబ్రాహ్మణుడు మట్టుకు కదలకుండా
తెరచాప కొయ్యలాగ నిలబడిపోయినాడు. నిండు గోదావరిలో
శాస్త్రి కురిపించిన సంస్కృతం అంతా ఆ మనక్కైనా అర్థం అ
యింది నాకు నమ్మకంలేదు. చివరకు ఆబ్రాహ్మణుడు 'నాయ
నా పండితుడివి. ఇల్లాంటివేషాలు తగవుసుమా' అని చెప్పి
స్నానం పూర్తిచేసికొని వెళ్లిపోయినాడు. పాపం ఆ బ్రాహ్మణ్ణి

అల్లాగ ఆడించావు ఎందుకోయ్ అంటే ఈ కోనసీమ బ్రాహ్మ లకు ఎంతగర్వం అనుకొన్నావు? అన్నాడు శాస్త్రి.

3

మా వేహలా నేనూ ఒకరోజున మాట్లాడుకొంటూ వీధి వెంట వస్తున్నాము. శూద్రస్త్రీ ఒకతె మాకెదురువస్తుంది. స్థూలకాయ. ఏనుగ గున్నలాగ నడుస్తున్నది. వయసులోకూడా ఉండటంవల్ల లావుగా ఉన్నా ఆమె అంత అసహ్యంగా లేదు. బిగువైన కండరాల మధ్యనుంచి వయసుశోభం పొంగిపోతున్నది. గూడ్స్ ఇంజనులాగ వస్తున్నది. నేనూ చూస్తున్నాను ఆ నిండు మనిషిని. శాస్త్రీ చూస్తూన్నాడు కాని శాస్త్రి బుద్ధికి తోచిన ఆలోచన నాకు తోచలేదు. అసలు కవి ఎట్లాగయినా!

ఆవిడ దగ్గరగా వచ్చిందో లేదో శాస్త్రి నన్ను మోచేత్తో పొడిచి పొడిచి, చూడు చూడు అంటూ చూపాడు. ఆమె దగ్గరలోకి వచ్చేసరికి శాస్త్రి బెదురుచూపులు చూస్తూ భయపడు తున్నట్లు నటించాడు. కాని నిజానికి ఆమనిషి భయంకరంగా లేదు. కొంచెం అందంగా కూడా ఉంది. కాస్తోకూస్తో జీవిత మాధుర్యాన్ని గోడ అవతల కూడా చవి చూచిన మనిషిలా కనిపిస్తున్నది. మావాడు యెందుకు భయపడాలె? ఇంక ఆమె నాలుగు అయిదు గజాల దూరంలో ఉంది.

శాస్త్రి నన్ను మెల్లగా ఆమె వచ్చేదారిలోకి నెట్టాడు. ఆమె గనక తప్పుకోకుండా సరాసరిని వచ్చేసింతో నా మీద పడా

లిసిందే అటువంటి స్థితిలో నన్ను పెట్టాడు శాస్త్రి.

ఆమెకూడా చాలా గడుసుమనిషి అయివుంటుంది. తప్పుకోలేదు. సరాసరిని వచ్చేస్తున్నది ఇంక రెండు అంగుళాల దూరంలో ఉంది ఇంకో అంగుళం వేయటమే జరిగింది అనండి డాష్-తలక్రిందులు కావటం- ఇవి జరగాల్సిన విషయాలు

ఆమెగారు అంగుదూరంలో వుండగానే శాస్త్రి నా చెయ్యి పట్టుకొని గాక్కున లాగేశాడు ప్రక్కకు. లాగుతూ పైగా, అంటాడు: డాష్ అయితే చచ్చే వాడివి అని ఈ మాటలు పెద్దగానే అన్నాడు. ఆవిడ విన్నది ఈ మాటలు. ఏమిటి అబ్బాయి అంటూ వుంది? అన్నది "నిన్నేమన్నా అమ్మా, వచ్చే మనిషి తగిలితే చస్తావు ప్రక్కకు తొలగమని మా వాడితో చెప్పుతున్నాను. నిన్నే అయినా అన్నానా అని వక చిన్న తగూ ప్రారంభించాడు ఆమెతో. ఆ మనిషికూడా యేదో కేక వేసింది. మొత్తం మీద నలుగురూ చేరందిపోవాడు ఆస్థలాన్ని వదలలేదు. ఇల్లాంటి కుక్కజట్టీలు తేవటం అంటే శాస్త్రికి ఆరోజులలో మహా సరదా.

## ౪

మా వేదులను గురించి ఇంకొక్క విషయం మాత్రం వ్రాస్తాను. ఒకరోజున నేను శాస్త్రి గదికి వెళ్ళాను. శాస్త్రి ఒంటరిగా కూర్చుని ఎందుకో తీవ్రంగా ప్రార్థన చేస్తున్నాడు. నేను వెళ్ళినా మాట్లాడలేదు. కళ్ళుకూడా తెరవలేదు. అతని

ప్రార్థన పూర్తి అయ్యేపర్యంతరం నేనులాగే కూర్చున్నాను. పది నిముషాలైన తరువాత కళ్ళు నలుపుకుంటూ పద్మాసనంలోనుంచి లేచాడు. శాస్త్రి! ఏమిటయ్యా! అంత తీవ్రంగా ప్రార్థనచేస్తున్నావూ? అని అడిగాను.

శాస్త్రి సాధారణంగా నవ్వుతూ మాట్లాడేవాడు. కాని ఆ సమయంలో ఆ నున సీరియస్‌గా ఇట్లా అన్నాడు...నరసింహారావూ! నేను ఈవిశాల ప్రపంచంలో ఏకాకిని. ఇల్లు వాకిలీ లేదు. ఏగృహస్తు పంచనో ఇల్లాపడి ఉంటాను. భార్యలేదు బిడ్డలులేరు. ప్రపంచంతో నాకే విధమైన సంబంధంలేదు. కాని నాకొక్క కోరికఉంది దాని ఫలసిద్ధికై ప్రార్థన చేస్తున్నాను అన్నాడు.

పెండ్లి అయ్యేట్టు చెయ్యమనా;

కాదు

ఏ లాటరీలోనైనా డబ్బువచ్చేటట్లు చేయమనా?

కాదు.

మరేమిటి శాస్త్రి నీకోరికా? అని గట్టిగా అడిగాను. మనం కోరి తేమట్టుకు భగవంతుడు ఐశ్వర్యాను చటుక్కున ఇచ్చేస్తాడా? కోరుకున్నంత మాత్రాన దేవుడు ఒకలక్ష రూపాయలు ఇచ్చేటట్లు అయితే అంతా కోరుకుంటారు. అటువంటి గొంతెమ్మ కోరికలు నాకేమీలేవు. తెలిసిందా? పూర్వజన్మ సుకృతాన్ని బట్టి వస్తుంది. ఈ జన్మలో ఏదైనా' అని వేదాంత ఫక్కీలో మొదలుపెట్టాడు.

నేనన్నానూ—ఈ వేదాంతం కట్టిపెట్టి అసలు విషయం ఏమిటో చెప్పు. ఇప్పుడు నీకు కలిగిన బాధ ఏమిటి? అని.

'ఇదంతా ఎందుకు నా ప్రార్థన వినవోయ్' అని అంటూ మళ్ళీ కూర్చుని కృష్ణవిగ్రహానికి నమస్కరిస్తూ ఇల్లాగ అన్నాడు.

'ఓ భగవంతుడా, హే దీనబంధూ, దయాసింధూ, తండ్రి నాకు ధనధాన్యాదులు వద్దు. దారాపుత్రాదులూ వద్దు, ఇల్లు వద్దు, వాకిలి వద్దు, కవితాశక్తి వద్దూ. గడ్డలూ వద్దు. ఏమీ వద్దు. మహా ప్రభూ! నాకు ఒక్కటే కోరిక ఉంది తండ్రీ, ఆ ఒక్క కోరిక నూ మన్నించు మహాప్రభూ" అని అక్కడ ఆగాడు.

ఒక్క క్షణం ఆగి మళ్ళీ క్రైస్తవుల ప్రార్థన చేసి ఫకీర్లలో 'దీనబంధూ, ఓ ఆకాశమందున్న తండ్రీ నా ఒక్క విన్నపం... ఆ... రోజున... అగులాగుల ... నరము ... ప్రసాదింపుము... తండ్రీ... పరలోకమందున్న ... నీ రాజ్యము... ఇక్కడ... ఉండుగాక... ఆమేన్..." అని పూర్తి చేసి కళ్ళు తెరిచాడు.

శాస్త్రి ఆరోజులలో మలబద్ధకంతో బాధపడుతూ ఉండే వాడు. ఎవరైనా స్నేహితుడు కనపడితే కుశలప్రశ్న అడిగే లోపలే బదర్ రోజూ సుఖవిరోచనం అవుతుందా అని. దాని తరువాత అతనికి వివాహమూ అయింది ఆ బాధా పోయింది. ఇప్పుడు సంతానవంతుడై కులాసాగా ఉన్నాడు.

*

శాస్త్రి చిన్నతనంలో ఇంత అల్లరివాడు. కష్టాలు పడుతున్నా,

దారిద్ర్యంలో కుమిలిపోతున్నా పైకి మాత్రం సంతోషంగా ఉత్సాహంగా ఉల్లరిగా ఉండేవాడు.

ఒకరోజున అడిగాను నేను ఏమి శాస్త్రీ-ఏప్పుడు కవిత్వం వ్రాస్తావు, ఏవో చెప్పలేని బాధలు నా హృదయాన్ని దొలిచి రంపాన పెడుతున్నాయి అంటావూ—కానిపైకి ఇంత సంతోషంగా ఉంటావు ఏమిటిది అని.

అతను ఒకపద్యం చెప్పాడు జవాబుగా. పద్యం పూర్తిగా జ్ఞాపకంలేదు. కాని అందులో భావం ఏమిటంటే:—

సముద్రాన్ని చూచి, అది పొంగిపోతూ సంతోషిస్తున్నదని, అనుకుంటారు. కాని ఆ అబ్ధిగర్భజ్వాలద్బడబాగ్ని శిఖల నెవరు చూడగలరు సఖుడా! అని. అప్పుడే అనుకున్నాను. ఈతని జీవితానికి కవిత్వానికి సమన్వయం ఇప్పుడు కుదిరిందీ అని.

## 5

గుంటూరులో నేను ఇంటర్ మీడియట్ క్లాసులో విద్యార్థిగ నున్న రోజులలో, ఆరండల్ పేటలో నా నివాసం. నేనున్న యింటికి రెండిళ్ళకు అవతల శ్రీ శివశంకర శాస్త్రిగారి కాపరం.

ఒకరోజున నేను ఒక స్నేహితుడితో కలసి వీధి వెంటనడుస్తూ కన్యాశుల్కాన్ని గురించి చర్చిస్తున్నాను. అతడు ఆపుస్తకం

వట్టి పనికిమాలినదని వాదిస్తున్నారు. అందులో వాడిన భాష విషయమైతే ముఖ్యంగా అతని తగాదా. అప్పటికి ఆ భాషలో రచనలు అట్టే బాగులేదే లేదు. అందుకని భాషా విషయిక చర్చలు తీవ్రంగా జరుగుతు వుండేవి. మేము కుర్రవాళ్లమైనా, మాకు తోచిన రీతిని, నాగరీభాషయొక్క మంచి చెడ్డలను గూర్చి తీవ్రంగానే చర్చిస్తున్నాము.

అయితే నా స్నేహితుడు భాషవిషయంలో నాకంటే బాగా తెలిసినవాడు. ఆయన ప్రశ్నలకు నేను సమాధానం చెప్పలేక పోతున్నాను. ఆసమయానికే వెనకనుంచి వస్తున్న శివశంకరశాస్త్రిగారు సమస్యలను కలిపికొని, నా వాదాన్ని అందుకొని గెలబెట్టారు. నాకు అఖండమయిన జయం కలిగింది అనిపించింది. ఆ క్షణంనుంచి నాకు అపరిమితమయిన భక్తి కుదిరింది. ఆయన వాదించిన విధానాన్ని చూస్తే ఆయన ఎంతో తెలిసినవాడని, బాగాచదువుకొన్నవాడని బోధపడ్డది. అంతకు పూర్వం ఆ ఘనను నేను రోజూచూస్తూ నేవున్నాను. కాని ఎప్పుడూ మాట్లాడించి ఎరుగను. ఆరోజుననే నేను ఆయనతో మాటలాడాను.

నాయందు ఆయనకు ఎందుచేతో అభిమానం కలిగింది. నా అంతట నేను ఆయన స్నేహానికై ప్రయత్నించే అంతటి సాహసం నాకులేదు. కాని ఆయనే నా గదికి అప్పుడప్పుడు వచ్చి మాటలాడుతుండేవారు. మొదటి రోజులలో ఆయన ఏమైనా చెపుతూవుంటే నేను భయంగా వింటూవుండేవాణ్ణి.

ఏదైనా సరే మాటాడటానికి ధైర్యం ఉండేదికాదు. క్రమంగా ఆయన చనువిచ్చి మాటలాడి, నా భీతి పూర్తిగా పోగొట్టారు. నేను ఆయనకు ఓ విధంగా శిష్యుణ్ణి అయినాను. నాచేత ఆయన ఎన్నో పుస్తకాలు చదివించారు. నాకు వాఙ్మయమునందు అభిరుచి కల్పించింది ఆయనే. అంతఃపూర్వం నేను తరగతి గ్రంథాలు తప్ప ఇతర గ్రంథములు చదువుకొనేవాడిని కాను. ఆయన సాంగత్యం వల్ల ఆంగ్ల సాహిత్యంతో కొంత పరిచయం కలుగజేసుకొన్నాను. కాని పరీక్షా గ్రంథాలు చదవటం మానేశాను అందువల్ల ఆ సంవత్సరం తప్పాను. కాని నాకున్న విద్యా సంపత్తి చాలా ఉండి తరగతి వాళ్ళకంటే నేను అనుకొని గర్వపడుతూఉండేవాణ్ణి.

శాస్త్రిగారు తియ్యనిమాటలు మాట్లాడటంలో నేర్పరి. నాకప్పటికి చిన్నతనం. సృష్టిఅంతా విచిత్రంగా ఉండి, అప్పుడప్పుడే ఆవైచిత్ర్యాన్ని చూస్తూన్న నాకు శాస్త్రిగారి సంభాషణ క్రొత్తక్రొత్త వింత విషయాలను బహిర్గతంచేసి, ముగ్ధుణ్ణిచేస్తుండేది. గటే, నీచే మొదలైన గ్రంథకర్తల రచనలలోనుంచి కొన్ని వాక్యాలు ఆయననాకు వినిపిస్తూఉంటే అవినేను వ్రాసుకొని, క్లాసులో తరగతివాళ్లతో సంభాషించే సందర్భంలో వాడితే, వాళ్ళు తెల్లబోయి నావంక చూస్తుండేవాళ్లు.

ఆరోజులలోనే ఆయన సాహితీ పత్రికను ప్రచురించారు. సాహితీ ప్రథమసంచికకే నన్నేదైనా వ్రాయమన్నారు. అప్పట్లో తెలుగులో ఏమీ వ్రాయటం అలవాటులేదు నాకు. ఇంగ్లీషులోనే

స్వతంత్రమైన వ్యాసాలు, చిన్న చిన్న పద్యాలువ్రాస్తుండేవాణ్ణి. అయినా ఆయన ప్రోత్సాహంవల్ల ఉఫ్ అనే స్కెచ్ వ్రాశాను. దానిని ఆయనస్వీకరించి, సాహితిలో అచ్చువేసి, ఆపత్రికనాకు చూపారు నా పేరు అచ్చులో చూచి నేను పొందిన సంతోషం ఇంతా అంతా కాదు. నెలరోజులుఆ పత్రికచేత్తో పట్టుకొనితిరిగి ఎంతమందికో చూపించి సంతోషించాను.

కొన్ని రోజులు గడిచిన తరువాత ఆయనరోజూ నన్ను సాయంత్రం కాఫీహోటలుకు తీసుకొనిపోయేవారు. నాయందు ఆయనకు అంత అభిమానం ఎందుకు కలిగిందో నేను ఇప్పటికీ ఊహించలేను. రోజూటీమాత్రం పుచ్చుకొనేవాళ్లం. ఆయనేడబ్బు ఇచ్చేవాడు.

నాదగ్గర డబ్బుఉండేదికాదు ఉన్నా ఆయన ఇవ్వనిచ్చేవాడూ కాదు. "ఏమండీ శాస్త్రీగారూఇల్లాగమీరు కాఫీహోటల్ బిల్లు ఇస్తే, నేనుమీకెంతో ఋణపడిపోతాను——ఎంత కాకపోతేకొంతఅయినా నన్ను ఇచ్చుకోనీయండీ" అంటే ఆయన——ఇప్పుడు మీరు విద్యార్థిగాఉన్నారు. డబ్బుమీరు కర్చుపెట్టటం నేను అంగీకరించను. మీరుపెద్దవాళ్లై సంపాదిస్తారు. అప్పుడు కావలిస్తేనాకుమళ్లామీరు ఇవ్వవొచ్చులెండిఅని పుత్రవాత్సల్యంతో అనేవారు. స్నేహితులవిషయంలో అంతదయచూపడం, ఆయిన ఒక్క విషయంలోనే చూశాను నాజీవితంలో. ఆమాట ఎప్పుడూ నేను మరచిపోలేదు.

సంపాదించేరోజులు వచ్చినవి. బాధ్యతలుఎక్కువఅయినయి.

శాస్త్రిగారు నన్ను ఎప్పుడూడబ్బు కావాలిఅని అడగలేదు. కాని ఒకమారు కామాలు ఒక రూపాయి ఇమ్మని అడిగారు.నావద్ద లేకపోలేదు. కాని ఇవ్వటానికి బుద్ధిపుట్టలేదు. లేదనోఏదో సమాధానం చెప్పాను. దానితరువాత నాదుర్మార్గం నాకు తెలిసొచ్చింది ఏడుపుకూడావచ్చింది. కాని మళ్లీ ఆవిషయంమరిచి పోగలిగాను. ఒకమారు మాటవరుసగా ఆయన చెప్పారు.
"స్నేహితులకోసం కొన్ని వందల రూపాయలువ్యయము చేశాను రావుజీ"అని. అందరూ నావలెనేకృతఘ్నతతో ప్రవర్తించారో లేదో నాకు తెలియదు.

సాయింత్రం టీ కే కాక సెలవదినాలలో పొద్దుటిపూట కాఫీకికూడ ఆయనతోనే వెళ్ళటంసాగించాను నేను. నేను ఆరోజుల్లో కాఫీతాగేవాణ్ణికాదు. ఏమైగాతిని కాసిని మంచినీళ్ళుతో సంతోషించేవాడిని. ఒకరోజున ఆయననన్ను కాఫీతాగమన్నారు. అలవాటులేదండీ. అన్నాను. "కాఫీతాగందికవికాలేవు రావుజీ" అన్నారు కవినికావాలనే నాఆశయం. అందుకని మళ్ళీమాట్లాడక ఊరుకొన్నాను. వెంటనే ఆయన కాఫీతెప్పించినాముందు పెట్టించారు. నేను కొద్దిగా పుచ్చుకొనిచేదుగా ఉందండీ, నాకు వద్దుస్వామీ, కవినికాకపోతేమానెలెండి, మీ సాంగత్య మహాత్మ్యంవల్లవచనరచయితనైనా కాలేకపోతానా అన్నాను. శాస్త్రిగారు నవ్వుతూ, "తప్పదు.మందులాగన్నాపుచ్చుకోండి,ఎంచేతాఅంటే కాఫీతాగకపోతే కలం పట్టుకునేందుకు అర్హతలేదు రావుజీ" అన్నారు. ఆరోజుకు కళ్ళుమూసుకుని గుటుక్కునమిం-

గా . నుకోంకి. దాని తరువాత గాగా అలవాటయింది. ఇప్పటికీ ఆ అలవాటు నన్ను వదలలేదు. వారన్నట్టులు కాఫీకి-కథలు వ్రాసే శక్తికీ ఏదో సంబంధం ఉన్నట్టులే తోస్తుంది నామట్టుకునాకు.

ఒకమారు నేను శాస్త్రిగారిని అనుష్టుప్ అంటే ఏమిటండీ అని అడిగాను. ఏ సందర్భంలోనో, అది ఏమిటో తెలుసుకో వలసి వచ్చింది. అది వేదంలో ఛందోబద్ధమైన ఒకరచన అని చెప్పారు. దాని నడక ఎల్లావుంటుందో నాకు చూపాలన్నాను.

ఒక కాని- ఒకేకాని
రెండు కానులు- అర్ధణా
మూడు కానులు- ముక్కానీ
నాలుగు కానులు- ఒక అణా

అని అనుష్టుప్ నడకలో చదివి ఇల్లాగ ఉంటుందిఅన్నారు. ఆయన పరిహాసానికి అన్నారు. కాని తరువాత కొందరు నవ కవులు ఆ నడకను తీసుకొని రచనలు సాగించారు.

ఆయన వాడిన చలోక్తులు, చాలా వాడుక లోకి పాకిపోయి నాయి. మనిషి కోరదగినవి కాఫీ, కాంతా కాంచనాలని ఆయనే కల్పించారు.

ఒకమారు ఏదో మాట్లాడుతూ వితంతువుల కేశఖండన స్మార్తుల విషయంలో నిత్యమనీ, వైష్ణవుల విషయంలో నిషేధమనీ, మధ్వుల విషయంలో వైకల్పికం అనీ ఆయన, ఆ ఆచారాన్ని, వ్యాకరణ పరిభాషలో నిర్వచించారు.

మధురమైన వాక్కు ఎవరిదీఅంటే శివశంకర శాస్త్రిగారి॥

అని చెప్పాలె. కోపంవచ్చినా పరుషవాక్కు ఆయననోటరాదు. హృదయేశ్వరిలో—పరుషాలు లేవనే అంటారు.

నేనూ ఆయనప్రోత్సాహంవల్లనే కథలు వ్రాశాను. మొదటి కథ ఆయనచెప్పి వ్రాయించారు. నావంటివాళ్ళను ఎందరినో ఆయన సృష్టించారు. తిరుపతి వెంకట శాస్త్రిగారి శిష్యులమని చెప్పుకొని గర్వపడతారుగాని, శివశంకర శాస్త్రిగారి శిష్యులమని చెప్పుకోరుమరి. కాని అపూర్వపు అర్థంలో కాకపోయినా, ఆయన శిష్యులమని చెప్ప తగినవారు ఆధునిక రచయితలలో చాలామంది ఉన్నారని నాకు తెలుసు. మాలో ఎంతోమంది భావగమనము, ఆయన చూపుడు వ్రేలును అనుసరిస్తున్నది.

మనిషిలో ఏమాత్రం పనికివచ్చే పదార్థంఉన్నా ఊరికే పోనిచ్చేవారు కారు శాస్త్రిగారు. ఎందరినో కవులను, కథకులను, తయారుచేశారు. క్రూరరుధిరోద్గారి ఆయనకొంప కూల్చింది. బహుధాన్య నాకొంపతీసింది. ఇద్దరం జీవితంలో చెడిపోయినాము. గురు శిష్యులమైనందుకు ఇద్దరం కష్టాలు అనుభవిస్తూ ఎదురు చూడతగిన సుఖముఁలేక పోయినా ఎండినమానుల్లాగ జీవిస్తున్నాము.

## 6

గుంటూరులో సాహితీసమితి సభజరిగిన సందర్భములో ఒక కథ జరిగింది.

సభ జరగటానికి వెనుకటిరోజున సాయంత్రం నేను ఇంటివ

ద్దనుంచి శాస్త్రి గారి ఇంటికి వెళ్ళాలని బయలుదేరాను. మరుస టిరోజు సభకు గొప్పగొప్ప వాళ్ళంతా వస్తారని విన్నాను. ఆ రోజుసాయంత్రానికే కొంతమంది మహానుభావులు రావచ్చు. గిడుగు రామమూర్తిగారు, చింతాదీక్షితులుగారు, మొక్క పాటి నరసింహశాస్త్రిగారు ఇంకా ఎవరెవరో రావలసిఉంది. వారిలో ఎవరైనా వచ్చిఉన్నారేమో, వస్తే, వారి దర్శనం చేసుకోందామని కుతూహలంలో ఆ రోజున బయలుదేరాను.

అప్పటికే చీకటిపడ్డది. ఆ రోజులలో ఎలక్ట్రిక్ దీపాలులేవు. ఏవో కిరసనాయిల్ దీపాలు ఉన్నాయి కాని అవి గుం టూరు మండుటెండలకు శుష్కించి బక్కచిక్కి సగంచచ్చి ఉన్నాయి. గుడ్డి వెలుగు.

నేను కాలేజీసమీపంలోకి వెళ్ళేసరికి శ్రీనివాస శిరోమణి ఎక్కడినుంచో వస్తున్నాడు. గబగబ నడిచి ఆతన్ని కలుసుకొని ఎక్కడినుంచి వస్తున్నారు? శాస్త్రిగారి ఇంటికేనా! ఇవ్వాళ వైల్లో ఎవరైనావచ్చారా! అని గబగబ నాల్గుప్రశ్నలు అడిగాను.

శిరోమణి నావంక మామూలుగానే ఉరిమిచూచి చింతా దీక్షితులుగారు వచ్చారు అన్నాడు.

ఆపేరువినేసరికి నాగుండె గుబుక్కుమంది. ఆమహానుభావుణ్ణి నేను అప్పటికి ఎన్నడూ చూచిఉండలేదు. కాని ఆయన అప్ప టికేవ్రాసిన కొన్ని చక్కని కథలు చదివి ఆనందించాను అం దులో ముఖ్యంగా 'ముద్దు' అనే కథ నన్ను ఎక్కువగా ఆక

ర్షించింది.

నా చిన్నతనంలో, నా మనస్సు అంతా సంతోషంతో పొంగిపోతుండేది. సృష్టి అంతా ఆనందమయంగా ఉండేది.

దీక్షితులుగారి కథలు చదివినతరువాత ఆయన నిజంగా చాలా గొప్పవాడని తోచింది. ఆయనయందు అపరిమితమైన భక్తి గౌరవాలు కలిగినవి. ఆయనను ఎప్పుడు చూస్తానా అని ఆతుర్దాపడ్డాను. దీక్షితులు గారిని చూడటం అంటే అదేదో ఘనకార్యమనీ, అందరికీ అటువంటి అదృష్టం లభించదనీ అనుకొన్నాను. శివశంకర శాస్త్రిగారు ఆ తరువాత నాకు పరిచయం కలుగచేస్తాననికూడా చెప్పారు. నా కేదో పిచ్చి సంతోషం కలిగింది. శబరి శ్రీరామసందర్శనానికై ఎంత తహతహలాడిందో, అంత తహతహలాడాను నేను ఆయన దర్శనానికి! నా మనస్సు అంతా ఇట్లాంటి భావాలతో నిండి ఉండటంమూలాన, దీక్షితులుగారు వచ్చారూ అనేసరికి నా గుండె గుబుక్కుమంది.

ఏరీ దీక్షితులుగారు అని అడిగాను శిరోమణిని. శిరోమణి ఉరిమి చూచి తొందరపడతావెందుకూ రైలుదిగారు వారి సామాను ఇదిగో కూలి మోసుకొస్తున్నాడు. శంకరశాస్త్రిగారు దీక్షితులుగారిని రైలుదగ్గరే కలుసుకొన్నారు. సామాను కూలిచేత పట్టించుకొని వెళ్ళమని నాకు చెప్పి, వాళ్లిద్దరూ కాఫీ తాగటానికి హోటలు వెళ్లారు" అన్నాడు. నేను తక్కునఆగి 'నేనుకూడా అట్లాగే వెళ్ళివాళ్లను కలుసుకుంటాను' అని అంటూ వెనక్కు తిరిగాను.

నేను అటు తిరగకముందే శిరోమణి నన్ను తపీమని ఆపేసి మళ్ళీ ఓసారి ఉరిమి చూచి "ప్రొద్దుటినుంచి ప్రతిరైలు కూచూస్తూ ఉన్నాను. వచ్చే పెద్దమనుష్యులను ఆహ్వానించటానికి. ఆకలి దహించుకుపోతున్నది. నేను అల్లాగ వెడతాను. నీవు ఈకూలిని తీసికెళ్ళి నరసింహశాస్త్రిగారింట్లో ఈసామాను పెట్టించు" అని రెండు అడుగులు వెనక్కు వేసి, ఆగి, మళ్ళీ నన్ను పిలచి 'ఈకూలికి అణా ఇయ్యాలె ఇదగ' అని అణాకాసు నా చేతిలో పడేసి ఏనుగుగున్నలాగ నడిచిపోయినాడు.

దీక్షితులుగారిని చూడటానికి వెంటనే వెళ్ళకపోతినే అని నాకు విచారం వేసింది ఇంకా కాసేపటికి చూస్తాను. కాని అంతవరకు మనస్సు ఊరుకోలేదు.

కూలీని పిలిచి 'ఏంరా, రైలులో దిగిన ఆయనను చూశావురా నీవు" అన్నాను. 'ఎవరండీ బాబు. చాలామంది దిగారండి రైల్లో' అన్నాడు. ఇంత తెలివైన జబాబు ఇచ్చాడే వెధవ కూలివాడు అనుకొని మళ్ళీ అన్నాను. 'ఇప్పుడు నీవు మోస్తున్న సామాను ఎవరిదిరా? ఆ సామానుగల ఆయన ఇవ్వాళ రైల్లో దిగాడు. ఆయనను చూశావా' అన్నాను.

"ఈ సామాను ఎవరిదో; ఆ ఆసామెవరో నాకు తెల్దండి బాబు. ఆ గడ్డపాయన ఈసామాను నా నెత్తినెట్టినాడండి" అన్నాడు. గడ్డపాయనంటే శిరోమణి.

'అవునులే-అప్పుడు ఆయన ప్రక్కన ఇంకెవ్వరూ లేరా?" అన్నాను.

"ఉన్నారుండీ, పూలసాలు వేసుకొన్న శాస్త్రులయ్యగారూనూ మరో పొడుగాటి ఆయనాను ఉన్నారండీ" అన్నాడు.

పూలశాలు వేసుకొన్నాయన శివశంకరశాస్త్రిగారని తెలుస్తునేఉంది. ఇక ఆపొడుగాటిఆయన దీక్షితులుగారు అయి ఉంటారని ఊహించాను!

'ఓరే ఎంతపొడుగుంటారురా ఆయన' అని ఆదుర్దాగా అడిగాను. కూలీ పకపకానవ్వి-అబ్బో గేడికొంగలాగున్నాడండి నాకంటె పొడుగండీ అన్నాడు. నాకు ఆశ్చర్యంకలిగింది ఎందుకంటేఆకూలీఏమీసామాన్యంమనిషికాడు.ఆరుఅడుగులున్నాడు అంత పొడుగైనమనిషిని ఊహించుకుంటూ నడుస్తున్నాను. కూలివాడు దారిపొడుగునా, చాలాదూరం వచ్చానండీ పెద్ద బరువు మోస్తున్నానండీ అంటూ గోలపెడుతునే ఉన్నాడు.

ఇంతలోకి శాస్త్రిగారి ఇంటికివచ్చాము. సామాను లోపల పెట్టిస్తూఉంటే ఆయనవచ్చి ఎవరు వచ్చారు అన్నాడు. 'దీక్షితులుగారు వచ్చారట' అన్నాను. "ఏరీ?" అని ఆయనా ఆతురతతో అడిగారు. శాస్త్రికూడా అంతకు ముందు దీక్షితులుగారిని చూచిఉండకపోవటం మూలాన ఎక్కువ ఆతురతతో ఆయన చూడాలని తహతహ లాడిపోయి "అయితే వెనకాలవస్తున్నారా" అన్నాడు. "లేదు శాస్త్రిగారూ ఆయనా కలిసి కాఫీ హోటలుకు వెళ్ళారట. శిరోమణిమటుకు ఈ సామాను పట్టించుకొని వస్తూ, దారిలో నేను కనపడేసరికి కూలీని నాకు ఒప్పగించి, ఆయనకూడా వెళ్ళాడు' అన్నాను.

శాస్త్రిగారు "అల్లాగా? అయితే మనం కూడా అల్లాగ వెడదాము. వాళ్ళువస్తూ ఉన్నట్లాయినా మనకు మొకుపడనే పడతారు. లేకపోతే మనంకూడా కాఫీహోటల్‌కు వెడదాము రండి" అన్నాడు

ఈ మాటలువిని నేనూ సంతోషించాను. దీక్షితులుగారిని ఎంత తొందరగాకలుసుకొంటే అంత ఆనందం 'అయితే, మీరు దీక్షితులుగారిని గుర్తుపట్టగలరా' అన్నాను. నేనెప్పుడూ చూడలేదుగాని ప్రాద్దున శిరోమణి మాట వరుసన చెప్పారు ఆయన చాలా పొట్టి వాడస' అన్నాగు "అయ్యో ఆలాకాదు. ఆయన చాలా పొడుగువాడుటండీ. ఈ కూలీ చెబుతుంటేనే" అన్నాను నేను. 'ఛా, ఛా, వాడికేం తెలుసు. ఎవరినిచూచి అనుకొన్నాడో. అయినా ఇప్పుడెందుకూ ఈతర్కం, నడవండి వెడదామూ' అన్నాడు శాస్త్రి. ఈ సంభాషణ అంతా కూలి శ్రద్ధగా వింటూ నుంచున్నాడు.

నా చేతిలో ఉన్న అణా కూలివాడి కిచ్చి ఇక నువ్వుపోరా అన్నాను. కూలీ అణాపుచ్చుకొని, కష్టానికి చాలదని గోల పెట్టాడు. పోనీలేఅని ఇంకొక అర్ధణా ఉంటే యిచ్చాను. అప్ప టికీ వాడు సంతోషించక, 'శాస్త్రులగారి ఇంటికి గొప్పోరు స్తుంటారు బాబు. నేనేం కొత్తోణ్ణా ఏటండి ఇంతోడినుంచి ఈ ఊళ్ళోనే పెరిగానండి బాబు, నాకు తెల్దాపటండి మొన్నొచ్చిన గిరిజాలయ్యగారు పావలాకాసు ఇచ్చినోరండి' అన్నాడు. మా సమితిసభ్యుల సంగతి వీడు బాగా కనిపెట్టే అడుగుతున్నాడు.

అని తోచింది. గిరజాలయ్యగారు అంటే దేవులపల్లి కృష్ణశాస్త్రి గారు. అంతకుపూర్వం ఒకటి, రెండురోజులు ముందుగా వచ్చారు.

కాని నాదగ్గర డబ్బులేదు. అందుకని "అణాఇస్తామని ఒప్పుకొని అణాన్నర ఇస్తే, ఇంకా నీవు గునుస్తావేంరా? పో, పో. చాల్లే. ఇంక ఒకదమ్మిడీకూడా నీకియ్యకూడదు, పో, పొమ్మంటూంటే" అన్నాను. "అగ్గాదండీ బాబు, ఈ ఇంటికూలికోసం కనిపెట్టుకొని కూకుంటూనండిబాబు. ఈఇంటికొచ్చే దొరలంతా పావలాకాసు తీస్తారండి' అంటూసాగించాడు గొణుగుడు.

మేము వెళ్ళిపోవాలని ఆదుర్దాగాఉంది. ఈ పిచ్చిగొణుగుడు చూచి మా కసహ్యం వేసింది. అందులో అనుకొన్న దాని కంటే ఒక అర్థణా ఎక్కువ ఇచ్చినా తృప్తిలేక పావలాయీయ మనటం చాలా అన్యాయమనిపించింది మా శాస్త్రికి. వాడు ఎంత సేపటికీపోక మా వెంటబడటం మూలాన ఆయన నోరు జేసుకొని,

'ఎవర్రానువ్వా? ఎప్పుడైనా పావలాడబ్బులు కూలి తీసుకొన్నావా ఒక్కచిన్నపెట్టె మోసినందుకు? ఆశకు అంతు ఉండాలి! నీవు ఎంత అరచినా ఒక్కదమ్మిడీ అయినా ఇవ్వను. మర్యాదగా పో' అని గట్టిగా కోప్పడ్డాడు.

కూలివాడు భయపడ్డాడు. 'మీ దయ బాబూ, పోనీలెండి' అని మళ్ళా 'ఈ పూట కాస్త బువ్వెట్టించండి బాబూ' అని దీనంగా అడిగాడు.

వాడి మొండితనంచూస్తే మాకు వళ్లుమండిపోయింది. "అన్నంకూడా పెట్టాలేం—బాగా కడుపేట్టావురా మా సంగతి మెత్తనివాళ్లమనీ! చాల్లె! నాదగ్గర నీపప్పులుడకవు. మర్యాదగా నడు' అని గదమకొట్టి మేమిద్దరం దీక్షితులుగారిని కలుసుకోవాలని కుతూహలంతో వేగంగా నడవటం మొదలు పెట్టాము'

మేము అట్టేదూరం పోలేదు సందుచివరకు వెళ్లేసరికి, పూలశాలువ శాస్తుల్లు (శివశంకరశాస్త్రి), ద్వైపాయన (శిరోమణీ) మా కెదురుపడ్డారు. కూలి మా వెనకాలె వడుస్తున్నాడు చీకట్లో. శాస్త్రిగారు అన్నారూ, ఏమండి శంకరశాస్త్రిగారూ దీక్షితులు అన్నగారేరీ అని 'ఆయన వచ్చాడని ఇప్పుడే శిరోమణి చెప్పాడు. ఏడీ ఆయన? మీ ఇట్లో ఉన్నారన్నాడే శిరోమణి!' అన్నాడు శివశంకరశాస్త్రిగారు

శంకరశాస్త్రిగారితో కలిసివెళ్ళారు దీక్షితులుగారని చెప్పాడాయె శిరోమణి మాకు? అందుకని శంకరశాస్త్రిగారి మాటలు మాకు ఆశ్చర్యం కలిగించినై తెల్లపోయినాము.

ఆ యన అల్లాగ అనటం, మేము తెల్లపోవటం ఇదంతా, ఒక్క క్షణకాలంలో జరిగిన విషయం. శంకరశాస్త్రిగారు—ఆచీకట్లో నివ్వెరపడి ఎందుకో ఒక్క క్షణంచూచి "అన్నగారూ" అని ఒక పెద్దకేక వేసి, చటుక్కున వెళ్లి, ఆకూలీని కౌగిలించుకొన్నాడు. కూలీ నవ్వుతూ, ఇప్పుడేవచ్చానండీ, శాస్త్రిగారు [illegible] .....ఈపూట......అన్నం......పెట్టనంటే వెళ్ళిపో

తున్నానండీ అన్నాడు. "ఈ వేషం ఏమిటి" అన్నాడు శంకర శాస్త్రి గారు. "కూలీ వేషం" అన్నాడు దీక్షితులుగారు. శంకర శాస్త్రి గారు సంగతి గ్రహించి, గంభీరంగా చూశాడు శిరోమణి వంక. తాను సూత్రధారి అయి నడిపించిన నాటకం జయప్రదంగా సాగినందుకు శిరోమణి గడ్డం సవరించుకొన్నాడు. మేము ఇద్దరం పిల్లులమై పోయినాము. సిగ్గుచేత లో చుకొన్నాము. చచ్చిన చావై పోయింది ఏ మహానుభావుణ్ణి చూడాలని మేము ఆతురత పడ్డామో ఆయన్నే మేము కూలీ అనుకొని పిచ్చిగా మాట్లాడాము మా స్థితి గ్రహించి, దీక్షితులుగారు మాదగ్గరకు వచ్చి తన రెండుచేతులూ మాయిద్దరి భుజాలపైని వేసి, పకపక నవ్వాడు.

నేను రాజమండ్రిలో ఎల్‌టీ చదువుతున్న రోజుల్లో మరో చిన్న విషయం జరిగింది. ఒకరోజున దీక్షితులుగారూ, వేదులా; కృష్ణ శాస్త్రీ మా యింటికి వచ్చారు. సాయంత్రం అయిదుగంటల వేళ అయి ఉంటుందప్పుడు. మేమంతా వీధి అరుగుపైన కూర్చుని ఏదో మాట్లాడుకొంటున్నాము. ఏదో సర్కస్, అప్పుడు ఆవూళ్లో ఉందనుకొంటాను. లేకపోతే ఆరోజున ఏదైనా నాటకం ఉందో, బాగా జ్ఞాపకంలేదు. ఆసంబంధమైన బాజాల బండి వచ్చింది కాగితాలు పంచిపెడుతున్నాడు అందులో ఒకడు కూర్చుని. పిల్లలు బండివెంటపడ్డారు. అందులో కూర్చున్న అతడు వాళ్లల్లో పెద్దవాళ్లందరికీ తలో కాయితం ఇచ్చాడు. ఒక్క చిన్న పిల్ల మిగిలిపోయింది.

ఆబిడ్డ అయిదారేండ్ల పసిబిడ్డ. బండివెంట ఆబిడ్డ కాస్త దూరం పరు

గత్తి, కాయితం ఇయ్యకపోతే బిక్కముఖం వేసుకొని నుంచున్నది. ఆ వెళ్లిపోతున్న బండికేసి దీనంగా, దిగులుగాచూస్తూ. ఈదృశ్యాన్ని మేమంతా చూస్తునేఉన్నాము. కాని మాకెవ్వరికీ తోచని ఆలోచన దీక్షితులుగారికి ఒక్కడికీ తోచింది. అరుగుమీద కూర్చున్న అంతమనిషి, అమాంతం, అక్కడ నుంచి క్రిందికి దూకి, పరుగెత్తుకుంటూ వెళ్ళి, కంపెనీకాయితం ఒకటి అడిగితీసుకొని, ఆపిల్లచేతులో పెట్టాడు. ఆక్షణంలో ఆయన ముఖంలో తృప్తి, సంతోషమూ తాండవించినవి. అంత చిన్నపని సంకోచం లేకుండా చెయ్యటమూ, ఆ పరుగెత్తుకుంటూ వెళ్ళడమూ, కాయితం ఆపిల్లకిచ్చి సంతోషించటమూ చూస్తే, మాకందరికీ ఆశ్చర్యం కలిగింది. ఆబిడ్డముఖం చేటంత అయింది. ఎంతో సంతోషంతో ఆబిడ్డ పరుగెత్తుకుంటూ తల్లి దగ్గరకు పోయింది. ఆపిల్ల సంతోషంచూచి మాదీక్షితులు అన్నగారు పొంగిపోయినారు.

ఆబిడ్డ మనస్సులోదూరి ఆపిల్ల దుఃఖాలని ఆ ఒక్క దీక్షితులుగారే గ్రహించారు. ఆవెధవ కాయితం దొరక్కపోవటం మూలాన ఆ పసిది ఎంత హృదయవేదన పొందుతున్నదో ఆయన ఒక్కరే తెలుసుకొన్నారు.

'బాలానంద' అనే చిన్న స్కెచెస్ వ్రాయగల దీక్షితులుగారు అప్పుడు బయటపడ్డారు. బాజాలమ్మ బాజాలు, అమ్మని పిలవరా బాజాలు, అక్కను పిలవరా బాజాలు అనీ, తిన్నారమ్మా తిన్నారూ చేగోడీలూ తిన్నారూ, ఇంకాకావాలన్నారుఅనీ బాల

గేయాలూ లక్కపిడతలూ అనే పుస్తకాలు వ్రాయగల దీక్షి తులుగారూ ఆరోజునే బైటపడ్డారు.

# 7

విశ్వనాథ సత్యనారాయణ గారితో నాకు 'సాహితి' ప్రచురిస్తూన్న రోజులలో పరిచయం అయింది. ఆయన అప్పటికి గొప్ప కవి కాలేదు. ఇప్పుడు ఉన్న పేరు ప్రతిష్ఠలు అప్పట్లో ఆయనకు లేవు. 'గిరికుమార' అనే పేరుతో పద్యాలు సాహితిలో ప్రచురిస్తూ ఉండేవారు

అప్పుడు నేను గుంటూరులో ఉండేవాడిని. ఒకసారి ఎందుకో నేను రైలుస్టేషనుకు వెళ్ళాను. ఓవర్ బ్రిడ్జి పైన, మెట్లమీద సత్యనారాయణగారూ ఇంకో మనిషీ కూర్చు న్నారు. సత్యనారాయణగారు సాహితిలో ప్రచురింపబడ్డ తన పద్యాలు చదువుకొంటున్నారు.

సాహితి ప్రచురిస్తూన్న కొత్తరోజులవి. సాహితి ఎవరైనా చదువుతూఉంటే వాళ్లు అందులోని రచనలనుగురించి ఏమను కొంటున్నారో తెలిసికొంటామని నాకు ఆదుర్దాగా ఉండేది. నా రచన ఏమైనా అందులో ఉంటే నాకు ఇంకా ఆదుర్దాగా ఉండేది. అందుకని అల్లాగ సాహితి ఎవరైనా చదవటం చూస్తేనా, నేను అక్కడికి వెళ్ళిపోయి వాళ్ళు అనుకుంటూన్న సంగతులు వినటం మామూలు. అల్లాగే ఆ రోజున సాహితి

చదువుతూన్న సత్యనారాయణగారి దగ్గరకు వెళ్లి నుంచున్నాను. ఆయన తన పద్యాలు చదువుకొని ఆనందించి నావంక చూశారు. నేనేమి మాట్లాడలేను. ఎవరు నీవు? నీ పేరేమి? అన్నారు. నేను చెప్పాను. ఇది వ్రాసింది నువ్వేనా అని సాహితిలో అచ్చుపడ్డ—"నేనే మేఘపుతునకనైతే"—అనే వ్యాసం చూపారు. అవునన్నాను నేను. నేను అదే వ్రాయటం మొదలు. అంతకు పూర్వం "ఉఫ్" అని, "పుష్పలోకం" అని రెండు చిన్న స్కెచెస్ మాత్రం వ్రాశాను. "ఉఫ్" అనే స్కెచ్‌ని అక్కిరాజు ఉమాకాంతంగారు మెచ్చుకొన్నారు. నేను వ్రాసినవాటిని ఎవరైనా మెచ్చుకొంటే మహాసంతోషంగా ఉండేది నాకు ఆ రోజులలో. అప్పుడేమిటి ఇప్పుడూ అంతే ఆ మాటకొస్తే.

ఒక స్నేహితుడు నారచనలను మెచ్చుకొని నాతో స్నేహం చేశాడు. నేనూ సంతోషిస్తూ అతని సాంగత్యాన్ని అభిలషిస్తూ కాఫీహోటల్సుకు తీసికొనివెళ్లుతూ ఉండేవాణ్ణి. కొంతకాలం గడిచింది. ఆర్థికపరిస్థితులు మారటంవల్ల అతణ్ణి కాఫీ హోటలుకు తీసికొనివెళ్ళటం మానేశాను. అతనికి కోపం వచ్చింది. నాతో కలిసి తిరగటం మానేశాడు. ఎవరైనా స్నేహితులు ఏమోయి శాస్త్రి మునిమాణిక్యానికి నీకూ జోస్తీ తగ్గిందేమని మాటవరసకు అడిగితే, "అతని కథలు మెచ్చుకొన్నంతకాలము నెత్తినెట్టుకొని కాఫీ పోయించాడు, ఎన్నాళ్ళని పొగుడుతూఉండేది, ఏదో బాగా

స్నేహం అయిందిగదా అని ఒక రోజున పొరపాటున ఆతని కథలలో ఏదో ఒకటి బాగుండలేదని అన్నాను. అంతే! ఆ రోజునుంచీ మాకిద్దరికీ ఎడమొఖం, పెడమొఖం అయిపోయింది” అని ప్రచారం చేశాడు. ఇదంతా అబద్ధం, కాని నాకు మటుకు పైత్యం ఉన్నమాట నిజం. నా కథలను మెచ్చుకొన్నవాడు నాకు ఆప్తుడు, పైత్యం ఎవరికి లేదు!

ఇంతకూ చెప్పవచ్చిందేమిటంటే ఆ రోజున సత్యనారాయణగారు నా స్కెచ్ చూచి, అంటే, చదివి మెచ్చుకొంటారని అనుకొన్నాను. ఆయన ఒక్క నిముషం పైనుంచి క్రిందకి చూచి “ఏమిటిది!” అన్నారు. నాకేం చెప్పాలిసింది తెలియలేదు. ఏమని చెప్పేది? అదో కథా, కావ్యమా? ఏదో స్కెచ్. మా శివశంకరశాస్త్రిగారికి బాగుందని తోచింది, ఆయన ప్రచురించారు- ఆ రోజుల్లో సాహితీ సమితి సభ్యులలో చాలామందిమి చిన్నవాళ్ళం. ఎవరైనా శాస్త్ర పండితులు ఏమిటిది అని గట్టిగా అడిగితే శంకరశాస్త్రిగారి దగ్గరకు పరుగెత్తేవాళ్ళం. అందుకని ఏంచెప్పటానికి తోచక బిక్కమొహం వేసి నుంచున్నాను. నా బిక్కముఖాన్ని జూచి ఆయనకు జాలి కలిగింది కామాలు, నవ్వి కూర్చో అన్నారు. కూర్చున్నాను. వెంటనే ఆయన తన పద్యాలు చదివి ఎల్లా ఉన్నాయి ఈ పద్యాలు అన్నారు. మామూలుగా బాగున్నాయి అంటారు. నేను అల్లాగ అంటానికి ధైర్యం లేక అర్థం కాలేదు. నిజానికి ఒక్కముక్కయినా

అర్థంకాలేద. అయినట్లు నటించేశక్తి నాకు అప్పట్లోలేదు. ఇప్పుడో? అర్థం కాకపోయినాఅంటారు. ఇప్పుడు సంగతి వేరు. నేనే కాదు మీాకుమటుకు! అర్థం కానపుడు కాలేదని అనేస్తారా? అంత ధైర్యంగా! ఎప్పటికీ అనరు. ఎవ్వరమూ అల్లాగ అనము. భేష్‌గా ఉన్నాయి అంటూ తల పంకించి కళ్ళు తేలేసి నానా హంగామా చేస్తాము. పైగా కావాలంటే అటువంటి పుస్తకాలమీాద రివ్యూ కూడా చేసేస్తాము. కాని ఆ రోజులలో అంత ధైర్యం లేక నాకు అర్థం కాలేదంటి. అని వినయంగా అన్నాను. సత్యనారాయణగారు నవ్వారు. అదే మాస్నేహానికి ఆరంభం.

౨

అప్పటికీ ఇప్పటికీ ఆయన పద్యాలు నాకర్థంకావు. నా యందుండే వాత్సల్యంచేత అనేకసార్లు ఆయన తన పద్యాలు విడదీసి చదివి అర్థం చెప్పేవారు. అర్థం మటుకు మనస్సుకు నచ్చేది కాని అసలు పద్యం పద్యమే; చస్తే నాకది అర్థ మయ్యేదికాదు. భాషా పాండిత్యం లేకపోవటం సంస్కృత సాంప్రదాయాలు తెలియకపోవటం దీనికి కారణాలు. దాని తరువాత సత్యనారాయణగారు తన పద్యాలు నాకు చదివి వినిపించటం మానేశారు. అదీగాక ఆయన ఆంధ్రకవులలో హిమాలయపర్వతం అయిపోయినారు. ఆయన వ్రాసిన వాటిలో కిన్నెరసాని పాటలూ, "దయ—నిర్దయ" అనే

ఖండకావ్యం తప్ప మిగిలిన పద్యకవిత్వం నేను స్వతంత్రంగా చదివి అర్థం చేసుకోలేను. అయినా సత్యనారాయణగారి యందున్న గౌరవం నాకు మరి ఎవ్వరియందూ లేదు. పర్వతాలలో హిమాలయం!! కవులలో సత్యనారాయణ గారు!!! ఇది నా విశ్వాసం. ఇందులో దేని ఔన్నత్యాన్నీ నేను చూడలేదు.

ఆయన పద్యాలను నేను అర్థం చేసుకోనేశక్తిలేక మెచ్చుకోనలేకపోతున్నాను. ఆయనకూ నా కథలంటే ఏమాత్రం మెప్పు లేదు. ఒకమాటు నేను అడిగితే చింతా దీక్షితులు గారు ఒక్కరే కథలు వ్రాయగలవారు అని ఆయన అన్నారు.

నా కథలు ఆయన మెచ్చుకోకపోయినా ఆయనయందు నాకు భక్తి, గౌరవం ఎక్కువ. అదేదో గొప్పగా చెబుతున్నావు. నీ కథలను మెచ్చుకుంటేనే నీవు గౌరవిస్తావా? లేకపోతే గౌరవించవా? అని మీరంటే అనొచ్చు. నిజం అంతేగా మరీ...? ఎవరైనా మనరచనలను మెచ్చుకొంటే వాడు మనకు ఆప్తుడవుతాడు. మెచ్చుకోడో వాడితో మనము మాట్లాడము. గట్టిగా ఆలోచిస్తే...మీరూ... "అవును నిజం—అవును నీవన్నది నిజం" అని అనకమానరు. అందుకని నా కథలను మెచ్చుకోకపోయినా సత్యనారాయణ గారిని నేను ఎక్కువగా ప్రేమించటం విశేషంగా చెప్పుకొంటున్నాను. అయితే కారణం ఏమిటూ అంటే ఆయనలో ఉండే ఇతరములైన సుగుణాలు ఆయన్ను అంత స్నేహ

పాత్రునిగా చేస్తున్నాయి.

ఒకమాటు నేను అన్నాను "సత్యనారాయణగారూ, సాధారణంగా ప్రతికవీ, కథకుడూ, తన రచనలను మెచ్చుకొనేవాళ్ళ స్నేహాన్నే కోరుతాడు. అటువంటివాళ్ళతోనే సాంగత్యంచేస్తాడు. తన రచనలను గురించి గౌరవం మెప్పుదలా లేనివాళ్ళతో సాంగత్యం చేయడు, మీరూ అంతే, నేనూ అంతే, ఇంకొకరుఅంతే. కాని నేను మటుకు ఇద్దరు వ్యక్తుల విషయంలో ఈ ధర్మానికి విరుద్ధంగా ప్రవర్తిస్తున్నాను. వాళ్లు నారచనలను మెచ్చుకోరు. అయినా వాళ్ళను నేను ఎంతో ప్రేమిస్తాను" అన్నాను. "ఎవరువారు?" అన్నారు ఆయన. నా భార్య ఒక వ్యక్తి; రెండో వ్యక్తి మీరు అన్నాను. సత్యనారాయణగారు నవ్వారు.

3

ఆయన హృదయం మాత్రం నవనీతం. సరిగా జరిగిన విషయము ఒకటి చెబుతాను. పది సంవత్సరాల క్రితం నేను బందరు మొదటిసారి ఉద్యోగప్రయత్నానికై వచ్చాను. ముందు చింతాదీక్షితులు గారింట్లో బసచేశాను. అక్కడే భోజనం అయింది.

ఆ రోజులలో మా శివశంకరశాస్త్రిగారూ సత్యనారాయణగారూ అంత శాస్త్ర దూర దూరంగా ఉండేవారు. సత్య

నారాయణగారి నోట్లో శని ఉందనీ వాక్పారుష్యము ఎక్కు-
వని ఇల్లాగే కొన్ని మాటలు వారిని గురించి మా సాహితీ
సమితి సభ్యులలో ఎవరో అనగా విన్నాను. మొత్తంమీద
సత్యనారాయణగారంటే గౌరవం లేకపోగా ఆయనంటే ఒక
విధమైన భయం కలిగింది. కొద్దిగా ఏవగింపుకూడా ఏర్పడ్డది.
సాయంత్రం నాలుగు గంటలకు దీక్షితులుగారు "సత్యనారా
యణగారి ఇంటికి వెళదాము" అని నాతో అన్నారు. నేను
రానన్నాను. ఆయన నా మనస్సులో సంగతి గ్రహించి
"అల్లాకాదు. మీరు రావాలె, మనం అనుకున్నట్లు
ఆయన చెడ్డవాడు ఏమాత్రం కాడు. చాలా మంచివాడు
కూడాను, వెడదాం రండి" అని నన్ను బలవంతం చేశారు.
నాకు ఆ నోట్లో శనిఉన్న మనిషి దగ్గరకు వెళ్ళటం సుతరాం
ఇష్టం లేదు. కాని దీక్షితులుగారి మాట తీసివేయలేక
సరేనని ఆయనతో బయలుదేరినాను. నడిచినడిచి ఈడేపల్లి
వెళ్ళాము ఆయన ఇంటికి.

సత్యనారాయణగారు అప్పుడు హిందూ కాలేజీలో
లెక్చరరు- జయంతి అనే పత్రిక అతఃపూర్వం కొన్నాళ్లు
నడిపి, ధనం లేకనో ఏమో విరమించారు. అవీ ఆయన
పరిస్థితులు. నేను వెళ్లేసరికి ఇద్దరు ముగ్గురు స్నేహితులతో
ఆయన మాట్లాడుతున్నారు. నన్నుజూచి ఆయన మామూలు
కుశలప్రశ్నలు వేశారు.

దాని తరువాత ఎంతోసేపు కాకముందే మాటల సం-

దర్భంలో నేను ఆయనతో, "సాహితి మళ్లీ నేను నడుపు దామని అనుకుంటున్నానండీ" అన్నాను. ఆ మాట వినే సరికంతోనే ఆయన "నీవు ఏమన్నా-ఫూల్-వా" అని అడిగారు. "ఏం!" అన్నాను "ఫూల్ వు కాకపోతే పత్రిక పెట్టాలని ఎందుకు అనుకుంటావు?" అన్నారు. "నాకూ ఆయనకూ ఏమి పెద్ద స్నేహంలేదే, ఇంత పరుషవాక్యం అన్నాడే" అని కష్టం వేసింది. మాటకు మాట అనే స్వభావం కాదు నాది. మాట్లాడక ఊరుకొన్నాను. జయంతి నడపటంలో ఆయన పడ్డ కష్టాలు పురస్కరించుకొని ఆయన అంత మాట చనువుగా అనేశాడు. అదీ అసలు సంగతి. ఈయనకు వాక్ స్థానంలో శని ఉచ్చంగతుడై ఉన్నమాట నిజమేనని నిశ్చయించుకొన్నాను.

## ౪

అయిపోయింది, అప్పటికి బాగా సాయంత్రం అయింది. ఆయనా దీక్షితులుగారూ నేనూ బయలుదేరి చిలకలపూడి రోడ్డువాదికి షికారు వెళ్ళాము. దారిలో మరొకకవిగారు కలిశారు. ఆయన వైఖరీ ఏమీ పెద్దమనిషితరహాగా లేదు. గూడకట్టూ, మోచేతులదాకా చొక్కా, పైన ఉత్తరీయం లేదు. ఇదీ వేషం. అంతకుపూర్వం ఏదో మామూలుగా మాట్లాడుకొంటున్నారు. ఆయన వచ్చిన తరువాత సంభాషణ అంతా ఒక పెద్ద కొట్లాటలాగ నడిచింది. ఆ కవిగారి తరహా

అదీ. వాళ్ల సంభాషణ నాకు అర్థం కాలేదు. ఎందుకో స్తినా అనుకొంటున్నాను. ఇంతలో సత్యనారాయణగారు నన్ను కవిగారికి చూపి, "ఏ రెవరో తెలుసునా" అని అడిగారు. సత్యనారాయణగారూ ఆయనగారూ ఆప్తస్నేహితులు. అందు చేత నాకూ ఆయనకూ పరిచయం కలుగజేయాలని ఆయన ఉద్దేశం అయిఉంటుంది.

ఆకవి నన్ను ఎరగరు అందుకని ఏరెవరో నాకు తెలియదు అనాలిసింది సత్యనారాయణగారి ప్రశ్నకు జబాబుగా కాని అల్లాగ అనక "ఎవరో వెర్రివెధవ పోదూ" అన్నాడు నన్ను గురించి. అపరిచితుడు ఇల్లాగ అనటం నాకు కష్టం వేసింది. ఇటువంటి మర్యాద తెలియని జంతువుకు నన్ను ఎరుకపరచాలని ప్రయత్నం చేయటం సత్యనారాయణగారిదే తప్పు అని నేననుకొన్నాను.

అప్పటికైనా ఊరుకొంటే నేను బ్రతికిపోయేవాణ్ణి. సత్య నారాయణగారు ఊరుకోలేదు. నేను ఎవరినో తెలిసికొంటానికి ఏమాత్రం ఇష్టంలేని ఆ పెద్దమనిషికి నేను ఫలానా అని చెప్పారు. అల్లాగ చెప్పిన తరువాతనైనా ఆయనగారు సగౌరవంగా మాట్లాడవచ్చునా? లేదు. నా పేరు విని, అయితే నేం! అని పెంకెగా అమర్యాదగా మాట్లాడాడు. ఈ కొంటెప్రవర్తన గర్హిస్తూ అయినా సత్యనారాయణగారు ఆ పెద్దమనిషిని చీవాట్లు వేయలేదు. పైగా ఉభయులూ నవ్వుకొన్నారు.

నాకు చిన్నతనం అయింది. దీక్షితులుగారు కూడా అనకపోయినా, విచారపడ్డారు. ఇదంతా జరిగిన తరువాత సత్యనారాయణగారంటే మర్యాద తెలియనివాడని నేను నిశ్చయించుకొన్నాను. ఇక, వెళ్ళిపోదాము. వీళ్ళతో ఉండకూడదని అనుకొని దీక్షితులుగారితో "వెడతానండీ" అన్నాను.

ఈ మాట సత్యనారాయణగారు విని "ఏమిటీ వెడతావా? ఏంతొందర?" అన్నారు. చాలు అనుభవం అనీ అందామని అనుకొన్నానే గాని అనలేను. ఏమంది, అని మాత్రం అన్నాను. సత్యనారాయణగారు సరే వెళ్ళండి; మేము ఇప్పుడప్పుడే రాము, రాత్రి పొద్దు పోయిందాకా ఉంటాము అని విరుపుగా అనేశాడు. దానితో నాకు పూర్తిగా అసహ్యం వేసింది. గిరుక్కున వెనక్కి తిరిగాను.

X

నేను ఇటు తిరిగాను. నా బుజంమీద సత్యనారాయణ గారు చెయ్యివేసి ఆపి, అయితే చూడండీ మీరు ఈవూరు ఎందుకు వచ్చినట్లూ? ఏం పనిమీద వచ్చారూ? అన్నారు.

అప్పటికి ఆయనను జూస్తే నాకు అరికాలు మంట నెత్తి కెక్కుతున్నది. "ఏదో పనిమీద వచ్చాను లెండి; మీరు తెలుసుకోవలసిన అవసరంలేదు" అని అనాలని నోటిదాకా

వచ్చింది. అనే ఉన్నట్లయితే నా జీవితంలో పెద్దమార్పు వచ్చేది. ఏ స్థితిలో ఉండేవాడినో! క్లియోపాత్రా ముక్కు ఇంక కొంచెం పొడుగే అయితే ప్రపంచచరిత్ర ఇంకోవిధంగా ఉండేదిట! అల్లాగే ఆ రోజున నేను ఆ మాటే అని ఉంటే నా జీవితచరిత్ర మరోవిధంగా ఉండేదేమో!

అనలేదు. అల్లా అనక నాకు భీమవరంలో ఉద్యోగం పోయింది. ఈ వూళ్ళో హిందూకాలేజీలో ఖాళీ ఉందని తెలిసి ఉద్యోగం కోసం వచ్చానని చెప్పాను.

సత్యనారాయణగారు అన్నారూ: అల్లాగా! అయితే ప్రిన్సిపాలుగారూ హెడ్ మాస్టరుగారూ నాకు ఆప్తులైన స్నేహితులు. వారితో నేను ఈవిషయమై గట్టిగా చెప్పి నాశక్తి నంతా వినియోగిస్తాను అన్నారు. తరువాత ఉద్యోగం అయింది. సత్యనారాయణగారి సిఫారసు, నాకు ఉద్యోగం రావటానికి చాలావరకు పనిచేసిందని నమ్మకం.

అయితే :—

అట్లా కట్టువిరుపుగా మాట్లాడాను. ఆ కుర్రకవి నానా మాటలు అంటూ ఉంటే ఊరుకొన్నాడు ఈయన వట్టి కఠినహృదయుడు అని అనుకొన్నానే గాని మళ్ళీ ఈయనే ఇంతమంచిగా మాట్లాడి ఇంత సాహాయ్యం చేయటానికి పూనుకొన్నాడే అని ఆశ్చర్యం వేసింది. ఆయన హృదయం ఎంత నవనీత సదృశమో నాకు ఆ క్షణంలో తెలిసింది. ఆ రోజునుంచీ ఆయన నాకు ఆప్తస్నేహితుడు అయినాడు.

నాకష్టసుఖాలలో ఆయన సానుభూతికి చోటు ఉంది. ఆయన జీవితపథాన్ని ప్రేమలో గమనిస్తూ ఉన్న వ్యక్తులలో నేనూ ఒకణ్ణి—

ఆయన మంచితనమే నా ప్రేమకు కారణం. ఆయనకు నాయందుగల అభిమానానికి కారణం ఏమిటో మరి తెలియదు.

ఆయన పద్యాలు ఇప్పటికీ నాకర్థం కావు. ఎప్పటికైనా అర్థం అవుతాయన్న ఆశా లేదు. నా కథలు బాగున్నాయని ఆయన ఇంతవరకు ఎప్పుడూ అననూలేదు, ఇకముందు అంటాడన్న ఆశాలేదు.

అయినా మేమిద్దరం ఆప్తస్నేహితులము.

కానీ... .....

ఈ జీవితకథకూ ఆయన Literary Career కూ ఏమి సంబంధమూ అని ఒక ప్రశ్న రాతగినదే కాని నాకు ఒక్క విషయం మాత్రం తోచింది.

ఆయన జీవితంలో వాక్పారుష్యం ఉన్నా, హృదయం ఎల్లాగ దయారసపూరితమో, అల్లాగే ఆయన పద్యాలు కఠినపదభూయిష్ఠమైనా పద్యహృదయం మటుకు రస పూరితము.

నిండుమనంబునవ్య నవనీతసమానము
పల్కుదారుణాఖండల శస్త్రతుల్యము !—

# 8

స్కూలువాళ్ళు నన్ను ఒకసారి స్కౌటు ట్రెయినింగుకు పంపారు. రైలు కర్చులు మాత్రం స్కూల్వాళ్ళు ఇచ్చారు కాని పై కర్చు బోలెడంత అయింది. రెండు పొట్టి లాగులూ, రెండు కాకీ చొక్కాలూ, రెండు ఆకుపచ్చని తల గుడ్డలూ కొంటానికి పదిరూపాయలు కర్చు అయినై.

శుక్రవారం మధ్యాహ్నమే ప్రయాణమైనాను. అసలు శని వారం ప్రొద్దున బయలుదేరినా వెళ్ళవచ్చు గాని ఒకరోజు ముందుగా వెళ్ళటం దేనికైనా మంచిదని నేను ముందుగా బయలు దేరేను.

ఆ స్కౌట్ డ్రెస్సూ, రాత్రిళ్ళు ప్రయాణసమయంలో కట్టుకుంటానికి మూడునాలుగుధోవతులూ, రెండు తువాళ్ళూ, సబ్బుబిళ్ళా, అద్దం, దువ్వెన కొన్ని సిగరెట్లు తీసుకొన్నాను.

నూజవీడులో కారు దిగేసరికి నన్ను నేను ఆనవాలుపట్టలేని స్థితిలో ఉన్నాను. తల—అసలే బిరుసుజుట్టు—రేగి కొబ్బరి పీచు లాగున్నది. ముఖం, వళ్ళూ అంతా మట్టి కొట్టుకోడం మూలాన ఎట్లా ఉండాలో అట్లా ఉంటున్నవి. పాదరక్షలు మరిచి పోయి వచ్చాను ఇల్లాగ దిగి మూట చంకన పెట్టుకొనిఊళ్ళోకి బయలుదేరాను — కాఫీ హోటలు ఎక్కడా అంటూ.

పొద్దు తిరిగింది. నూజవీటికి ఊరి వెలపలను సుమారు రెండు

మైళ్ళ దూరంలో ఉన్న ఒక ఉద్యానవనం వైపు ఒక పాంథుడు మూట చంకన పెట్టుకొని నడుస్తున్నాడు నేనే......

సాయంత్రం కావడంమూలాన పశువులు ఊళ్ళోకి వస్తున్నయి ధూళి రేపుకుంటూ. నేను ఊళ్ళోనుంచి తోటవైపు నడుస్తున్నాను ధూళిని తోసుకొంటూను.

ఆ తోట జమీందారుగారిది. దానిచుట్టూ ముండ్లపొదలు ఉన్నాయి ప్రహరీ గోడలాగ. లోపల పూల మొక్కలూ, పోకలూ, మామిళ్ళూ అన్నీ ఉన్నాయి. మధ్యనొక బంగాళా ఉంది.

యకాయకీని, ఆ బంగాళాలోకిపోయి మూట ఓ కుర్చీమీద పెట్టి, నేనో కుర్చీమీద కూర్చుని గోడలపైన ఉన్న బొమ్మలూ అవీ చూస్తున్నాను. ఒక క్షణము గడిచిందో లేదో, ఇంతలోకే ఎవరో ఒకాయన లోపలినుంచి వచ్చాడు. పెద్ద కోటు వేసుకొన్నాడు పచ్చని పసిమి. మొదటిసారి చూచినప్పుడే ఆయన చాలా గొప్పవాడనిపిస్తుంది. ఇక ఆయనరూపం, రీవి, నడక అన్నీ చూస్తే కుంగి పోవాల్సిందే ఆయన ముందు నిలవటానికే వీల్లేక, లేచి నుంచుని నమస్కరించాను. హిమాలయ పర్వత శిఖరాన్నుంచి క్రిందికి చూస్తున్నాడా న్నట్లుంది ఆయన చూస్తుంటే. కాంచనగంగ పైన చంద్రోదయమైనట్లుంది ఆయన చిరునవ్వు నవ్వితే—ఎవరు మీరు? అని అంత పొడుగుమనిషీ నన్ను అడిగేసరికి నేను కుంగిపోయి ఫలానా అని చెప్పాను. ఆయన నౌకరును పిలిచి నాకు బసచూపమని ఆజ్ఞ ఇచ్చాడు.

నౌకరు నన్ను వెంటబెట్టుకెళ్ళి ఒక కుటీరం చూపాడు.

స్కౌటు కాంపు అల్లాగే జరుగుతుంది. ఆ నాలుగురోజులూ మన సౌఖ్యాలు, గౌరవాలు వర్ణాలు అన్నీ మరచిపోవాలె. కుటీరవాసం, కఠిన భూశయనం, నియమిత ఆహారం, సిగరెట్ విసర్జన-ఇవి ఆసమయంలో ఆచరించవలసిన కొన్ని నియమాలు. ఇట్లాంటివే ఇంకా ఉన్నాయి ఎవరి గది వారు చీపురు పట్టుకొని ఊడ్చుకోవాలె పాఖ్యారా జేసుకొని, అన్నం వండుకొని తినాలె. ఇవన్నీ మర్నాటినుంచీ జరగాలిసిన పనులు ఆ రాత్రికి మట్టుకు చెయ్యి కాల్చుకోవలసిన అవసరంలేదు. మా ఆవిడ మూటలో కట్టి ఇచ్చిన గోధుమరొట్టెలు ఉన్నవి ఇవన్నీ నేను ఆలోచించుకొంటూనే ఉన్నాను. ఆ నౌకరు నన్ను అక్కడ దిగబెట్టి వెళ్ళిపోయినాడు.

అప్పటికి నేను ఒక్కడ్నే అయిపోయినాను. ఆ అరణ్యంలో ఆ గుడిసెలో నేను ఒకడ్ని కటిక నేలపైన పడుకోవాలె అను కొనేసరికి భయంవేసింది. ఆ భయంలో నేనసలు నిరుత్సాహ పడి వెంటనే మూట చంకనబెట్టుకొని ఇంటికి బయలుదేరాలి సిందే. కాని ఒకటి తోచింది. ఆ బంగాళాలో ఎవ్వరూ లేరు. జమీందారుగారు లోపల ఎక్కడో ఉంటారు. అందరూ నిద్దర పోయినతరువాత మెల్లగా వరండాలోకి చేరవచ్చును అని ధైర్యంచెప్పుకొన్న తరువాత మూట కుటీరంలో పెట్టి, బైట కొచ్చి ఒక చిన్న ఇసికదిబ్బ పైన ఉత్తరీయం పరచి దానిపైన కూర్చున్నాను. పశ్చిమాన ఎర్రని గుడ్డ పేలికల్లా మేఘాలు

ఎగురుతున్నాయి. సూర్యుడు అస్తమిస్తున్నాడు. అవన్నీ చూస్తూ నేనక్కడే కూర్చున్నాను.

*

ఇంతలో మరో ఆయన నామోస్తరే ముందుగా వచ్చాడు కాబోలు, ఒక సంచి చేత్తో పట్టుకొని, ఊపుకుంటూ నేనున్న దిక్కుకే వస్తున్నాడు. ఎవరా అని నేను తేరి పారజూశాను నాకంటె కాస్త పెద్దవాడులాగ కనిపించాడు. మీసం నెరిసింది. నుదుటిపైన నున్నగా ఉంది. బట్టతల ఎక్కువ ధీమంతులకే ఉంటుందని నా అభిప్రాయం. నాకు బట్టతల అయితే బాగుండు నని నేను ఎన్నోసార్లు అనుకున్నాను కూడానూ! బట్టతలలో ఒక కొత్త అందం ఉన్నమాట మటుకు నిజం. ఆయన ఖద్దరు బట్టలుకూడా వేసుకొన్నాడు. ఖద్దరు బట్టలు వేసుకొన్నవాళ్ళను చూస్తే నాకు గౌరవపాత్రుడులాగ అగుపించాడు. కాని ఆయన నడకమట్టుకు బడిపంతులు నడకే! సరే మనవాడే, నామోస్తరే వచ్చాడని నిశ్చయించుకొన్నాను.

ఇల్లా ఆలోచిస్తూ ఉండంగానే ఆయన పెద్దపెద్ద అంగలేసూ సమీపించి "ఇదేనా అబ్బాయీ నల్లపక్షుల ఆశ్రమం" అన్నాడు. స్కౌట్ కాంపులో నలుగు రైదుగురు కలిసి ఒకకుటీరంలో ఉంటారు, ఒక్కొక్క సమూహానికి ఒక పేరు. మా ఆశ్రమవాసులకు నల్లపక్షుల ఆశ్రమం అని పేరు. ఆయన అడిగిన ప్రశ్నకు జవాబు ఏమీ చెప్పక నేను ఊరుకొన్నాను. ఆయన మళ్ళీ నాకు కొంచెం

దగ్గరగా వచ్చి నిలబడి నువ్వొ నల్లపక్షి వేనా? అన్నాడు

నన్ను చూసే చూడటంతోనే ఇల్లా అనటమూ, అపరి చయుడు నన్ను ఏకవచనంలో సంబోధించడమూ, నాకు కష్ట కలిగించక పోలేదు. కాని ఆయన నాకంటే పొడగ్గా ఉండట మూ, వయస్సులో పెద్ద వాడు కావటమూ ఒట్టిశల కలిగి ఉండటమూ, ఇవన్నీ నన్ను ఆయన ముందు కుంగతీసినై. నాలో ఉండే అహం చచ్చి ఊరుకొంది. పెద్దవాడూ, నువ్వొ అని అంటే వాగానేలే అని నాలో నేను అనుకొని ఉంటాను. ఏమనుకొంటే నేమి ఇంతకూ జరిగిందేమిటీ అంటే, నేనేమీ మాట్లాడక ఆయన వంక పిచ్చిగా చూస్తూఉండి పోయినాను.

ఆయనా వచ్చి నాపక్కకే నుంచున్నాడు. సామాన్య పరి స్థితులలో అయితే, మేమిద్దరూ మాట్లాడు కోవాలిసింది. ఒకరి కొకరు తోడైనా మని సంతోషించాలిసింది. ఆయన అల్లాగ కోతిగా మాట్లాడడని నాకు కష్టంగా ఉంది. కాబట్టి నేను మూతి ముడుచుకు కూర్చున్నాను. ఆయనతో మాట్లాడడానికి నాకు ఏమాత్రం బుద్ధి పుట్టలేదు.

ఇంత విముఖత కనపరచినా ఆయనకేం చిన్న తనం కాలేదు. కొంచెం సేపు ఆయన అల్లాగే నిలబడి నా దగ్గరనుంచి ఏమీ జబాబు రాకపోవటంవల్లా, వస్తుందనేఆశకూడాఎక్కడా కనుపించకపోవటం మూలానా, మెల్లగా కుటీరంవైపు నడుస్తూ "నీవు ఒక్క పక్షివే కనబడుతున్నావు. అన్ని పక్షులూ రాలేదు కాబోలు. రేపు వచ్చి వాల్తయ్యి అన్ని పక్షులూనూ"

అనుకుంటూ వెళ్ళిపోయినాడు.

చూస్తే, ఇతడేదో విచిత్రమైన మనిషిలాగే కనిపించాడు. మాటలలో చొరవ అమిత దార్ఢ్యంగా ఉంది. ఆయన ఎవరో నేను ఎరగను. నేను ఫలానా అని ఆయన తెలిసి ఉన్నవాడులాగా కనపడలేదు. ముక్కు మొఖం తెలియని నాకు, నాతో ఇల్లాగ మాట్లాడటం చాలా విచిత్రంగా ఉంది. నా జన్మలో ఎప్పుడూ ఇల్లాంటిదీ సంభవించలేదు.

ఇతడు నాకు, ఎక్కడైనా సహాధ్యాయుడా అన్న సందేహం చటుక్కున తట్టింది. నేను తననుగుర్తించలేదన్న విషయంగ్రహించి నన్ను ఏడిపించటానికి ఇల్లాగ ఏమన్నా చేస్తున్నాడా అని కొంచెం సేపు ఆలోచించాను. ఆయనను చూచినట్లునాకుచూచాయగానన్నా జ్ఞాపకం రాకపోయినా ఆయనతప్పకుండా నాకు క్లాసుమేటు అయి ఉంటాడు లేకపోతే మరెవ్వరికి అల్లా మాట్లాడటానికి గుండెలుంటయి అనే నిశ్చయానికేవచ్చాను.

అదే నిజం అయినా, ఆ ప్రవర్తన నాకేం బాగుండలేదు. చిన్నవాడా! చితకవాడా! నలభైఏండ్లు దాటినపెద్దమనిషి, దాదాపుతన ఈడుమరోపెద్దమనిషితోమర్యాదలేకుండామాట్లాడటం అసహ్యం అనిపించింది నాకు. కానిమనిషిని చూస్తే, మరిఏమిటో చెప్పలేను అసహ్యం కలగటంలేదు. పైగా గౌరవభావం కలుగుతున్నది. మాటలువింటే మంటగా ఉంది! ఆయన మాటల్లో చురుకూ, చూపుల్లోకరుకూ ఉన్నవి. మరి ఎందులోనో మాధుర్యమూ కూడాఉంది.

ఆయన కొంటెతనానికీ మాట్లాడుతున్నాడో ఆయన స్వభావమే అంతో నేను ఊహించలేకపోయినాను. ఇంతకూ ఆయన నాకంటె పెద్దవాడు. బట్టతలకూడా ఉంది. ఆయన ఎంత వేళాకోళంగా మాట్లాడినా, అది నాకు ఎంత వెగటుగా ఉన్నా, నేను ఆయనను ఏమీ అనలేకపోయినాను.

ఆయన వచ్చి నాపక్కన కూర్చుని 'ఏవూరుఅబ్బాయి మీది' అన్నాడు. బందరు అన్నాను. అని నేనిల్లా ఆలోచించాను. నేనిల్లాగ సజావుగా సమాధానాలు ఇస్తూ ఉంటినా ఈయన నన్ను ప్రశ్నలతో పీకి చంపటమే కాకుండా వెటకారంగా మాట్లాడి నన్ను ఏడ్పిస్తాడు. ఈయన స్వభావమే ఇలాంటిదిగ కనిపిస్తున్నది. మళ్ళీమాట్లాడకుండా ఒక్క ఘూడింపు అనుకొన్నాను. కాని మళ్ళీ మనకెందుకు పోట్లాట ఈనట్టడివిలోన అని అనుకొని ఊరుకొన్నాను. నిజం సంగతి ఆయనతో ఏమీ మాటాడ దల్చుకోలేదు. అందుకని ఆయనవైపు తిరగక ఎదురుగా ఉన్న అస్తమయసూర్యుని వంకకు తిరిగాను.

ఈయన నా "క్లాసుమేటు" అవునా కాదా అన్నవిషయం నన్ను మళ్ళీ బాధించింది ఒక్కసారిఅడిగి తెలుసుకొంటే పోతుందని గబుక్కున ఆయనవంక తిరిగి ఏమండీ, మీరూనేనూ, ఎక్కడైనా చదువుకున్నామా? అన్నాను.

ఆయన నావంక విచిత్రంగా అడవిమృగాన్ని చూచినట్లు చూస్తూ, తలఊపి, ఊహు నాకాగతిపట్టలేదు అన్నాడు. బాకు

పుచ్చుకొని పొడిచి నట్లుఅయింది.-చీ, ఇతనితో ఇక విస్తారం మాట్లాడకూడదనుకొని మళ్ళీ అటుతిరిగాను.

*

అటువైపున మేఘాలూ, ఎర్రసముద్రంలోనితరంగాలలెకదలు తున్నాయి. ఆ తరంగాలకుఅవతల ఇంకో ప్రపంచం ఉన్నట్లుంది. అచ్చటస్వర్గవీధులు కనిపించినై. మధ్య నున్న నల్లనిమేఘపు తునకలు దేవతల ఛాయల్లాగఉన్నాయి. అమిత వైభవంగల ఆ దృశ్యాన్ని నావలెనేచూచి,ఆనందించి తలలూపు తున్నాయి పోక మొక్కలు. పోక మొక్కల తలలూపులనుజూచినవ్వుతున్నాయి మామిళ్ళు. నేను ఇదంతా చూస్తూ,అయనన్నా ఆయన మాటల వల్ల కలిగిన మనఃక్లేశాన్ని మరిచిపోయినాను.

ఇల్లా ఎంతసేపు చూస్తూ ఉండిపోయినానోనాకు తెలియదు. అంతసేపు ఆయన నాప్రక్కనేకూర్చుని నాసంగతి విచిత్రంగా కని పెడుతున్నాడు. ఇది నేను గ్రహించాను. గ్రహించికూడా ఊరుకొన్నానేగాని ఆయన్ను మాట్లాడించ దల్చుకోలేదు. మొదట్లో అంత వెగటుగా మాట్లాడిన వ్యక్తితో నేను మర్యాదగా ప్రవర్తించవలసిన అగత్యం ఏమాత్రం లేదనీ, ఊరుకోవటమే చాలాఉచితమూ అనీకూడా నిశ్చయించుకొన్నాను. నేను ఊరుకున్నా ఆయన నన్ను ఊరుకోనియ్యలేదు ; చివరకు ఆయనే మళ్ళీ మాట్లాడించాడు. మాట్లాడించినా మాటాడక పోవటం మరీ మోటుగాఉంటుంది. అందుకని అడిగిన మాటకు

సమాధానంచెప్పదల్చుకోని ఏమిఅన్నట్లుగా ఆయన ముఖంకేసి చూశాను.

"ఏమిటా చూట్టం! ఒకటే చూడటం! ఏంజూస్తున్నావు?" అన్నాడు. ఏదో ఒకటి చూస్తున్నానులే, నీకెందుకూ? అనొచ్చు. అల్లాగ అనటానికి కొంచెం మొండితనం కావాలె. నాస్వభావం లో అదిలేదు. అందుకని మామూలుగానేజవాబు చెప్పాను. సూర్యాస్తమయ శోభచూస్తున్నానుఅని.

ఈమాటవిన్నాడు ఆయన; కళ్ళు పత్తికాయలంత అయ్యినె. నోరు తెరుచుకొంది. ఒక్కనిమిషం మనిషి నిశ్చేష్టుడై పోయినాడు. తన జన్మలోఎప్పుడూ అంతమాటవిననట్టు ఆశ్చర్యపోయినాడు. ఓ అరనిమిషం అట్లాగే ఉండి చివరకు తెప్పరిల్లి ఏమిటో అస్తమయశోభచూస్తూన్నావూ!అన్నాడు. ఆప్రశ్నకు ఏమీ జవాబు చెప్పవలసిన అవసరం లేదనుకొని ఆయన పిచ్చి చూపులను లెక్కచేయకుండా, మళ్ళీ ఆసూర్యబింబానికే కళ్లు అప్పగించాను. నా బాధను ఆ సూర్యునికి,ఎరుకచేశాను.

సంజకాంతులు కరిగిపోతున్నాయి. గాలి చల్లగాహాయిగా ఉంది. ప్రకృతిలోనే కా న్యానికి ఎక్కడా చోటులేకుండా పోతున్నది. నాహృదయంలో కోపానికిగాని, ద్వేషానికిగ్గాని, చోటు ఉండటం అసంభవంఅయింది. ఆయనవైపుకు తిరిగాను.

ఆయన హృదయంకూడా కరిగి నీరైనట్లు నాకు తోచింది. ఆయన నావంక జాలిగా చూస్తున్నాడు. ఏందుకో ఆజాలి ఆయనకు నాపైన! నాగుడ్డలను జూసో, నాఆకారాన్ని జూసో

చూసి చూసి చివరకు నా భుజంపైన చేయివేసి, పితృవాత్సల్యంతో "ఏమిటోయ్ అల్లా చూస్తున్నావు?" అని మళ్ళీ అడిగాడు. "చెప్పానుగాను సూర్యాస్తమయం చూస్తున్నానని" అని నేను విరుసుగానే మాట్లాడాను.

ఆ మనిషి ప్రకృతి ఏమిటోగాని నేను విరుసుగా మాట్లాడినా, విదిలించుకొన్నా, ఏమీ కదలడు. గోరణి మార్చడు. సూర్యాస్తమయం చూస్తున్నానని కామా నేనన్నాను. ఆ మాట విని ఆ మనిషి, నీ ముఖం, రోజూ అయ్యే అస్తమయాన్ని ఏం జూస్తున్నావు, అని నన్నేదో పిచ్చివాడి క్రింద లెక్కగట్టినట్లు తేల్చాడు. ఈ మాటకూ నేనేమీ జవాబు చెప్పలేదు—ఆ మనిషి మళ్ళీ, ఆలోచించుకొని, కాకపోతే నీవు కవివై ఉండాలి అన్నాడు.

ఈ తడవ నేను ఇంకోలా జవాబు చెప్పలేక విసిగి వదిలించుకొందామని, "కవినీ గాదు, గడ్డలూ కాదు, ఏదో చూస్తున్నాను ఊరుకోండూ" అన్నాను కొంచెం విసుగ్గానే. నేను విసుక్కోటం ఆయనమీద ఏ మాత్రం పని చేయలేదు. పైగా నవ్వుతూ అన్నాడాయన. "ఏదో కొద్దిగానయినా?" అని. అదేదో తాగుడులాంటి అలవాటైనట్లు!!—నేను సహనము వహించి ఊరుకొన్నాను. పత్రికలకు కథాగట్రా అట్లాంటివి ఏమైనా వ్రాస్తుంటావా? అని మళ్ళీ అడిగాడు ఏదో దయతో, వాత్సల్యంతో అడిగినట్లు తోచింది. అబద్ధం చెప్పలేక పోయినాను.

ఎప్పుడైనా కథలు వ్రాస్తుంటావా అన్నాను. "ఆఁ ఇంకే, ఏదో వుంది చెప్పవేం మరి? నే న్పాడే అనుకున్నా ఆ పిచ్చి చూపులు చూచి" అన్నాడాయన. ఈమాటలు అనటంలో ఆయన చూపిన ఉత్సాహానికి మితిలేదు. తనేదో కొలంబస్ వలె మహాగొప్ప విషయాన్ని కనిపెట్టినట్టు!! ఉత్సాహపు పొంగు కొంత తగ్గిన తరువాత ఆయన మళ్ళీ నాబుజంమీదతట్టి—అయితే—పాపం ఎన్నాళ్లనుంచీ......నీకీ పిచ్చి? అని జాలిగా చూస్తూప్రశ్నించాడు. నాకు కొద్దిగా నవ్వుకూడా వచ్చింది. చాలా రోజులనుంచి ఉంది అన్నాను. ఈమాట విన్న మీదట ఆయనకు నామీద మరీ విపరీతమైన జాలి పుట్టిందేమో ఏమీ మాట్లాడకుండా అల్లాగే పావుగంటసేపు కూర్చుని చివరకు నాతలపైన చేయివేసి నిమిరి "అయితే నీ పేరేమిటి నాయనా?" అని అడిగాడు.

చెప్పకుండా ఎందుకుండాలె? చెప్పాను ఫలానా అని. ఆ-పేరు వినే వినటంతోటే ఆయన, హడలిపోయి భయంకరమైన పిడుగుపడ్డట్లు విరుచుకు పడ్డాడు. తలవునా మోడైపోయి గుటక మింగలేక, గుడ్లు తేలేసి నానా హంగామాచేసి తెప్పరిల్లినట్లు తెప్పరిల్లి, తాను విన్న ఈ దుఃఖవార్త నిజమా అబద్ధమా అని సందేహించే వాడిలాగ, చూస్తూ అయితే ఆ కథలు వ్రాసేవాడివి????? అని మాట పూర్తిచేయలేక గుడ్లు మిటకరించి చూడటం సాగించాడు. నేనే-అన్నాను

తలవంచుకొని

ఆపళంగా ఆయన నాభుజంమీద విసురుగా చరిచాడు మీద తొలిగేటట్టు—చరిచి. ఓరి సన్యాసీ, నువ్వేరా, నువ్వా... మునిమాణిక్యానివి! అన్నాడు. పాపం గుండె పట్టుకుపోయింది కాబోలు మాట్లాడలేక గుడ్లు అప్పగించి చూస్తున్నాడు.

ఒక్క నిమిషం అయింది. ఆయనకు కలిగిన ఆశ్చర్యం వక్క మాటు రాలేదు. పాల పొంగులాగ మళ్ళీ మళ్ళీ రావటం మూలాన, ఆ నిమిషమూ గడవటంతోనే అందుకొని, అయితే నువ్వా?—మునిమాణిక్యం అంటే ఎంత గొప్పవాడో, ఎట్లా ఉంటాడో, ఎంత స్ఫురద్రూపో ఎంత అందమైనవాడో అనుకొన్నాను. నువ్వేరా!! నువ్వేరా మునిమాణిక్యానివి!!! అన్నాడు ఆయన ఉక్కిరిబిక్కిరి అవుతూ. ఆయన చూపుల్లో ఇంకా చచ్చేటంతటి సందేహం కనబడుతున్నది. ఏమాత్రం నమ్మినట్టు లేదు.—ఆశ్చర్యం, అపనమ్మకం ఆయన ముఖంమీద తాండవిస్తున్నయి.

ఇతరులు తనను గురించి గొప్పవాడనుకొంటే ఎవ్వరికైనా సంతోషమే. ఆయన మాటలు నన్నొకవిధంగా సంతోషపెట్టినై. నవ్వొస్తున్నది. ఆయనమీద ఉన్న కోపంఅంతా మాయమయింది. ఇంతకూ ఆయనకు సందేహం తీరలేదు. ఆ సంగతి గ్రహించి, నేనేనండి మునిమాణిక్యాన్ని అన్నాను.

అప్పటికి ఆయన సందేహం తీరినట్లు కనబడ్డది. కొంచెం తే

రుకొని చిరునవ్వు నవ్వి "ఏంత హుషారుగా ఉంది వ్యవహారం. నీ కథలన్నీ నేను చదివాను!!"—అన్నాడు. అంతకంటే విచిత్రం ఏదీ లేనట్లు నా కథలన్నీ చదవటం నా పూర్వజన్మ సుకృతం అని అంటే బాగుంటుందో, లేకనా అదృష్టం అంటే బాగుంటుందో, అసలు ఏమంటే మర్యాదగా సరసంగా, వినయపూర్వకంగా ఉంటుందో నాకు తోచక, ఊరికే చూపులోనే నా కృతజ్ఞతా భావాన్ని ఆయనకు తెలియజేసాను. ఆయన మళ్ళీ ఇంకో నవ్వు తెర వచ్చింది. మళ్ళీ నవ్వాడు మళ్ళీ "నువ్వు రా?" అన్నాడు. మళ్ళీ తిట్టాడు. మళ్ళీ భుజం పైన గట్టిగా కొట్టాడు.

అప్పటికే నా భుజం నాలుగైదు గట్టిదెబ్బలు తినటం మూలాన బాగా నొప్పెట్టింది. ఇంకో దెబ్బను తట్టుకోలేను. ఆయనకు మళ్ళీ ఇంకో పొంగువచ్చి నన్ను చరిచాడా నా గూడ విరగటమో, తొలగటమో తప్పదని తోచింది. కాని వద్దని ఎట్లా చెప్పేది. అందులో నన్ను మెచ్చుకుంటూ చేసే పనిని నేను, నా నోటితో ఎట్లా వద్దనగలను. అనలేకపోయినాను. అనలేకపోవటమే కాకుండా ఏమైనా కాని ఇంకా ఒకటిరెండు దెబ్బలు ఓర్చుకొందామనికూడా నిశ్చయించుకొన్నాను. కాని ఒక్క తెలివైన పనిచేసినందుకు నేను ఇప్పటికీ సంతోషిస్తున్నాను. ఏమిటంటే అది వాడి ఎడమచేతి వైపునకూర్చున్న వాడినల్లా లేచి, ఏదో పని ఉన్నవాడిలా అలా వెళ్ళి మళ్ళీ వచ్చి ఆయన కుడిచేతిక్రింద కూర్చున్నాను.

నేను అల్లాగ కూర్చున్న తరువాత రెండుమూడు నిమిషాలకు ఆయనకు మళ్ళీ వచ్చింది ఆవులింత. అదే ఆఖరుసారి కూడాను. ఈతిభా నా వీపుమీద ఊరికే చెయ్యి వేశాడు ఆదరంగా. అంతే—కొట్టలేదు. ఒక్క క్షణమైన సట్టుమాన్ప విడిచి ఇట్లా ఉంటావని నేను కలలోనైన అనుకోలేదు సుమా! అరె! నీ వా మునిమాణిక్యాపు! అని ఊరికే నావంక సచిత్తాన్నహాపడి చూడ్డం సాగించాడు.

పాపం మానవుడికి, హిమాలయ పర్వతమని చూడబోతే ఓ రాళ్ళగుట్ట కనపడ్డది ఆయన కాశీ విశ్వేశ్వరాలయమనుకొన్నది పోలేరమ్మ గుడి కంటేకూడా చిన్నదయింది.

ఇవి అతని భావాలు. కాసేపు ఆయన మాట్లాడలేదు అది నా అదృష్టం. ఆయన ఒకరకం ఆలోచనలో పడితే, నేను మరోరకం ఆలోచనలో పడ్డాను. నేనెట్లా ఉన్నానా వీడింత ఆశ్చర్యపోవటానికి అని నాకు పెద్ద సందేహం కలిగింది. స్ఫురద్రూపిని కాక పోవచ్చు. కాబూలువాళ్ళ లాగ పొడగరిని కాక పోవచ్చు. దొరలాగ తెల్లగా లేకపోవచ్చు. బట్టలు మాసి ఉండవచ్చు. కాని ఆయన అంత వెర్రిగా చూసి ఆశ్చర్యపోవటానికి నాలో ఏముందా అనే జిజ్ఞాస బయలుదేరింది. వేషం అందంగా లేకపోతే నేమి నా చూపుల్లో, మాటల్లో, నడకలో పెద్ద మనిషి తనం, ఆయనకు కనపడకపోటమే మా— అన్న తర్కంలో పడ్డాను కాసేపు.

ఆయన నిరుత్సాహానికి కారణం సరిగ్గా నాకు ఇంతవరకూ తెలియలేదు. అందుకని ఏమిటండీ, ఇంతకూ మీరు నిరుత్సాహ పడటానికి కారణం? అని అడిగాను.

ఈ మాటతో మళ్ళీ ఆయనకు భావోద్రేకం కలిగింది. చూపుల్లో గొంతులో ఆ ఉద్రిక్తమైన భావచ్ఛాయలు కనిపించినై... ఆయన ఇట్లా అన్నాడు. "కారణం అడుగుతున్నావా? ఆరి నీ తెలివి తెల్లవారా! నీకింకా తెలియనే లేదూ! నేనూ... నువేమో గొప్పవాడివి అనుకున్నా రా" అన్నాడు.

ఎన్నిసార్లు అన్నా ఆయనక్కే అంటూడాయె! నాకు వళ్ళు మండిపోయి, అప్పుడు నేను గొప్పవాడ్నే అన్నాను నిదలింపుగా. ఆయన నవ్వుతూ అన్నాడూ, నువ్వు గొప్పవాడివేరా! అదికాదు నేననటం——కాని ఇట్లా ఉన్నావేరా అని నే నేడుస్తున్నాను. అని నెత్తిపైన పెళ్ళంతో కొట్టుకున్నాడు. ఏం, ఎట్లాఉన్నా నేమిటి!__అని అమాయకంగా అడిగాను చివరకు. ఆయన పాపం చాలా విచారపడుతూ అన్నాడు. "ఓరి పిచ్చి నాయనా! నీవు ఎట్లాగో ఉంటా వనుకున్నా రా ఇట్లా ఉన్నావేంరా? వట్టివెర్రి వెంగళప్పలాగ ఉన్నావురా!!!" అని సంగతి కాస్తా స్పష్టంగా చెప్పేశాడు.

నాకు కష్టం వేసింది. మనస్సు చివుక్కుమన్నది. ఉడుకు మోతు తనం వచ్చింది. అయితే నేం, ఆయనను ఏమీ

అనలేక పోయినాను. నాకువెగురుగా ఉన్న ఎర్రనిసూర్యబింబాన్ని చూస్తూ ఉండిపోయినాను. ఆ తరువాత కాసేపటికి చీకట్లు కమ్ముకనవి.

౪

ఆ మర్నాడు అంతా వచ్చారు. ఆటలుపాటలూ, అన్నీ ప్రారంభమైనాయి. ఆయన పేరు శివం. శివం నేనూ ఒక కుటీరంలోనే ఉన్నాము. ఆ తరువాత కూడా ఆతని ప్రవర్తన ఏమీ మారలేదు. ఆయన ప్రతివాడ్ని వెక్కిరించటమే. ప్రతి వాడితోనూ వేళాకోళమే. అందర్నీ ఆయన ఏంరా అని పిలిచే వాడు. అందరూ ఆయన్ను ఏంరా అనేవారు. నేను అల్లాగే శివాన్ని ఏంరా అని పిలవటం సాగించాను.

శివం అందర్నీ బహు నవ్వించేవాడు. ఒక రోజున స్కౌట్ కమిషనర్ మమ్మల నందరినీ పిలిచి, దగ్గరలో ఉన్న అడివిలోకి పోయి కనపడ్డ చెట్లు పేరల్లా వ్రాసుకొని రమ్మన్నాడు. అక్కడ దొరికే మూలికలూ వాటి ప్రయోజనంకూడా వ్రాసుకు రమ్మన్నాడు. చెట్లనుగురించి మాకు తెలియటమే లాభం. నలుగురు నలుగురు కలిసి ఒక జట్టుగా తయారై వెళ్ళిపోయినారు. ఆ నాల్గు రోజులూ ఆ అధికారులు ఏం చెయ్యమంటే, అది మేము చేయాలి.

శివం, నేనూ, ఇంకో ఇద్దరం కలిసాము ఒక జట్టుగా.

క్యాంపుదాటి నాలుగు ఫర్లాంగులు పోయ్యే సరికి అక్కడో క చక్కని మర్రిచెట్టు కనపడ్డది. శివం అక్కడ తపీమని, ఆగి, "అరేయ్ ఇదేం చెట్టురా?" అన్నాడు. "మర్రిచెట్టు" అన్నాను నేను. "సరే ఇల్లారండి, అంటూ తాను వెళ్ళి తలపై ఉత్తరీయం క్రిందపరచి కూర్చోండిరా చూస్తారేం, వెర్రి పీనుగుల్లారా!! కూర్చోండి. ఈ మర్రిచెట్టును గురించి స్టడీ చేద్దాము" అన్నాడు. మేము నలుగురమూ బి. ఏ. లమే కాని ఆ దగ దమ్ముల నందరినీ కలిపి వెర్రి పీనుగులని తిట్టినా ఒక్కడూ మాట్లాడలేదు. అతని సంగతే అంతే అని తెలిసిపోయింది.

కూర్చున్నాము. ఒకాయన "అరేయ్ అబ్బాయి, కూర్చోబెట్టావు సరే ఆయన చెయ్యమన్న పని చేయకపోతే మాటొస్తుంది గదా!" అన్నాడు.

"ఏడ్వావులే కూర్చోరా. నలభైఏళ్ళొచ్చి ఇప్పుడు నువ్వు నేర్చుకు చచ్చేదేమిటి! ఆ మాట కొస్తే, ఆ కమిషనర్ కు వచ్చా ఈ చెట్ల పేర్లన్నీ? ఏదో వాడేదన్న వాడేదంటాడు. మన ఏడుపు మనది అసలు మనం నేర్చుకొందామని వచ్చాంరా? చెప్పవేం? ఆ బోర్డువారు బలవంతపెడితే ఏదోవచ్చాము. అంతేనా! కూర్చో!" అన్నాడు. అదేమి చిత్రమో వాడు చెప్పే మాటలన్నీ నిజం అనిపిస్తయి. వాడితో కాదంటానికి మాలో ఎవ్వరికీ దమ్ములులేవు, నిజమేనని చతికిలబడ్డాము. వాడు ఓ లావుపాటి చుట్టతీసి అంటించాడు. మేమూ యథాశక్తి ధూమ

ప్రాసం చేశాము. కాని ఆ నిమిషంలో నాకు చుట్ట తాగటం లోనే తీపి, దర్జా ఉన్నాయి అనిపించింది. ముఖ్యముఖ్య ఉమ్మేస్తూ సడ్డిగ్ వేసి ఆ చెట్టుక్రింద కూర్చుని, వాడు సర్వీసులో ఉండే మెలకువలూ అధికారులను సంతోషపెట్టే మార్గాలూ, ఇల్లాంటి మరికొన్ని విషయాలమీద ఉపన్యాసం ఇస్తుంటే, తెల్లబోయినాము వాడికున్న అనుభవమూ, వివేకమూ జూచి.

అప్పటికో గంటన్నర అయింది వెళ్ళినవాళ్ళు అందరూ మళ్ళీ క్యాంపుకు చేరుతున్నారు. మేమూ లేచాము. నాకు మట్టుకు గాభరాగా ఉంది. కమిషనర్ ఏమంటాడో అని; ఆ సంగతి కాస్త బైట పెట్టాను. తీరాచూస్తే, ఒక్క శివం తప్ప మిగిలిన వాళ్ళంతా నా మోస్తరే భయపడుతున్నారు. ఒకాయన "వాళ్లు వ్రాసుకొచ్చిన పేర్లు మనంకూడా కాపీజేసి ఆయన ముఖాన పారేద్దాం రా" అన్నాడు. మేమంతా అదే బాగుందని మనస్సులో అనుకొంటున్నాము. ఇంతలో శివం చర్రున లేచాడు తాచుపాములాగ. "ఛా, వెధవ పనులు చేస్తానంటావు. వెర్రిపీనుగా, అల్లా దొంగపనులు చేయటం మన కేం ఖర్మంరా? ఇంత చదువూ చదివి ఇల్లాంటి నీచానికి తయారవుతావా స్కూలు కుర్రాడి లాగ!!" అని ముక్కచీవాట్లు పెట్టాడు. మరి ఏం జేద్దాము రా! అన్నాము. "ఏముంది ? అడుగుతాడు. ఇంతవరకూ ఏంజేస్తున్నారని, మర్రి చెట్టుక్రింద చుట్ట తగలేస్తున్నామని చెప్పండి అన్నాడు. అంతా నవ్వారు కాని అదే మంత విసయమైన జవాబు

కాదని శివాన్ని బ్రతిమాలుకొన్నాము.

"మీరంతా నా వెనకాల ఉండండిరా. ముందు నేను ఆయన కళ్ళు పడతాను. సమాధానం చెప్తాను. మళ్ళీ మాట్లాడకుండా పోతాడు. చూస్తుండండి." అని మాకు అభయహస్తం ఇచ్చాడు. మేమూ సరే నని ఊరుకొన్నాము.

క్యాంపుకు వచ్చిన తరువాత ఓ చెట్టుకింద ఈ గుంపులన్నీ చేరినై. ఒక్కొక్కరి దగ్గరే కాయితాలు వసూలుచేస్తున్నాడు. అయితే తమాషా ఏం జరిగిందంటే, ఇల్లా ఏమీ వ్రాసుకురాకుండా మా మోస్తరుగా ఏదో విషయంగా, ఆ కాసేపు గడిపి వచ్చిన వాళ్లు చాలామంది బైటపడ్డారు. ఆయనమట్టుకు ఏం చేస్తాడు—విసుక్కుంటున్నాడు. మాదగ్గరికి వచ్చే సరికి ఆయనకు బాగా విసుగెక్కింది. ముఖం చిట్లించుకొని మా శివం వంక చూస్తూ, ఏదయ్యా, నీవు వ్రాసిం దేది? అన్నాడు— శివం నిర్లక్ష్యంగా లేనన్నట్లు, చెయ్యూ తలా ఊపి, పెదవి విరిచి చప్పరించాడు. అసలే ఆయన విసుగెత్తి ఉన్నాడు. పైగా ఈ పెంకె ప్రవర్తనవల్ల ఆయనకు బాగా కోపం వచ్చింది. మీరంతా పెద్దవాళ్ళూ తెలిసినవాళ్ళూనూ! చెప్పిన పని చేయకపోతే ఎలాగయ్యా అని విసుక్కున్నాడు. ఇంకా కోపం తీరక శివం వంక చూచి "నువ్వు ఎందుకొచ్చినట్లయ్యా? ఎందుకొచ్చావు ఇక్కడికి?" అని గట్టిగా అడిగాడు కోపంతో. ఆయన పెద్ద గొంతుకతో అల్లాగ అరుస్తుంటే మాకందరికీకూడా భయం వేసింది.

అని శివం తన బట్టతలలో, బాగా నున్నగా ఉన్న భాగాన్ని మునివేళ్ళతో తేలిగ్గా తడుముకొంటూ చూడండి బాబూ, ఈ లమీద వెంట్రుకలు మొలిచే ఉపాయం ఏమన్నా చెబుతాని వచ్చానండి అని తొణకకుండా, వినయంగా జవాబు చెప్పాడు. అక్కడ ఉన్నవాళ్ళంతా గొల్లుమని నవ్వారు. ఆయనా నవ్వు ఆపుకోలేక పోయినాడు. నవ్వి, ఇక ఆ పూటకు తను కట్టిపెట్టి బంగాళాకు వెళ్ళిపోయినాడు. ఆమధ్యాహ్నంలోపున ఈ మాట పాకిపోయిందఅన్ని ఆశ్రమాలల్లో.

అక్కడనుంచి ప్రతివాడూ తీరికచేసుకొని శివం దగ్గరకు వచ్చి "ఏరా బాబూ, ఏమన్నా ఒకటి రెండు వెంట్రుకలా మొలిచినై ఏమో చూడనీయ్" అని వాడి తల నిమురటం మొదలు పెట్టారు. ఆ సాయంత్రందాకా వాడి తల మర్దన చేస్తునే ఉన్నారు.

౫

స్కౌట్ క్యాంపు అయిపోయింది. ఎవరి దారిని వారు వెళ్ళిపోతున్నారు. శివంకూడా ప్రయాణం అయినాడు పొట్టిలాగు కాకీ షర్టు సంచీలో పెట్టేసి, ధోవతీ కట్టుకొని, షర్టుతోడు స్కూలి పైన కోటు వేసుకొన్నాడు. బస్సు దగ్గరకు నడిచిపోతున్నాము. దారి పొడుగునా అతడేవో మాటలు చెప్పి నవ్విస్తునే ఉన్నాడు.

అందరూ నవ్వుతున్నారు నేనూ నవ్వుతున్నాను. కాని శివం మొదటిరోజున నన్ను అంతమాట అని మనస్సు కష్టపెట్టాడే అని బాధపడుతూనే ఉన్నాను మొదటే తగిన జవాబు చెప్పలేక పోయినాను. ఇక విడిపోయే సమయము వచ్చింది. ఇప్పుడైనా కసి తీర్చుకోలేకపోతే నాకు మనఃశ్శాంతి ఉండేటట్లు కనపడలేదు. అందుకని ఏదో ఒకమాట కసి తీరా అందామని నిశ్చయించుకొన్నాను.

దారిన నడుస్తున్నాము. పదిమంది అతనిచుట్టూ చేరి ఉన్నారు. ఆ సమయంలో నేనెత్తుకొన్నాను. "అరే శివం. మొదటి రోజున నన్ను జూచి, నీవు వెర్రి వెంగళప్పలాగ ఉన్నావు అని అన్నావు నన్ను. నీవూ...నిజానికి...నాకంటే శుద్ధ వెర్రి వెంగళప్ప లాగున్నావే?" అన్నాను. అంతా పకపకా నవ్వారు. నా కసి కొంతవరకు తీరిందని సంతోషించాను.

ఈమాట విని శివం, పోతున్నవాడల్లా ఠపీమని ఆగి, నన్ను ఎగాదిగా చూసి, నా అంత తెలివి తక్కువ వాడ్ని తన కన్నులో ఎప్పుడూ చూడనట్లు చూస్తూ, ఓరి ఫూలా, ఆ సంగతి కనుక్కోటానికి నీ కిన్నిరోజులు పట్టిందిరా! అన్నాడు. అంతా మళ్ళీ పకాపకా నవ్వారు. నా సంగతి వాడు నాడే చూడటంతోనే కనుక్కున్నట్లూ, వాడు శుద్ధ వెర్రి వెంగళప్ప అన్న సంగతి కనుక్కోటానికి నాకు ఇన్ని రోజులు పట్టటంమూలాన

మళ్ళీ నేనే తెలివి తక్కువ వాడినైనట్లూ తేల్చాడు. దాంతో నేను మళ్ళీ మాట్లాడలేను. ఇంత, చమత్కారంగా మాట్లాడగలిగినవాడు నిజంగా నాకంటె తెలివైన వాడేనని నేను మనస్సులో ఒప్పుకున్నాను. వానియందు నాకు పూర్వం కంటే ఎక్కువ అభిమానమూ, గౌరవమూ, కలిగినయి.

తోట దగ్గరనుంచి ఊళ్ళోకి చేరాము. అప్పటికి మాలో కొందరు ఊళ్ళో బంధువుల ఇండ్లకు వెళ్ళి పోయినారు కొందరు బస్సులమీద వెళ్ళారు మేమిద్దరం మాత్రం స్టేషనుకు వెళ్ళాం ఓ బస్సు మీద. ప్రయాణంలోకూడా వాడు ఎవరితోనో ఒకరితో వేళాకోళంగా మాట్లాడి నవ్విస్తునే ఉన్నాడు.

స్టేషను దగ్గర ఒక వంటపూటింట్లో భోజనం చేసి, స్టేషనుకు ఎదురుగా ఉన్న ఇసుక తిన్నెపై కూర్చున్నాము. రైలు రావటానికి అప్పటికి మాకింకా రెండుమూడు గంటల టైముంది.

చక్కని వెన్నెల. హాయి అయినగాలి. ఉన్నది మేము ఇద్దరమే కాబట్టి ఏమంత మాట్లాడటానికి అవకాశం లేకపోయింది. అదీగాక శివం ఎందుచేతో ఆలోచనలో పడి నన్ను నా ఆలోచనలకు వది లేశాడు.

నేనూ ఆలోచనలో పడ్డాను. శివాన్ని గురించేనా ఆలోచన ఇతనెంత అదృష్టవంతుడా అనుకొన్నాను చీకూ చింతా లేకుండా నిర్విచారంగా కాలం గడుపుతున్నాడు. ఈ వెన్నెల రాత్రి వలెనే అతని జీవితం వెళ్ళిపోతుంది. తాను నవ్వుతాడు. ఒకరిని నవ్విస్తాడు. జీవితం అంతా అల్లాగ గడిపేస్తాడు.

ఏదో గొప్ప అదృష్టం అని! ఆతడికి ఏ విచారాలు లేవు-గా బోలు. నాకర్మమే ఇల్లా కాలించివేసిందేమో!! కొందరిని దిగమ్రింగిన ఈ దుఃఖదేవత ఆతనిని కన్నెత్తి చూడక పోవటానికి ఆయన లోఉండే మహత్తరమైన శక్తి ఏమిటో!--జీవితం నాకీ తీ బరువైంది. ఆయనకువలె బహు తేలిగ్గా జీవిస్తే బాగుండును, అని అనుకుంటూ ఉన్నాను.

అంతవరకూ మాట్లాడకుండా ఉన్న శివుడులిక్కిపడి లేచి, కళ్ళారుప్పని. అరేయ్--ఈసిగరెట్టు కాల్చు, లే, అన్నాడు. మళ్ళీ ఏదో ధ్యానిని సాగించాడు.

చెరో సిగరెట్టు వెలిగించాము "అరే శివం నీకెంతమంది పిల్లలు?" అని అడిగాను నేను.

"నాకా?......అని నక్షత్రాలవంక చూస్తూ పోయినవాళ్ళు పోగా ఇద్దరూ అన్నాడు.

పోయినవాళ్ళూ పోగా అంటున్నావు......అని ఆప్రశ్న పూర్తి చేయకుండా ఊరుకొన్నాను. "అవునురా అబ్బాయి. నా కంఠమాలలో నుంచి రెండు మంచి ముత్యాలు రాలిపోయినై ముద్దరుకుమార్తెలు ఒక్క రోజున......రత్నాలు......ఏదో ఎందుకులే......"అన్నాడురుద్ధకంఠంతో. దుఃఖాన్ని ఎంత గెంటినా అదిఅతని కంఠంనులిపేస్తున్నట్టు తెలుస్తునే ఉంది. విషాదచ్ఛాయలు అప్పుడుకనపడ్డై నాకు ఆతని ముఖంలో! నాకు ఆశ్చర్యంగలిగింది, ఇంత దుఃఖంకడుపులో పెట్టుకొని పీడుఅంత ఆనందంగా ఎట్లా తిరగగలిగాడా అని. "నీజీవితమూ...... అంతే